తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 235 పేజీలు: 10+4 వెల: 6.50



మొజాయిక్ గత వారం వార్తలపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



రేపు జంటనగరాల్లో గణేశ నిమజ్జన సెలవు 2

సూపర్ ఎల్‌నినోతో 4.5 లక్షల మరణాలు! 7


## జూరాలకు 3 టిఎంసిల

# కర్ణాటక జలాలు

**10 రోజుల పాటు వారాబందీ విధానంలో నీరు విడుదల చేస్తామని కన్నడ సిఎం డికె హామీ**

**2 దఫాలుగా చర్చలు జరిపిన మంత్రులు జూపల్లి, వాకిటి**



బుధవారం బెంగళూరులో కన్నడ సిఎం డికె శివకుమార్‌తో భేటీ అయిన మంత్రులు జూపల్లి, వాకిటి ఇతర నాయకులు

**హైదరాబాద్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టుకు దశవారిగా మూడు టిఎంసిల నీటి విడుదలకు కర్నాటక ముఖ్యమంత్రి డికెశివకుమార్ సమ్మతి తెలిపారు. తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి,జూపల్లి కృష్ణారావులు దక్షిణ తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులు సాగు,తాగునీరు ఇబ్బందులు మంగళవారం రాత్రి బుధవారం ఉదయం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమై వివరించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్‌తో జరిగిన సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, జూరాల ప్రాజెక్టు వద్ద నీటి మట్టం, సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. తెలంగాణ రైతుల >>2



## 2 డిఎలకు సర్కార్ ఓకే

**ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం**

**పిఆర్‌సి ముహూర్తం, సిపిఎస్‌పై కీలక నిర్ణయం**

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నిరీక్షణకు తెరపడనుంది. ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు ఒక కొలిక్కి రావడంతో అవి సఫలమయ్యాయి. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు >>2

## విజయదశమికి పూర్తిస్థాయిలో

# యాదాద్రి వెలుగులు

**విద్యుత్ ఉత్పత్తికి చర్యలు**

**జి-9 గ్రేడ్ బొగ్గుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో తక్షణమే భట్టి చర్చలు**

**విద్యుత్‌పై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్**



బుధవారం హైదరాబాద్‌లో విద్యుత్ సమీక్షలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సూచించారు.విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రితో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో బుధవారం ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ -9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ- 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ -9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు. జీ -9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా >>2

# గుండెలపై సౌండ్‌'వార్'

**డిజె శబ్దంతో మృత్యుఘంటికలు**

**140 డెసిబిల్స్ వింటే శాశ్వత చెవుడు**

**150 డిబిల శబ్దంతో గుండెపోటు**




## డిజెకి కనీసం వంద మీటర్ల దూరంలో ఉండాలి

**కఠిన చట్టాలు అవసరం**

ప్రభాతవార్త / నెట్‌వర్క్

ఒకప్పుడు పండగలు, ఉత్సవాలు, జాతరలు వస్తే ఆనందానికి అంతు ఉండేది కాదు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకునేవారు. అయితే డిజే వచ్చిన తరువాత పరిస్థితులు తారుమారు >>2



**కో ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖాశర్మ**

**ఎపి ఇన్‌చార్జిగా అరవింద్ భదౌరియా**

## తెలంగాణకు బిజెపి ఇన్‌చార్జిగా

# సునీల్ బన్సల్

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** బీజేపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, కోఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఈ నియామకాలను ప్రకటించారు. అందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ >>2




# గుండెలపై సౌండ్‘వార్’

>> అయ్యాయి. కొన్ని సందర్భాల్లో డీజే మోతకు కొందరు ప్రాణాలు కోల్పోతుంటే మరికొందరు శాశ్వత వినికిడి సమస్యను, ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అసలు డిజే వల్ల కలిగే సమస్యలపై దృష్టి సారిద్దాం. డీజే శబ్దాన్ని ఒక నిరిష్ట డెసిబిల్స్ (డిబి) వరకు మాత్రమే కర్ణభేరి తట్టుకుంటుంది. శబ్దం ఎక్కువ అయ్యే కొలదీ రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. మెదడులో నరాలకు తీవ్ర వత్తిడికి గురౌతాయి. కండరాలు తీవ్రస్థాయిలో కదలికలను వ్యక్తం చేస్తుంది. దీనితో డిజేకి అతి దగ్గరగా ఎక్కువ సమయం నిలబడిన వ్యక్తి క్రమంగా ఉద్వేగానికి గురై పడిపోతాడు. శరీరంలో అనేక సమస్యలు తలెత్తుతాయి. కొన్ని అవయవాలు త్వరగానే పూర్వ స్థితికి వస్తాయి. కొన్ని మాత్రం శాశ్వతంగా పనిచేయడం మాని వేస్తాయి. దీనితో వైకల్యం కాని. ప్రాణహానీ కాని



కలుగుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ శబ్దాన్ని భరించే శక్తి వయస్సు, లింగబేధం, ఆరోగ్య సమస్యలపై అధారపడి ఉంటుంది. అంతే కాకుండా ఎంతసేపటి నుంచి వింటున్నారన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా 85 డిబికి పైగా ఎక్కువసేపు ఉంటే వినికిడి నష్టం ప్రమాదం స్థాయిపెరుగుతుంది.

100-110 డిబీలు కొన్ని నిమిషాల్లోనే చెవికి హాని కలగవచ్చు. ఇక 120 డిబీ పైగా వింటే చెవిలో నొప్పి / తీవ్ర అసౌకర్యం కలగవచ్చు. అకస్మాత్తుగా వచ్చే చాలా పెద్ద శబ్దం తక్షణ నష్టాన్ని కలిగించవచ్చు. 140 డిబీ దగ్గర లేదా అంతకంటే ఎక్కువ శబ్దం ఉంటే కర్ణభేరి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

**ముఖ్యంగా:** కర్ణభేరి పగలకపోయినా, డీజే శబ్దం లోపలి చెవిలోని సున్నితమైన హెయిర్ సెల్స్‌ను దెబ్బతీసి శాశ్వత వినికిడి లోపం లేదా చెవుల్లో మోత శబ్దం కొన్ని రోజులవరకు కలిగించవచ్చు. మరికొందరికి చికిత్స తీసుకున్నా ఇది జీవితాంతం ఉండే ప్రమాదం కూడా ఉంది. డిజేలో వచ్చే అధిక శబ్దం వల్ల ఆరోగ్యంపై ప్రభావం ప్రధానంగా శబ్ద తీవ్రత, ఎంతసేపు వింటున్నారు, స్పీకర్‌కు ఎంత దగ్గరగా ఉన్నారు అనే విషయాలపై ఆధారపడి ఉంటుంది.

**డీజే శబ్దం వల్ల వచ్చే సమస్యలు**

**వినికిడి తగ్గడం:** ఎక్కువ శబ్దానికి పదేపదే గురైతే శాశ్వత వినికిడి సమస్య రావచ్చు.

**కర్ణభేరి దెబ్బతినడం:** చాలా పెద్ద శబ్దం వల్ల కర్ణభేరికి గాయం లేదా అరుదుగా చీలిక కూడా సంభవించవచ్చు.

**చెవుల్లో మోత / గింగిరాలు :** డిజే తర్వాత చెవుల్లో గంటలు మోగుతున్నట్లు అనిపించడం ఒక హెచ్చరిక. చెవి నొప్పి, చెవులు మూసుకుపోయినట్లు అనిపించడం.

**తలనొప్పి, తల తిరగడం, అలసట. నిద్రకు ఆటంకం:** ముఖ్యంగా రాత్రి వేళ ఎక్కువ శబ్దం వల్ల. ఒత్తిడి, చిరాకుతో అలసట కారణంగా రోగనిరోధక శక్తి తగ్గుతుంది.

**గుండెపై ప్రభావం:** అధిక శబ్దం వల్ల శరీరంలో విపరీతమైన వత్తిడి పెరిగి గుండె వేగం, రక్తపోటులో తాత్కాలిక మార్పులు రావచ్చు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్త వహించాలి. ఈ కారణంగా ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు అధిక రక్తపోటు ఉన్నవారు వృద్ధులు డిజే స్పీకర్లకు చాలా దగ్గరగా ఎక్కువసేపు ఉండకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డిజే వద్ద ఎక్కువ సేపు నిలబడటం వల్ల ఛాతి నొప్పి / బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరం చట్టబడటం, ఒక్కసారిగా చెమట పట్టడం, తల తిరగడం లేదా నొప్పి చేతి / దవడకు వ్యాపించడం ఉంటే, శబ్దం నుంచి వెంటనే దూరంగా వెళ్లి అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి.

**చట్టాలు ఏమి చెబుతున్నాయి?**

సౌండ్‌ను పూర్తిగా నిషేధించే ఒకే ఒక్క చట్టం కాకుండా, శబ్ద కాలుష్యం, పోలీస్ అనుమతులు, సమయ పరిమితులు, డెసిబెల్ పరిమితులు వంటి అనేక నిబంధనలు వర్తిస్తాయి. నాయిస్ పొల్యూషన్ రెగ్యులేషన్ రూల్ 2000 వర్తిస్తుంది. డిజే గాని, అధిక శబ్దాన్ని ఇచ్చే లౌడ్ స్పీకర్‌లను గాని వినియోగించాలంటే ఈ నిబంధన కింద అధికారుల నుంచి లిఖితపూర్వక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.



బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గిరీష్ కుమార్ సంఘీ. చిత్రంలో ఫెడరేషన్ ప్రతినిధులు సురేష్ అగర్వాల్, బద్రి విశాల్ బన్సల్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కె మల్లిఖార్జున్ ఉన్నారు.

## అక్టోబర్ 11న మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలు

### గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించిన డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** అక్టోబర్ 11వ తేదీన నగరంలో మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరు కానున్నారు. ఈ మేరకు బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను అఖిల భారత వైశ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు,మాజీ ఎంపీ, వార్త దినపత్రిక సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ మర్యాద పూర్వకంగా కలిసి మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. బంజారాహిల్స్‌లోని అగ్రసేన్ చౌరస్తాలో మహారాజా అగ్రసేన్ విగ్రహాన్ని మాజీ రాష్ట్రపతి ప్రతిభాపాటిల్, నాటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు.
మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు ప్రతి ఏటా ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు,రాష్ట్ర మంత్రులు, స్పీకర్లు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరై పూజా కార్యక్రమాలు,వేడుకలలో పాల్గొంటారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మరో కేంద్ర మంత్రి జెపీ నడ్డా హాజరయ్యారు. గత ఏడాది ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈసారి కూడా అనేక మంది ప్రముఖులు హాజరుకానున్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో గిరీష్‌కుమార్ సంఘీతో పాటు అఖిల భారత వైశ్ ఫెడరేషన్ ప్రతినిధులు సురేష్ అగర్వాల్, బద్రి విశాల్ బన్సల్, గోపాల్ మోర్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి, వాసవి ఆసుపత్రి చైర్మన్ కొండ్లె మల్లిఖార్జున్ ఉన్నారు. మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకల నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా సహకారం అందిస్తుంది.

## 2 డిఎలకు సర్కార్ ఓకే

>> భత్యం నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రాథమికంగా రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎస్ సంజయ్ జాజూతో బుధవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ రెండు డీఏలలో మొదటి డీఏను వచ్చే నెల అక్టోబర్‌లో జీతంతో కలిపి ఇవ్వనున్నారు. మరో డీఏను వచ్చే ఏడాది ఉగాది పండుగకు ఇచ్చేందుకు గ్నీన్ సిగ్నల్ ఇచ్చింది ప్రభుత్వం. అలాగే పీఆర్సీ కమిషన్ నివేదికను తెప్పించి, రాబోయే ఒకటి లేదా రెండు నెలల్లోనే వేతన సవరణను అమలు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించారని సమాచారం. కాగా ప్రస్తుతం రూ.10 వేల కోట్లకు పైగా ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల పాత బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. గత పది నెలలుగా నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున విడుదల చేస్తున్న నిధులను రూ.2 వేల కోట్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు పట్టుబడుతున్నాయి. దీని ద్వారా ఉద్యోగులకు రూ.వెయ్యి కోట్లు, పెన్షనర్లకు మరో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరుతున్నాయి. సంక్షేమ పథకాల వ్యయాన్ని సైతం సర్దుబాటు చేస్తూ ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, ఈ నెలవారీ నిధుల కేటాయింపును మరికొంత పెంచే విధంగా ప్రకటనకు రంగం సిద్ధం అవుతోంది. మరోపక్క ప్రధానమైన డిమాండ్ గా ఉన్న పీఆర్సీ నివేదిక కోసం ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, కమిషన్‌కు లేఖ రాశారు. ఉద్యోగులు 51 శాతం ఫిట్‌మెంట్ డిమాండ్ చేస్తుండగా, ప్రభుత్వం ఎంత శాతం ప్రకటిస్తుందనే ఆసక్తిగా మారింది. ఇక సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించేందుక మూడు నెలల కాలల పరిమితితో ప్రభుత్వం ఇదివరకే ఒక కమిటీని వేసింది. నిర్ణీత గడువులోగా నివేదిక తెప్పించుకుని ఉద్యోగులకు స్పష్టమైన హామీ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 6న ఉద్యోగ సంకల్ప సభ నిర్వహించామని తెలిపారు. మొత్తం 68 డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం సానుకులంగా స్పందించిందని.. అన్ని సమస్యల పరిష్కారానికి మార్గం చూపించినట్లు తెలిపారు. తమ డిమాండ్ల విషయంలో చొరవ తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదటి డీఏ 3.64, రెండో డీఏ 2.74 కు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

## జూరాలకు 3 టిఎంసిల కర్ణాటక జలాలు

>> పరిస్థితిని కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్ సానుకూలంగా అర్థం చేసుకొని వెంటనే ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. చలువరాయస్వామి, కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. షాలిని రాజనీష్‌తో మాట్లాడి, తెలంగాణకు సహాయం చేయాలని, వీలైనంత త్వరగా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.కర్ణాటకలోనూ నీటి కొరత, ఇబ్బందులు ఉన్నప్పటికీ తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 10 రోజుల పాటు వారాబంధీ విధానంలో నీటిని విడుదల చేస్తామని కర్ణాటక సిఎం శివకుమార్ తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకటి శ్రీహరి హామి ఇచ్చారు. కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్, నీటిపారుదల శాఖ మంత్రి చలువరాయస్వామి, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. బోస్ రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇరిగేషన్), సిఎం సలహాదారు, ఇతర అధికారులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 20న తెలంగాణ సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు లేఖ రాశారని మంత్రులు జూపల్లి కృష్ణారావులుచ,వాకిటి శ్రీహరి అన్నారు. అనంతరం కర్ణాటక ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.
జూరాలతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రులుతెలిపారు. రైతుల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సాగునీటి శాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల నుంచి సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు.
రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## యాదాద్రి వెలుగులు

>> నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు. అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ -9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పంపులకు విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.
అన్ని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థంతో ఉత్పత్తి చేసేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. జెన్ కో కు సింగరేణి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలోనూ ఆటంకాలు ఉండొద్దని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజ య్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావుతో పాటు ఇంధన శాఖ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**24-09-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.త్రయోదశి రా.11.14, న.ధనిష్ఠ ఉ.10.32
వ.సా.5.58 - రా.7.37
దు.ఉ.9.58 - ఉ.10.46
2) మ.2.48 - 3.36
రాహు మ.1.30-3.00, శుభ స. ఉ.7.00 - ఉ.8.00.

## వార్తాఫలం

**మేషం:** లౌక్యం లోపించడం వలన కొన్ని సమస్యలు ఏర్పడినా దైవానుగ్రహం వలన చెప్పుకోదగిన ఇబ్బందులేర్పడవు.

**వృషభం:** వైజ్ఞానిక విషయాలు ఆకర్షిస్తాయి. ఋణం ఇవ్వడం తీసుకోవడం రెండూ తగదు. నూతన వస్తుకొనుగోలు.

**మిథునం:** మిత్రబృందాలతో జరిపే చర్చలు ఆహ్లాదకరంగా సాగుతాయి. ఇతరుల మితిమీరిన సలహాలు విసుగుపుట్టిస్తాయి.

**కర్కాటకం:** కాలానుగుణంగా మార్పులు అవసరమని భావిస్తారు. రచనా,వ్యాసంగాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు.

**సింహం:** శుభకార్యాలకు సంబంధించిన విషయంలో మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. అనుకోని అవకాశాలు లాభిస్తాయి.

**కన్య :** మిత్రబృందాలతో జరిపే చర్చలు ఆహ్లాదకరంగా సాగుతాయి. అన్యభాషలు నేర్చుకోవాలనే ఆలోచనలు మెదులుతాయి.

**తుల:** స్వయం ఉపాధిపథకాలకు గాను ప్రభుత్వ సహాయం లభిస్తుంది. ప్రజా సంబంధాలు విస్తృత పరచుకోగలుగుతారు.

**వృశ్చికం:** ఆలోచనలు మెరుగైనవే అయి నప్పటికీ పనులలో జాప్యం ఏర్పడుతుంది. వాహన సౌఖ్యం.

**ధనుస్సు:** సమాజంలోని ఉన్నత స్థాయి వర్గం వారు కూడా మీ సలహాలను స్వీకరిస్తారు. నూతన వస్తుకొనుగోలు.

**మకరం:** ఒక సందర్భంలో మానసికోద్రేకాన్ని కలిగి ఉంటారు. మంచి అవకాశాలు లభిస్తాయి.

**కుంభం:** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పే వారు అధికమవుతారు. ఇతరులకు అనాలోచితంగా వాగ్దానాలు చేయవద్దు.

**మీనం:** వ్యక్తిగత విషయాలకన్నా, వృత్తి ఉద్యోగాలకు ప్రాముఖ్యత నిస్తారు. ఇతరులు చెప్పేది ఓర్పుగా వింటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## బిజెపి ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్

>> బాధ్యతలు అప్పగించగా.. ఆ రెండు రాష్ట్రాలకు సిద్ధార్థ్ శంభు కోఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను సునీల్ బన్సల్‌కు అప్పగించారు. తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కోఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు అరవింద్ భదౌరియా,కో-ఇన్‌చార్జ్‌గా వనతి శ్రీనివాసన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఒడిశా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఏపీ బిజెపి ఎంపీ పురందేశ్వరిని,తమిళనాడు కో-ఇన్‌చార్జ్‌గా తెలంగాణ బిజెపి ఎంపీ డికె అరుణ పేర్లను ప్రకటించింది. బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహ కోఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షించనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కోఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక.. ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యాల్, దర్శనా జర్దోష్ కోఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. బీజేపీ మరో ఉపాధ్యక్షుడైన రామ్ మాధవ్‌కు ఉత్తరాఖండ్ బాధ్యతలు అప్పగించగా.. అరవింద్ మీనన్, బాన్సురీ స్వరాజ్ ఆయనకు అసోసియేట్స్‌గా నియమితులయ్యారు.

## రిమ్స్ అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**ఆదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పరిహారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అవసరమైతే చిన్నారులను హైదరాబాద్‌లోని కార్పొరేట్, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
**ఫారం - 7**
(చట్టం - 30/2013లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్-(1) రూల్ 25 ప్రకారం)
**రూఢీ ప్రకటన**

ఇ1/770/2026 — తేది: 11.08.2026
ఫైల్ నెం. సి/44/2023 — తేది : 04.08.2026

[illegible]

**షెడ్యూల్**

గ్రామం : వనిపాకల — మండలం : చిట్యాల — జిల్లా : నల్లగొండ

| క్రమ సంఖ్య | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి/పట్టా/ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 169 పట్టా/తరి 0.15¼ | 0.13 | అప్పల మల్లయ్య తండ్రి కిష్టయ్య కంబాలపల్లి మల్లయ్య తండ్రి పిచ్చయ్య | -- |
| 2 | | 0.02 ¼ | రావుల సుధాకర్‌రెడ్డి తండ్రి : సత్తిరెడ్డి | -- |
| 3 | 170 పట్టా/తరి 0.02¼ | 0.00 ¼ | అప్పల మల్లయ్య తండ్రి కిష్టయ్య | -- |
| 4 | | 0.02 | రావుల సుధాకర్‌రెడ్డి తండ్రి : సత్తిరెడ్డి | -- |
| 5 | 168 పట్టా/తరి 0.08 | 0.02 ¾ | రావుల సుధాకర్‌రెడ్డి తండ్రి సత్తిరెడ్డి | -- |
| 6 | | 0.01 ¼ | మిడిదొడ్డి కుమారి భర్త: లింగయ్య | -- |
| 7 | | 0.01 | మిడిదొడ్డి వెంకటేష్ తండ్రి బుచ్చి రాములు | -- |
| 8 | | 0.01 | మిడిదొడ్డి వసంత భర్త యాదయ్య | -- |
| 9 | | 0.01 | మిడిదొడ్డి గోపాల్ తండ్రి బుచ్చి రాములు | -- |
| 10 | | 0.01 | మిడిదొడ్డి సైదులు తండ్రి మారయ్య | -- |
| 11 | 165 పట్టా/తరి 0.20¼ | 0.00 ½ | మిడిదొడ్డి కుమారి భర్త లింగయ్య | -- |
| 12 | | 0.00 ½ | మిడిదొడ్డి వెంకటేష్ తండ్రి బుచ్చి రాములు | -- |
| 13 | | 0.00 ½ | మిడిదొడ్డి వసంత భర్త యాదయ్య | -- |
| 14 | | 0.00 ¼ | మిడిదొడ్డి గోపాల్ తండ్రి బుచ్చి రాములు | -- |
| 15 | | 0.00 ¼ | మిడిదొడ్డి సైదులు తండ్రి మారయ్య | -- |
| 16 | | 0.03 | మిడిదొడ్డి వెంకటయ్య తండ్రి మారయ్య | -- |
| 17 | | 0.03 | మిడిదొడ్డి సైదులు తండ్రి మారయ్య | -- |
| 18 | | 0.03 ¼ | మిడిదొడ్డి లక్ష్మయ్య తండ్రి మారయ్య | -- |
| 19 | | 0.01 ¾ | మిడిదొడ్డి కృష్ణయ్య తండ్రి ఈశయ్య | -- |
| 20 | | 0.01 ¾ | మిడిదొడ్డి రాములు తండ్రి బచ్చయ్య | -- |
| 21 | | 0.01 ¾ | మిడిదొడ్డి అంజయ్య తండ్రి రామలింగయ్య | -- |
| 22 | | 0.01 ½ | మిడిదొడ్డి [illegible] తండ్రి అంజయ్య | -- |
| 23 | | 0.02 ¼ | మిడిదొడ్డి భరత్‌కుమార్ తండ్రి మల్లయ్య | -- |
| 24 | గ్రామ కంఠం 0.11 | 0.10 | మిడిదొడ్డి భరత్ కుమార్ తండ్రి మల్లయ్య | పైప్‌లైన్ 1 దానిమ్మ 1 మునగ, 2 వేప |
| 25 | | 0.01 | మిడిదొడ్డి వెంకయ్య తండ్రి యాదయ్య | -- |
| 26 | 166 పట్టా/తరి 0.00¼ | 0.00 ¼ | మిడిదొడ్డి భరత్ కుమార్ తండ్రి మల్లయ్య | -- |
| 27 | 163 పట్టా/తరి 0.09 | 0.09 | మిడిదొడ్డి వెంకయ్య తండ్రి యాదయ్య | వేప చెట్లు-4 మునగ-2 పైప్‌లైన్ 1 |
| 28 | 162 పట్టా/తరి 0.05½ | 0.01 | కొత్త నారాయణరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | -- |
| 29 | | 0.04 ½ | కొత్త నారాయణరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | -- |
| 30 | 161 పట్టా/తరి 0.11¼ | 0.03 ¼ | గోపగని లింగస్వామి తండ్రి వెంకయ్య | పైప్‌లైన్ |
| 31 | | 0.04 ¾ | కొత్త నారాయణరెడ్డి తండ్రి సత్తిరెడ్డి | బావి 1 రాతి |
| 32 | | 0.03 ½ | గోపగని లింగస్వామి తండ్రి వెంకయ్య | -- |
| 33 | 159 పట్టా/తరి 0.27¾ | 0.04 ¼ | గోపగని లింగస్వామి తండ్రి వెంకయ్య | -- |
| 34 | | 0.11 | రావుల స్వరూప భర్త సత్తిరెడ్డి | 3 బోర్లపైప్‌లైన్ 3 కొబ్బరి, 10కు |
| 35 | | 0.12 ½ | రావుల మధుసూదన్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి | -- |
| 36 | 158 పట్టా/తరి 0.03¾ | 0.00 ½ / 0.03 ¼ | రావుల మధుసూదన్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి / రావుల స్వరూప భర్త సత్తిరెడ్డి | 1 బోర్ 1 పైప్‌లైన్ / -- |
| 37 | 156 పట్టా/తరి 0.20¼ | 0.01 ¼ | గోపగని లింగస్వామి తండ్రి వెంకయ్య | -- |
| 38 | | 0.01 | రావుల [illegible] రెడ్డి తండ్రి లింగారెడ్డి | -- |
| 39 | | 0.09 | రావుల స్వరూప భర్త సత్తిరెడ్డి | సుబాబుల తోట |
| 40 | | 0.04 ½ | రావుల స్వరూప భర్త సత్తిరెడ్డి | -- |
| 41 | | 0.04 ½ | రావుల మధుసూదన్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి | -- |
| 42 | 150 పట్టా/తరి 0.18 | 0.18 | కొత్త వెంకట్ రెడ్డి తండ్రి లింగారెడ్డి | సుబాబుల తోట |
| | మొత్తం విస్తీర్ణం | 3.32½ | | |

[illegible]

సం/-.ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఏ. విభాగము-2, నల్లగొండ — సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ — సం/-. జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO.NO: 902/LA/PP/Advt/Pub/2026-27



**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN:L36911RJ1996PLC011381)
**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 23660000674060 & 24660001708569 , సభావత్ రమేష్ (రుణగ్రహీత) పత్లవత్ జ్యోతి (సహ-రుణగ్రహీత) | 11-జూన్-25 రూ.5,10,755/-, ఐదు లక్షల పది వేల ఏడు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే మరియు రూ.2,82,253/- రెండు లక్షల ఎనభై రెండు వేల రెండు వందల యాభై మూడు రూపాయలు మాత్రమే 04-జూన్-25 నాటికి | 19-సెప్టెంబర్-26 |
| (Loan A/C No.) 23660001583023 శతర్ల నరేష్ రుణగ్రహీత, మాండ్ల సాయి లక్ష్మి సహ-రుణగ్రహీత | 21-మే-26 రూ.7,54,545/-, ఏడు లక్షల యాభై నాలుగు వేల ఐదు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే 21-మే-26 నాటికి | 19-సెప్టెంబర్-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ (1): వనపర్తి మున్సిపాలిటీ మరియు జిల్లా పరిధిలోని నాగవరం గ్రామంలో ఉన్న ఆస్తి ఇంటి నం. 8-44. ఇది 152.53 చదరపు గజాల స్థలంలో విస్తరించి ఉంది; ఇందులో 140 చదరపు అడుగుల విస్తీర్ణంతో RCC నిర్మాణం మరియు 140 చదరపు అడుగుల విస్తీర్ణంతో టిన్ షెడ్ నిర్మాణం ఉన్నాయి. ఈ ఆస్తిలో నిర్మించబడిన RCC భవనం మరియు దానికి అనుబంధ తలుపులు, చట్రాలు, అల్మారాలు, వెంటిలేషన్లు, కిటికీలు, అంతస్తులు మరియు పైకప్పు నిర్మాణాలు, వైరింగ్, పెరడు, వాస్తు నిర్మాణాలు, నాలుగు వైపుల గోడలు మొదలైనవి, అలాగే ఆ భవనానికి సంబంధించిన అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌లు ఇందులో చేరి ఉన్నాయి. సరిహద్దులు: తూర్పున 12 అడుగుల రోడ్డు, పడమరన 12 అడుగుల రోడ్డు, ఉత్తరాన ఎస్. వెంకటేష్ నాయక్ ఇల్లు, దక్షిణాన జగన్ నాయక్ ఇల్లు.

తనఖా పెట్టిన ఆస్తి వివరణ (2): (తేదీ: 12-07-2023 నాటి నమోదిత ఇంటి సెటిల్మెంట్ డీడ్ పత్రం నం. 9808/2023 ప్రకారం) వనపర్తి పట్టణం మరియు జిల్లాలోని శ్రీనివాసపూర్‌లో ఉన్న ఆస్తి వివరాలు: 30 X 40 = 133.33 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలంలో నిర్మించబడిన ఇల్లు పాత ఇంటి నం. 2-67, కొత్త ఇంటి నం. 1-34: ఇంటి నిర్మాణ విస్తీర్ణం 28.8 X 24.4 = 697.29 చదరపు అడుగులు. దీని సరిహద్దులు: తూర్పున - దాతకు మిగిలిన ఖాళీ స్థలం, పడమరన - [illegible] పెద్ద గట్టు ఇల్లు, ఉత్తరాన - రోడ్డు, దక్షిణాన - [illegible] ఇల్లు.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదవబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".
ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 23/09/2026 — ప్రదేశం : మహబూబ్‌నగర్, తెలంగాణ — అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

**ఐటి కారిడార్‌లో ఘోరం**

## క్యాబ్ ఎక్కుతుండగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి
# ముద్దుపెట్టిన సెక్యూరిటీ గార్డు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** ఎంతటి పటిష్ట చర్యలు తీసుకున్నా ఐటి కారిడార్ పరిధిలో మహిళల మీద అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా గచ్చిబౌలి నడిబొడ్డున క్యాబ్ ఎక్కుతున్న మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఓ సెక్యూరిటీగార్డు అందరూ చూస్తుండగా ముద్దు పెట్టి పారిపోయారు. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌కు చెందిన బాధిత యువతి (24) గచ్చిబౌలి ఐటి కారిడార్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తూ గచ్చిబౌలి ఇందిరానగర్‌లోగల ప్రైవేటు హాస్టల్‌లో నివాసం ఉంటుంది. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బాధిత యువతి కార్యాలయానికి వెళ్లేందుకు క్యాబ్ ఎక్కుతుండగా, ఓ వ్యక్తి వెనుక నుంచి హఠాత్తుగా వచ్చాడు. ఒక్కసారిగా యువతిని పక్కకు లాగి అందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద యువతికి ముద్దుపెట్టాడు. ఈ హఠాత్ పరిణామంతో భయానికి గురైన యువతి బిగ్గరగా అరవడంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం స్థానికుల సహాయం తో యువతి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. స్థానికంగా ఉన్న సిసి కెమెరాల ఆధారంగా ముద్దుపెట్టిన వ్యక్తిని ఇందిరానగర్‌లోని సంతోష్ దాబాలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు రాజకుమార్(25)గా గుర్తించారు. జార్ఖండ్‌కు చెందిన రాజకుమార్ నగరానికి వచ్చి సంతోష్ దాబాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి
# ఇంట్లో పేకాట స్థావరం
### ఆయనతోపాటు ముగ్గురు అరెస్టు
### రూ.11,600 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం



పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

**సిద్దిపేట,సెప్టెంబరు 23, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఇంట్లో పేకాట ఆడుతుండగా టూ టౌన్ సిఐ మురళి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పోలీసులు మెరుపు దాడిచేసి మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొని మరో ముగ్గురు పరారయ్యారు. టూ టౌన్ సిఐ మురళి అందించిన వివరాల మేరకు మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వివేకానంద కాలనీకి చెందిన గోవింద పురం కరుణయ్య, రామునిపట్ల గ్రామానికి చెందిన లీడర్ పంతం వెంకటరాజాలను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.మరో ముగ్గురు పరారైనట్లు తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.11,600నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నిమ్స్ అదనపు సూపరింటెండెంట్
# లక్ష్మీభాస్కర్‌కు రిమాండ్
### చంచల్‌గూడ జైలుకు తరలింపు
### కస్టడీ పిటిషన్ వేయనున్న ఎసిబి?

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో అరెస్టయిన నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌కు నాంపల్లి ఎసిబి కోర్టు బుధవారం రిమాండు విధించింది. మంగళవారం ఎసిబి అధికారులు లక్ష్మీ భాస్కర్‌ను అరెస్టు చేయడం తెలిసిందే. ఆయన వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులను ఎసిబి గుర్తించడం విదితమే. ఈ కేసులో ఆయనను మంగళవారం రాత్రి అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కార్యాలయానికి తరలించారు. బుధవారం ఉదయం ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల తరువాత ఆయనను నాంపల్లి ఎసిబి కోర్టు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన ఎసిబి కోర్టుల న్యాయమూర్తి నిందితుడు లక్ష్మీ భాస్కర్‌కు రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా అక్రమాస్తుల కేసులో లక్ష్మీ భాస్కర్‌ను విచారించేందుకు కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆయనను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఎసిబి కోర్టులో రెండు రోజుల్లో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఇటీవల పదుల కోట్ల రూపాయలను నుంచి వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు కేసుల్లో పట్టుబడ్డ సర్కారీ విభాగాల అధికారులను ఎసిబి కస్టడీలోకి తీసుకుని విచారించడం తెలిసిందే. ఇప్పుడు ఈ ఆస్తులన్నీ ఎలా సంపాదించారనేది వెలికితీసి కోర్టుకు వెల్లడించేందుకు, ఇదే సమయంలో ఈ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసేందుకు వీలుగా ఐటి శాఖకు సమాచారం ఇచ్చేందుకు ఎసిబి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.




# ఆదివారం కూడా బ్యాంకులు పనిచేస్తాయి: కేంద్ర ఆర్థికశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** బ్యాంక్ ఉద్యోగ సంఘాలు ఈనెల 28 నుంచి 30 వరకు దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చాయి. దీంతో వినియోగదారులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఈ ఆదివారం 27వ తేదీ బ్యాంకులు పనిచేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకింగ్ సేవలకు వరుసగా ఐదు రోజులు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం అనుసంధానిత శాఖలు, కరెన్సీ విభాగాల కార్యకలాపాలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. వినియోగదారుల సౌకర్యం కోసం బ్యాంకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే మూడు రోజుల సమ్మెను వాయిదా వేయాలని ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు బ్యాంక్ ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తిచేశాయి. అలాగే బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటనలో పేర్కొంది

**సమ్మె ఎందుకు?:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ వరుసగా మూడు రోజులు ఈనెల 28 నుంచి 30 వరకు సమ్మెకు పిలుపునిచ్చాయి. బ్యాంక్ ఉద్యోగ సంఘాలు ప్రధానంగా వారానికి ఐదు రోజుల పనిదినాలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో పాటు పదవీ విరమణ ఉద్యోగులకు పెన్షన్ పెంపుదల, పెన్షనర్లకు కూడా ఉద్యోగులతో సమానంగా డీఏ పెంపుదల, నేషనల్ పెన్షన్ సిస్టమ్‌కు బదులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం వంటివి కూడా బ్యాంక్ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మణుగూరు థర్మల్‌లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం
## సాంకేతిక సమస్యలతో 270 మెగావాట్ల విద్యుత్‌కు బ్రేక్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఒకవైపు విద్యుత్తు డిమాండ్ బెంబేలెత్తిస్తుంటే మరోవైపు జెన్‌కో థర్మల్, హైడల్ ప్లాంట్లు వరుసగా పడకేస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో పవర్ జనరేషన్ ప్లాంట్లు మూత బడ్డాయి. మూడు థర్మల్, రెండు హైడల్ యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోయింది. తాజాగా మణుగూరు థర్మల్ పవర్ ప్లాంట్ అధికారికంగా పిలువబడుతున్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బిటిపిఎస్)లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయంది. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక సమస్యలు లేదా బొగ్గు కొరత తలెత్తినప్పుడు విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది. ఈ విధంగా ఇప్పుడు మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక సమస్యతో విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్ పడినట్లు సమాచారం. ప్రధానంగా బాయిలర్‌లీకేజీ కారణంగా తాత్కాలికంగా విద్యుత్‌ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది.దీంతో 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

మణుగూరు లోని ఈ ప్లాంట్‌లో మొత్తం 1,080 మెగావాట్ల (4/270 మెగావాట్లు) ఉత్పత్తిసామర్థ్యం ఉంది. సాధా రణంగా ఇక్కడ ఉత్పత్తి నిలిచిపోవడానికి లేదా అంతరాయం కలగడానికి ప్రధానంగా సాం కేతిక లోపాలు తలెత్తుతు న్నాయి. బాయిలర్ ట్యూబ్ లీకేజీలు,టర్బైన్ సమస్యలు లేదా ప్లాంట్‌లోని అంతర్గత యంత్రాలలో సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు సంబంధిత యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తినితాత్కాలికంగానిలిపివేయడం సర్వసాధారణం.

అలాగే భారీ వర్షాల కారణంగా సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో నీరు చేరి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినప్పుడు, ఈప్లాంట్‌కు అవసరమైన బొగ్గు నిల్వలు తగ్గి ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి.త

# ఎమ్మెల్సీ, 5 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు బిజెపి సన్నాహక సమావేశం:రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలు, 5 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి ప్రిపరేటరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా కార్పొరేషన్లకు సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# ఉద్యోగ, కార్మిక పక్షపాతి కాంగ్రెస్ పార్టీ
## అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్ మధు యాష్కి గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతిగా పనిచేస్తోందని, వారి సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తుందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. హైదరాబాద్లోని గోషామహల్‌లో బుధవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘం తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ చక్రధర్ రెడ్డి లతో కలసి మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కోటి మంది కార్మికులకు కనీస వేతనాలను అమలులోకి తీసుకవచ్చిందని చెప్పారు. ఇప్పటికే జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ను గెలిపించాలని మధుయాష్కి గౌడ్ కోరారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి కార్మికులకు అండగా ఉన్నట్లే ఇతర కార్మికుల సమస్యలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు.

## టాలీవుడ్ హీరో నానికి పోలీసుల షాక్
# ఆర్టీసీ క్రాస్ రోడ్స్ థియేటర్‌లో అభిమానులతో కలిసి సినిమా చూసేందుకు అనుమతి నిరాకరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** టాలీవుడ్ హీరో నానికి పోలీసులు షాక్ ఇచ్చారు. తాను నటించిన ప్యారడైజ్ సినిమా ప్రీమియం షో ను అభిమానులతో కలిసి వీక్షించేందుకు అనుమతించాలని నాని చేసిన ప్రయత్నాలకు పోలీసులు నో అన్నారు. దీనిపై నానీ మొదట సిఎం రేవ ంత్ రెడ్డిని ఇదే విషయమై ఎక్స్ వేదికగా కోరగా మొదట పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో పాటు ఈ వినతిని సిఎం నేరుగా డిజి పి ఆనంద్‌కు ట్యాగ్ చేశారు. దీనిపై స్పందించిన డిజిపి ఆనంద్ గణేష్ నిమజ్జనం బందోబస్తు వేళ నాని అభిమానులతో కలిసి సినిమా చూసేం దుకు అనుమతి ఇచ్చే విషయంలో సిటీ పోలీసులతో మాట్లాడాల్సి వుందని తెలిపారు. ఈ విషయంలో తుది నిర్ణయం వారిదేనని డిజిపి వెల్లడి ంచారు. రెండేళ్ల క్రితం సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఇద్దరు మరణించిన విషయాన్ని డిజిపి ఈ సందర్భంగా గుర్తు చే శారు. కాగా ఆర్టీసీ చౌరస్తాలో థియేటర్లను పర్యవేక్షించే చిక్కడపల్లి ఎసిపి మాట్లాడుతూ నాని తమకు ఎలాంటి దరఖాస్తు చేయలేదని, తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. మరోవైపు నాని నటించిన ప్యారడైజ్ సినిమా బుధవారం నాడు విడుదల కానుండడంతో ఆర్టీసీ చౌరస్తాలోని థియేటర్ల వద్ద భద్రత పెంచారు. ఎలాంటి తొక్కిసలాట ఘటనలు జరగకుండా చూడసాగారు. థియేటర్ల నిర్వాహకులకు ముంద స్తు సూచనలు చేశారు.

# ప్యారడైజ్ సినీ టిక్కెట్ల ధరల పెంపు ఉపసంహరించండి
## రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ధర్మాసనం ఆదేశాలు
## గత ఆదేశాలను ఉల్లంఘించడం పట్ల హైకోర్టు అసంతృప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** సరైన విధానాన్ని అనుసరించకుండా సినిమా టికెట్ల ధరలను పదేపదే పెంచడంపై తెలంగాణ హైకోర్టు మంగళవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 24న విడుదల కానున్న టాలీవుడ్ చిత్రం ది ప్యారడైజ్ టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తూ జారీ చేసిన మెమోను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ధిక్కార కేసు విచారణ సందర్భంగా జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్, సినిమా టికెట్ల ధరల పెంపుపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్ ఈ నెల 20న మెమో జారీ చేయడం ద్వారా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఇది తెలంగాణ సినిమాస్ (రెగ్యులేషన్)చట్టంలోని నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి మెమోలను ఉద్దేశపూర్వకంగానే జారీ చేస్తున్నారని ఈ కోర్టు అభిప్రాయపడుతోందన్నారు. ప్రతిసారీ అదే తప్పు జరుగుతోందని, ఇది ఎక్కడో ఒకచోట ఆగాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సినిమా టికెట్ల ధరలను పెంచడానికి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా, సినిమా విడుదలకు 90 రోజుల ముందుగా ప్రజల ముందు ఉంచాలని జనవరిలో కోర్టు అధికారులను ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వం ఆ విధానాన్ని బేఖాతరు చేస్తూ సినిమా టిక్కెట్ల ధరలను పెంచుతూ మెమోలు జారీ చేస్తోందని పిటిషనర్ తరపు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు తెలియజేశారు. ఈ విషయంలో కౌంటర్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి కేసును రెండు వారాలపాటు వాయిదా వేసింది.

# చంచల్‌గూడ జైలు రిమాండ్ ఖైదీ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య

**అమరచింత, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ రెడ్డి 23 పోక్స్ కేసులో రిమాండ్ ఖైదిగా ఉన్నారు. మంగళవారం చంచల్గూడా జైల్లో రిమాండ్ ఖైదుగా ఉన్న కిషోర్ కుమార్ రెడ్డి ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల చంచల్గూడా జైల్ పోలీస్ సిబ్బంది కిషోర్ కుమార్ రెడ్డి ని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం కిషోర్ కుమార్ రెడ్డి భద్రత పోలీసుల కళ్ళు కప్పి ఎర్రగడ్డ ఆసుపత్రి నుండి పరారయ్యారు. చంచల్గూడా జైల్ పోలీస్ అధికారులు సొంత గ్రామానికి చేరుకున్నారని అనుమానంతో కిషోర్ కుమార్ రెడ్డి సొంత వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామంలో కిషోర్ కుమార్ రెడ్డి ఇంటి దగ్గర పోలీసులు గస్తీ తిరగడంతో పోలీసులకు భయపడి నందిమల్ల గ్రామ చెరువు దగ్గర చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కిషోర్ కుమార్ రెడ్డి ఐదు నెలల కిందట జైలు నుండి పరారై మళ్లీ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన సంఘటనలు ఉన్నాయి.

# పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి
## మరో ఇద్దరికి గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతిచెందగా మరో ఇద్దరు మహిళలు గాయపడిన ఘటన ఉమ్మడి మహబూబ్ నగర్‌లో చోటుచేసుకుంది. వనపర్తి జిల్లాపెబ్బేరు మండలం సూగూరు గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి (40), కుమ్మరి సువర్ణ, సాకలి అనురాధలు గ్రామ శివారులోని వ్యవసాయ పొలం లో వరి కలుపు తీసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో వారు పొలంలో పనులు చేస్తుండగా సమీపంలో పిడుగు పడింది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా, సువర్ణ, అనురాధలకు గాయాలయ్యాయి.

వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు గాయపడిన వారిని వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సువర్ణ, అనురాధలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మి మృతితో పిల్లలు దిక్కులేనివారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం లోని ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల యాదమ్మ (54) బుధవారం కూలి పనికి పోయి తిరిగి వస్తుండగా పిడుగుపడి మరణించింది.

# అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు
## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
### రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

# దుబాయిలో ప్రవాసీ బతుకమ్మ

**హైదరాబాద్,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుబాయిలో ప్రవాసీ బతుకమ్మ వేడుక నిర్వహించాలని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ జి. వి. వెన్నెల గద్దర్ లకు ఆయన లేఖలు రాశారు. అక్టోబర్ 17న దుబాయిలో నిర్వ హించే ప్రవాసీ బతుకమ్మ ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయి జరీ కమిటీ సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, కొట్టాల సత్యం నారాగౌడ్, దుబాయిలోని ప్రముఖ సామాజిక సేవకులు సుతారి సత్యనారాయణలు సమన్వయ కర్తలుగా వ్యవహరిస్తారని వినోద్ కుమార్ తెలిపారు.

# ఆదిలాబాద్ 'రిమ్స్'లో 6కు చేరిన శిశుమరణాలు

**ఆదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ప్రభుత్వ ఆసుపత్రి రిమ్స్ లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రోజురోజుకి శిశువుల మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. ఇదివరకే ముగ్గురు శిశువులు మృతి చెందిన విషయం విధితమే బుధవారం రోజున మరో ముగ్గురు శిశువులు మరణించడంతో దీంతో మరణాల సంఖ్య ఆరుకు చేరుకుంది.జిల్లా వైద్య ఆస్పత్రిలో సకలసౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, అన్ని విభాగాలకు చెందిన వైద్యాధికారులు సేవలు అందిస్తారని ఆశించి ప్రసూతి కోసం ఆస్పత్రిలో చేరిన తల్లులకు చివరకు తీవ్ర విషాదమే మిగిలింది. నవ మాసాలు మోసి, పండంటి బిడ్డకు జన్మనిచ్చి తమ జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయని ఆశించిన కుటుంబాల్లో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-III, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ బిల్డింగ్,
# 6-1-2/1, ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్-500063

**సంక్షిప్త టెండర్ ప్రకటన**

NIT No. HMDA/DEV/EE/Div-III/2026-27 తేది: 22.09.2026

డివిజన్-IIIలో, క్రింది పని నిమిత్తం టెండర్ ఆహ్వానించబడుతున్నాయి. క్ర.సం. NIT No HMDA/DEV/EE/DIV-III/17, 2026-27, (SC కొరకు రిజర్వ్‌డు). తేది: 22.09.2026. లొకేషన్: లుంబినీ పార్క్‌లో వరద నీటి డ్రెన్ కవర్స్‌కు మరమ్మతులు మరియు రిప్లేస్‌మెంట్ ఏర్పాటు (SC కొరకు రిజర్వ్‌డు). 2) HMDA/DEV/EE/DIV-III/18, 2026-27, (ST కొరకు రిజర్వ్‌డు). తేది: 22.09.2026. లొకేషన్: HMDA గ్రౌండ్స్ వద్ద కొత్త 12 మీటర్ల ఎత్తైన మాస్ట్ పోల్స్, 250W LED ఫ్లడ్ లైట్స్, ట్రెంచ్, డక్ట్, కేబుల్స్, ఫీడర్ పిల్లర్స్ బాక్స్‌లు మరియు నెట్ ప్యానెల్స్ వగైరా సరఫరా, టెస్టింగ్, మరియు కమిషనింగ్ (ST కొరకు రిజర్వ్‌డు). 3) HMDA/DEV/EE/DIV-III/19, 2026-27, (ST కొరకు రిజర్వ్‌డు). తేది: 22.09.2026. లొకేషన్: లుంబినీ పార్క్ వద్ద కాస్కేడ్ ఫౌంటెన్ గోడ మరియు ఇతర మరమ్మతులు కొరకు మరమ్మతులు మరియు తిరిగి యథాస్థితి నెలకొల్పే పనులు. బిడ్ దాఖలుకు చివరి తేది: 07.10.2026న మ.3.00గం. వరకు. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in వీక్షించండి.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్- III, HMDA.

DIPR.NO. 10559-PP/CL/ADVT/1/2026-27 తేది: 23.09.2026



**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)
(CIN:L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)**

ఇదిలా ఉండగా దిగువ సంతకందారు, **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క అధీకృత అధికారిగా, "ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అమలు (చట్టం, 2002 (54 ఆఫ్ 2002)" క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్ మెంట్) నియమాలు, 2002లోని (నియమం 3)తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి **రుణగ్రహీత మహమ్మద్ అఫ్తాబ్ అహ్మద్ (రుణగ్రహీత), అస్రా అంజుమ్ (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నెం. 2466000202495 8)**లను, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న **రూ.15,91,885/- (పదిహేను లక్షల తొంభై ఒక్క వేల ఎనిమిది వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే)** మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ **07-నవంబర్-25** తేదీన డిమాండ్ నోటీసును జారీ చేసారు.

ఇదిలా ఉండగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క విలీన పథకం ప్రకారం, 1 ఏప్రిల్ 2024 నుండి అమలులోకి వచ్చేలా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ప్రకారం, పైన పేర్కొన్న రుణ ఖాతా, మంజూరు చేయబడిన సదరు క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించవలసిన మొత్తం సొమ్ముతో పాటు, తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించిన అంతర్లీన సెక్యూరిటీ మరియు సెక్యూరిటీ వడ్డీతో సహా, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌కు బదిలీ చేయబడింది.

రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మొత్తం తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, దిగువ సంతకందారు 19వ రోజు సెప్టెంబర్ 2026వ సంవత్సరం ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/తాకట్టుదారుకు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా తెలియజేయబడుతుంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/తాకట్టుదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరించబడింది. ఆస్తితో చేసే ఏ లావాదేవీలకైనా, **06-నవంబర్-25** నాటికి **రూ.15,91,885/- (పదిహేను లక్షల తొంభై ఒక్క వేల ఎనిమిది వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే)** మొత్తం మరియు పూర్తి చెల్లింపు జరిగే వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు) వారి ఛార్జీకి లోబడి ఉంటుంది.

హామీగా ఉంచిన ఆస్తులను వినియోగించడానికి అందుబాటులో ఉన్న సమయం, అనగా ఈ సమాచారం అందిన తేదీ నుండి 30 రోజులు. చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను రూల్ 8(6)తో చదువబడే దానిని రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం అయినది.

**స్థిరమైన ఆస్తుల వివరణ**

రంగారెడ్డి జిల్లా, GHMC రాజేంద్రనగర్ సర్కిల్, ఉప్పర్‌పల్లి గ్రామం సోగ్‌బౌలి రెవెన్యూ గ్రామం పరిధిలోని 'హ్యాపీ హోమ్స్ ప్యాలెస్' బ్లాక్-ఎ ప్రాంగణంలో సర్వే నంబర్లు 26, 27, 28 మరియు 34, నాలుగవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నంబర్ 420 మున్సిపల్ నంబర్ 2-4-46/P/A/420, (PTI నంబర్ 1060236006). దీని విస్తీర్ణం గోడల మందం మరియు కామన్ ఏరియాతో కలిపి 558.00 చదరపు అడుగులు టెర్రస్ హక్కులు మినహాయించి; దీనితో పాటు 22.32 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటా మరియు 18.00 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన S-420 నంబర్ గల స్కూటర్ పార్కింగ్ స్థలం ఉన్నాయి. ప్రస్తుతం మరియు భవిష్యత్తులో అక్కడ జరిగే నిర్మాణాలతో సహా మొత్తం విస్తీర్ణం 558 చదరపు అడుగులు. దీని సరిహద్దులు: తూర్పున ఫ్లాట్ నంబర్ 421, పడమరన కారిడార్, ఉత్తరాన ఫ్లాట్ నంబర్ 419, దక్షిణాన ఫ్లాట్ నంబర్ 421.

తేది: 19/సెప్టెంబర్/2026 అధీకృత అధికారి
ప్రదేశం : జిల్లా : రామనగర, కర్నాటక. AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్




వార్త

> రచయితతో అరగంటసేపు మాట్లాడే అవకాశం కనుక దొరికితే ఆయన రాసిన గ్రంథాన్ని చదవను.
>
> - ఉడ్రోవిల్సన్

# కుటుంబ నియంత్రణకు కాలదోషం!

ఒకప్పుడు జనాభా పెరిగిపోతోందని గగ్గోలు పెట్టిన ప్రభుత్వాలు రానురాను జనాభా తగ్గిపోతోంది కనుక 'పిల్లల్ని కనండం'టూ కొత్త నినాదం అందిపుచ్చుకుని దానికి కూడా ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలుంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. ఏరకమైన అధికార పీఠం మీద కూర్చునేందుకు పనికిరాడని చట్టాలు నిర్దేశించాయి. అంటే ఏలినవారు ఆనాటి పరిస్థితులను బట్టి అలాంటి శాసనాలు అమల్లోకి తెచ్చారు. అప్పుడెప్పుడో ఇందిరమ్మ పాలనలో ఎమర్జెన్సీ సమయంలో కుటుంబ నియంత్రణ పేరిట ఆవిడగారి సుపుత్రుడు చేసిన ఆకృత్యాలు అన్నీఇన్నీకావు. యువతరం కుర్రోళ్లను కట్టిపడేసి కుటుంబ నియంత్రణ కోసం బలవంతంగా వేసక్టమీ ఆపరేషన్లు చేసి పారేశారు. అత్యంత వేగంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టలేకపోతే వారిని పెంచి పోషించలేమనే ఆలోచనలో ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు తెగపడ్డారు. అటు నగరాల నుంచి గ్రామాల దాకా వైద్య ఆరోగ్య శాఖకు లక్ష్యాలు నిర్దేశించారు కూడా. ఆ తర్వాత 'నియంత్రణ' కాదు కుటుంబం యావత్తు సుఖసంతోషాలతో జీవించాలంటే ఇద్దరు లేకముగ్గురు చాలు' అనే నినాదాన్ని జనంలోకి బలంగా తీసుకువెళ్లారు. దాన్నే ఇద్దరైతేనే ముద్దు అని మార్చి జీవనసారాన్ని బోధించారు. అదే 'కుటుంబ సంక్షేమ కార్యక్రమం'గా మార్పు చేశారు. ఇప్పటికీ ఆ స్కీములు నడుస్తున్నట్లే ప్రభుత్వ లెక్కల్లో నమోదై ఉంది. లక్ష్యాలు మారాయి. కనుక ఆ పథకాన్ని కొనసాగించడంలో అర్థంలేదు. కారణం ఇక పిల్లలు కావాలనుకున్నా, వద్దనుకున్నా ప్రభుత్వం తరపున ప్రభుత్వ పెద్దలే కంటే గింటే కవలల్ని కన్నా స్వాగతిస్తాం అంటున్నామన్న ప్రభుత్వాల ప్రయాస వింటూనే విన్నాం. అయితే కాస్త ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరుచుకుని కుటుంబ నియంత్రణే అవసరమే లేనప్పుడు దానికిచ్చే ప్రోత్సాహకాల బట్వాడా ఎందుకు? అనే ఆలోచనలో పడింది. తాజాగా కుటుంబ నియంత్రణకు సంబంధించిన అన్ని రకాల ప్రోత్సాహకాలను తక్షణమే నిలిపివేయాలని ప్రధాని ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసింది. కుటుంబ నియంత్రణ అవార్డులు, ప్రపంచజనాభా దినోత్సవాలు, జనాభా నియంత్రణ కోసం నిర్వహించే వేసక్టమీ పక్షోత్సవాలను తక్షణమే ఆపేయాలని కోరింది. ప్రతి జంటా ఇద్దరు పిల్లల నిబంధనను కట్టుబడి ఉండేలా చేసేందుకు ఇచ్చే 'ఆశా' ప్రోత్సహకాలను రద్దు చేసింది. స్టెరిలైజేషన్‌తో ముడిపడిన అన్ని ప్రోత్సాహక చెల్లింపులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. 1952లో ప్రపంచంలోనే తొలిసారిగా దేశవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ పథకాలను ప్రవేశపెట్టింది. అవసరం ఉన్నా లేకున్నా ఇప్పటికీ ఆ పథకాలు ఉనికిలో ఉన్నాయి. ప్రస్తుతం నడుస్తున్న చరిత్రలో సింగపూర్ వంటి దేశాలు కూడా ఎక్కువ మంది పిల్లల్ని కనడానికి ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో అప్పటి పాలకులు దేశ జనాభావేగంగా పెరగడాన్ని బట్టి దేశాభివృద్ధికి జనాభా నియంత్రణ తప్పనిసరియని కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చాయి. అటుపై జననాలు తగ్గించి మాతాశిశు సంరక్షణ లక్ష్యంలో చాన్నాళ్లు ముందుకు సాగింది. 1977లక్ష్యాలు కొద్దిగా మార్చి కుటుంబ సంక్షేమశాఖగా మారింది. ఎన్నో లక్షల మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసిన కేంద్రప్రభుత్వం వద్ద వాటి సంఖ్య తెలిపే రికార్డులేమీ భద్రంగా లేవనే మాట వినిపిస్తోంది. 1970 నుంచి 2007 వరకు కోట్లాది మంది పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేసుకున్నట్లు తేటతెల్లమైనా ఎన్ని కోట్ల మంది అనే లెక్కలు తేలలేదు. కాలక్రమంలో కుటుంబ నియంత్రణ పథకానికి కాలదోషం పట్టింది. సంక్షేమం సంగతి దేవుడెరుగు బాలింతగానో చూలింతగానో ఉండగా ధనుర్వాతం పడకుండా వారి సంక్షేమానికి వైద్య ఆరోగ్య శాఖ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఎంత మందిని కాపాడగలిగారో చెప్పగలిగిన అంకెలూ కనపడవు. 2008 నుంచి 2019ల మధ్య దేశంలో దాదాపు 5.16 కోట్ల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిగాయన్న అంకెలను మాత్రం ప్రభుత్వం ప్రకటిస్తోంది. వివిధ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు, ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ద్వారానే వీటి వివరాలైనా తెలిసాయి. దేశంలో శాశ్వత కుటుంబ నియంత్రణ మేలనుకున్నవారు మాత్రమే. ముఖ్యంగా మహిళల్లో ఇతరత్రా దుష్ప్రభావాలు కలుగకుండా ట్యుబెక్టమీ లేక లాపరోస్కోపీ విధానంలో శస్త్రచికిత్సలు చేయించుకున్నారంతే! ప్రపంచంలోనే మహిళల స్టెరిలైజేషన్ జరుపుకుంటున్న దేశాలలో భారత్ ప్రథమస్థానంలో ఉంది. కానీ పురుషులు ఈ కుటుంబ నియంత్రణలో భాగంగా వేసక్టమీ చేయించుకున్న సందర్భాలు బహు తక్కువ. 0.3 శాతం మంది మాత్రమే వేసక్టమీ ఆపరేషన్లు చేయిస్తున్నారు. తాజా దేశ కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జనాభా పెరుగుదల అవసరాలను ఏకరవు పెడుతూ ఇద్దరు పిల్లలు కన్నా ఎక్కువ మందిని కంటే స్థానిక ఎన్నికలో అనర్హత వేటు వేసే నిబంధనలతో ఉన్న చట్టాలను ఎత్తి వేయాలని సలహా మండలి సిఫార్సు చేసింది. 'ద ఘోస్ట్ ఆఫ్ పాపులేషన్ పాస్ట్, హౌ పాపులేషన్ కంట్రోల్ పెర్సిస్ట్ ఇన్ ఇండియా' పేరిట సూచనల పత్రాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుంచిం ది. దాంతో ఈ పత్రంలో ఉన్న అంశాలన్నీ సర్వసమ్మతమే నంటూ సదరు పత్రాన్ని స్వాగతించింది. సంతానోత్పత్తి తగ్గించే నియంత్రణ చర్యలను ఆపివేసి జనాభా సమానత్వం, సంసిద్ధతపై దృష్టి సారించాలని సూచించింది. శస్త్ర చికిత్సలు చేసుకునే వారికిచ్చే వేతన నష్టపరిహారాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరింది. ఇలాంటి ప్రోత్సహకాలు ఇవ్వడం ప్రస్తుత లక్ష్యాలకు పూర్తి భిన్నం కనుక ఖజానాకు నిధులు మిగిల్చి దుర్వినియోగమనే అపప్రథ రాకుండా చూసేందుకు కేంద్రప్రభుత్వ ప్రధాని ఆర్థిక సలహా మండలి సంకల్పించింది. కాస్త ఆలస్యమైనా ప్రభుత్వ కోశాగారానికి లక్ష్మీకళ వచ్చిపడ్తోంది.

> మానవ మేధ స్వేచ్ఛగా ఉన్నప్పుడే సమాజ సంక్షేమానికి నిజమైన భద్రత లభిస్తుంది.



లాస్కీ

> మన జీవితాలను ప్రకాశవంతం చేసుకోవచ్చుని మహాత్ముల జీవితాలు గుర్తు చేస్తాయి.



లాంగ్‌ఫెలో

# ఉద్యోగ భద్రతకు ఎఐ ముప్పు!

**కృత్రిమ మేథస్సు కృత్రిమ వాతావరణాన్ని సృష్టించి, మానవ జీవితాలను కకావికలం చేయరాదు. జీవిత భద్రతకు తోడ్పడకుండా, భయాన్ని సృష్టిస్తున్న ఎఐ భవిష్యత్తుకు ప్రమాదకరం. రెండు సంవత్సరాలు కోవిడ్ సంక్షోభం వలన ప్రపంచ దేశాలు ఆర్థికంగా దివాలా తీసాయి. రష్యాఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధంవలన ప్రపంచ దేశాల్లో ఆర్థికమాంద్యం ఏర్పడింది. నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటాయి. సామాన్య ప్రజలు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడానికి సిద్ధంగా ఉంది. సాఫ్ట్‌వేర్ రంగం అనేక ఒడిదుడుకులకులోనై, లేఆఫ్‌లు ప్రకటిస్తున్నది. పులిమీద పుట్రలా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విద్యావంతుల ఉపాధిఅవకాశాలను దెబ్బతీస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత కీలకం. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల వలన, ఎఐ ప్రవేశంతో ఏర్పడుతున్న పరిణామాలను బట్టి విద్యార్థులకు, యువతకు సరైన దశాదిశా నిర్దేశనం చేయాలి.**



సుంకవల్లి సత్తిరాజు

అందమైన ప్రపంచంలో అపరిమితమైన అద్భుతాలను సృష్టించి, సైన్స్ ఫిక్షన్ కథల స్థాయిని దాటి, మానవ జీవితాలను ఒక తెలియని, వింతలోకాలకు తోడ్కొని పోయి, అమితమైన మానసికానందానికి గురిచేసి, కనీ వినీ ఎరుగని అనుభూతినిఆస్వాదించే స్థితిని స్పృశించడానికి విజ్ఞాన గవాక్షాలు తెరచుకున్నాయి. ఒకప్పటి పరిస్థితులను సింహావలోకనం చేసుకుంటే అప్పటి మనమెక్కడ? ఇప్పటి మనమెక్కడ? అనే ఆశ్చర్యం కలుగక తప్పదు. ఎడ్లబండ్ల నుండి ఎయిర్ బస్సుల వరకు మానవ విజ్ఞానం అనేక మలుపులు తిరిగింది. భూగోళం నుండి ఖగోళం వరకు మానవ ఆలోచనా పరిధి విస్తృత రూపం ధరించింది. మానవ మేథస్సు విస్తృతమై, నిరంతరం అనంతమైన విజ్ఞాన సాగర మథనం చేస్తూ, అలుపెరుగని శ్రమతో అద్భుతాలను సృష్టిస్తూ మానవ జీవితాలను సౌకర్యవంతమైన మార్గంలో నడిపించడానికి విస్తృతమైన ఆలోచనలు సాగిస్తున్న మానవ మేధస్సును ప్రశంసించక తప్పదు. ఇదే సందర్భంలో విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం వెర్రితలలు వేసి, విలువలను విధ్వంసం చేసి, మానవ సంబంధాలను దూరం చేయడం దురదృష్టకరం. వర్తమానంలో సాంకేతిక విప్లవం పెను మార్పులకు దారితీస్తున్నది. మనిషి అందించే డేటా సాయంతో రోబోలు కాని కంప్యూటర్ల ద్వారా పనిచేసే యంత్రాలు గాని అత్యంత సమర్థవంతంగా తమ భూమిక పోషించగలుగుతాయి. ఖచ్చితత్వం, మనిషి కంటే అనేక రెట్ల సామర్థ్యం కృత్రిమ మేథ ద్వారా పని చేసే మెషీన్ల సొంతం. అందుకే వీటిపట్ల అనేక సాఫ్ట్వేర్ వ్యవస్థలు ఆసక్తి చూపుతున్నాయి. భవిష్యత్తు అంతా కృత్రిమ మేథ సొంతం కాక తప్పదు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆధిపత్యం ఎంత వరకు దారితీస్తుందో తలచుకుంటేనే వెన్నులో వణుకుపుడుతుంది. ఏఐ వలన ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ అవగాహనా లేమితో ప్రతీ సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కోర్సుల పట్ల మక్కువ చూపుతున్నారు. ఇంజినీరింగ్ రంగంలో అనేక శాఖలున్నప్పటికీ, చదువు పూర్తయిన యువత పలుచోట్ల పనిచేసే అవకాశాలున్నప్పటికీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అనేది చదువుకున్న ప్రతీ ఒక్కరి కలగా, లక్ష్యంగా, నేటి యువతకు అదొక ట్రెండ్‌గా మారిపోయింది. ఇంజినీరింగ్ చదివిన వారే కాకుండా, ఇతర డిగ్రీలు చదివిన వారుకూడా కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని, జీతం ఎంతయినా ఫర్వా లేదనే సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తూ, మల్టీ నేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రతీ ఏడాది ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న సాఫ్ట్‌వేర్ ఆశావాహకులకు ఉద్యోగాలు కల్పించడం కష్టతరంగా మారింది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తుంటే, సాఫ్ట్‌వేర్ స్వర్ణయుగం ఇక ముగిసినట్టుగానే భావించవలసి వస్తున్నది. మానవ విజ్ఞానంతో సృష్టించిన 'కృత్రిమ మేథ' మానవాళికే పెను ముప్పుగా మారుతుందనే కథనాలు విన బడుతున్నాయి. పుస్తకాలు చదవడం మరచిపోయాం. చేతి రాత జ్ఞాపకంగా మిగిపోయే అవకాశముంది. గ్రంథాలయాలు ప్రాచీన సంపదగా మిగిలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతో సౌలభ్యంగా ఉందని స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడ్డాం. ఉత్తరాల శకం ముగిసింది. వాట్సాఫ్‌లు హోరెత్తిస్తున్నాయి. సరదాగా ప్రారంభమైన సోషల్ మీడియా మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసింది. కొత్తదనానికి అలవాటు పడ్డ



జనం పాత తరం అలవాట్లను నామోషీగా భావించి, సౌకర్యవంతమైన జీవనాన్ని ఖరీదు పెట్టి కొని, శారీరక శ్రమను మరచిపోవడంతో అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. చరవాణి మానవ సంబంధాలను ధ్వంసం చేసింది. మానసిక రుగ్మతలను కొని తెచ్చి పెట్టింది. సంపద కోసం వెంపర్లాడుతూ, జీవన మాధుర్యాన్ని నేటితరం మరచిపోయింది. సహజ సిద్ధమైన వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసి, కృత్రిమ వాతావరణంలో బ్రతుకీడ్చుతున్నాం. కాలుష్యాన్ని ఆస్వాదిస్తూ, కల్తీని భుజిస్తూ, ఆరోగ్యాన్ని ఆసుపత్రుల పాలు చేస్తున్నాం. తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్టుగా, మనకు ఆశ్రయమిచ్చిన భూగ్రహాన్ని కాలుష్యంతో నింపి, భూగర్భ జలాలను హరించి, పంట పొలాలను నిస్సారంగా మార్చి, భూగ్రహాన్ని నిర్జీవంగా తయారు చేసి, అనువుగాని గ్రహాంతర వాసానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం. సాంకేతిక పరిజ్ఞానం కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారుతున్న నేపథ్యంలో మానవ మేథస్సుతో తయారైన 'ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్' మానవ మెదళ్లకు బూజు పట్టిస్తూ, మనసు లేని మనుషులుగా మానవ ఆలోచనలకు తుప్పు పట్టిస్తున్నది. ఏఐ జోలికి పోవద్దని ఎంతో మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ముందుగానే హెచ్చరించినా కొన్ని టెక్ కంపెనీలు మాట వినలేదు. ఇప్పుడు ఎఐ సర్వాంతర్యామిగా మారి, మానవాళికి ముప్పు తెచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఉపాధి అవకాశాలను మింగేసి, అనవసరమైన సమస్యలను సృష్టించే ఎఐ ముప్పు పట్ల ప్రపంచ దేశాలు, టెక్ నిపుణులు, సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు జాగరూకత వహించాలి. సమీప భవిష్యత్తులో మానవ జీవితం ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయోత్పాతం కలుగుతుంది. టన్నుల కొద్దీ గుప్పిస్తున్న టెక్నాలజీ 'ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్' గా రూపాంతరం చెందింది. ఎఐ పరిచయంతో చదువుతో ఇక అవసరం లేదోమోనన్న భావన కలుగుతున్నది. కోడింగ్ కూడా ఏఐద్వారా స్వల్ప వ్యవధిలో సాధ్యపడుతుండగా, ఇక ఉద్యోగులతో పనేముంటుంది? వైద్య శాస్త్రంలో కూడా ఎఐ ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. వైద్యులు అధునాతన వైద్య చికిత్సా విధానం కొరకు, రోగానికి మందుల కోసం పెద్దపెద్ద పుస్తకాలు అధ్యయనం చేయనక్కరలేదు. ఏ రోగానికి ఏ మందు రాయాలో వైద్యుడు ఆలోచించనక్కర లేదు. వందలాది ఫైళ్ళను ఎఐ నిమిషాల్లో స్కాన్ చేసి రోగానికి మందు నిర్ణయిస్తుంది. ఎఐ ప్రభావం అన్ని రంగాల మీద పడుతున్నది. వేల కోట్లు వెచ్చించి ఒరాకిల్ వంటి సాఫ్ట్‌వేర్ దిగ్గజ కంపెనీలు ఎఐ వైపు దూసుకుపోతున్నాయి. ఇది వరకు వేలాది మంది ఉద్యోగులను తొలగించిన ఒరాకిల్ ఈ మధ్య మరికొంత మంది ఉద్యోగులను ఒకే ఒక్క మెయిల్ ద్వారా చడీ చప్పుడు లేకుండా ఉద్యోగాల నుండి పీకేసింది. ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్ వేర్ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఉద్యోగాలు పోతే ఈ ప్రభావం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కోట్లాది మంది పై ప్రభావం చూపిస్తుంది. అన్నిరంగాలు పేకమేడల్లా కుప్పకూలిపోయే అవకాశముంది. ఎఐ 'భవిష్యత్తు'కాదు. మానవుల పాలిట భూతంలా, శాపంలా మారబోతున్నది. ప్రమాదకరమైన పరిశ్రమల్లోను, భూగర్భ సంపద వెలికి తీయడం లోను, మనుషులు చేయలేని పనుల్లోను ఎఐను ఉపయోగించాలి. ఎఐ వినియోగాన్ని కనీస స్థాయికి తగ్గించాలి. కృత్రిమ మేథస్సు కృత్రిమ వాతావరణాన్ని సృష్టించి, మానవ జీవితాలను కకావికలం చేయరాదు. జీవిత భద్రతకు తోడ్పడకుండా, భయాన్ని సృష్టిస్తున్న ఎఐ భవిష్యత్తుకు ప్రమాదకరం. రెండు సంవత్సరాలు కోవిడ్ సంక్షోభం వలన ప్రపంచ దేశాలు ఆర్థికంగా దివాలా తీసాయి. రష్యాఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధంవలన ప్రపంచ దేశాల్లో ఆర్థికమాంద్యం ఏర్పడింది. నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటాయి. సామాన్య ప్రజలు పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడానికి సిద్ధంగాఉంది. సాఫ్ట్ రంగం అనేక ఒడిదుడుకులకులోనై, లే ఆఫ్ లు ప్రక టిస్తున్నది. పులి మీద పుట్రలా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విద్యావంతుల ఉపాధిఅవకాశాలను దెబ్బతీస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత కీలకం. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల వలన, ఎఐ ప్రవేశంతో ఏర్పడుతున్న పరిణామాలను బట్టి విద్యార్థులకు, యువతకు సరైన దశాదిశా నిర్దేశనం చేయాలి. ●

# రైతుల చర్చలతోనే భూసేకరణ సాధ్యం!


కె. శ్రీనివాస్

ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రేచర్ల, చింతలపూడి ప్రతిపాదిత బొగ్గు గనులు (యు.సి.జి )కి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్) ప్రకటించకుండా రైతులు, ప్రజల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చలగాటం ఆడుతున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయాలు చేస్తున్నాయి. రూ. లక్షల కోట్లు విలువ కలిగిన ప్రజా సంపదను రిలయన్స్ కంపెనీకి ఏ విధంగా కట్టబెడతారో చెప్పడం లేదు. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ (యూసీజీ) ప్రాజెక్ట్‌కు సంబంధించిన వాస్తవ విషయాలు ప్రజలకు, రైతులకు తెలియజేయకుండా పెద్దకంపెనీకి లీజు కట్టబెట్టారు. రూ.2.73 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని మాయ మాటలు చెప్తూ ఆచరణలో జరిగే విధ్వంసం గురించి ప్రజలకు, రైతులకు వాస్తవ విషయాలు చెప్పడం లేదు. ప్రత్యక్షంగా 3500 నుండి 5వేల మందికి, పరోక్షంగా 35వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వాలు చెబుతున్నాయి. బొగ్గు ఆధారిత గ్యాస్‌ఉత్పత్తి చేసిన అన్ని దేశాలలో విధ్వంసం జరిగింది. ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి, అరటి, మొక్కజొన్న, వరి, ఇతర అనేక ఉద్యాన, వాణిజ్య, ఆహార పంటలు పండుతున్నాయి. ఇక్కడ వ్యవసాయ కార్మికులకు ఈ పంటల ద్వారా సంవత్సరం ఆంతా పనులు దొరుకుతున్నాయి. ఉద్యాన పంటల ద్వారా మంచి ఆదాయం రైతులకు వస్తోంది. సస్యశ్యామలంగా ఉన్న ఈ ప్రాంతంలో బొగ్గు ఆధారిత గ్యాస్ ఉత్పత్తి వలన జరిగే పర్యావరణం ముప్పు ఇతర అంశాలపై వాస్తవ విషయాలను వెల్లడించడం లేదు. ప్రజల జీవనానికి, పంటలకు నష్టం కలిగించే చాలా విషయాలపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇంతవరకు ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ గ్రామసభలు జరిపివాస్తవ విషయాలను ప్రజలకు, రైతులకు తెలియజేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టె పనిలో ఉన్నాయి. గతంలో జరిగిన భూ సేకరణల్లో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టు, ఇతర భూసేకరణల్లో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న అనుభవాలున్నాయి. 2013 భూసేకరణ చట్టం అమలు కావడం లేదు. యూజీసీ ప్రాజెక్టు కోసం 8562ఎకరాలు భూసేకరణ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శెట్టివారిగూడెంలో 77 ఎకరాలు ముందుగా పైలెట్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ చేస్తామంటున్నారు. చింతలపూడి మండలం లోని చింతలపూడి, రేచర్ల, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం, శెట్టివారిగూడెం, రాఘవాపురం, యర్రగుంటపల్లి, సీతానగరం, చింతంపల్లి తదితర గ్రామాలలో వేలాది ఎకరాలు రైతుల భూములు బలవంతంగా లాక్కునే ప్రయత్నాలు ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులతో చర్చలు జరుపుతూ మీకు ఎంత పరిహారం కావాలో చెప్పండి అని అడుగుతున్నారు. యు.సి.జి ప్రాజెక్టుకు మేము భూములు ఇవ్వలేమని రైతులు చెబుతున్నా వారి మాటలను బేఖాతరు చేస్తూ రెవిన్యూ అధికారులు భూములమీదకు సర్వేకువస్తున్నారు. భూగర్భంలో బొగ్గును మండించి సింథటిక్ గ్యాస్‌ను పైకి తెస్తారు. దీని నుండి హైడ్రోజన్, మెథనాల్, అమోనియా, సింథటిక్ నేచురల్ గ్యాస్, సింథటిక్ ఇంధనాలు తయారు చేస్తారు. 2030 నాటికి రోజుకు 2050 మిలియన్ మెట్రిక్‌స్టాండర్డ్ క్యూబిక్ మీటర్స్ సింగ్యాస్ తయారు చేసే ప్లాంట్ అందుబాటులోకి వస్తుందనికంపెనీ చెబుతున్నది. చింతలపూడి, రేచర్ల బ్లాక్ ల్లో 150 కోట్ల టన్నుల బొగ్గు నిల్వ ఉన్నది. అన్ని అనుమతులు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. అయితే ప్రాథమికంగా ఇంతవరకు బొగ్గు గని ప్రాంత రైతులతో, ప్రజలతో చర్చించలేదు. ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. ●

# ఉద్యోగుల బకాయి సమస్యలకు ఏదీ పరిష్కారం?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఎలక్షన్లు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయ పార్టీలు సహజంగా కొన్ని హామీలుస్తుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విషయంలో సమస్యలపై కొన్నిసార్లు ఆర్థిక స్థితిగతుల అంచనాల ప్రకారం ప్రభుత్వాలు తాత్సారం చేసే పరిస్థితులు కొనసాగుతున్నాయి అనే భిన్న అభిప్రాయాలు అడపాదడపా వినిపిస్తుంటాయి. అయినప్పటికి సాధ్యమైనంతగా ప్రభుత్వాలు సామరస్యంగా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు ప్రయత్నిస్తుండడం సర్వసాధారణమే. ఈ క్రమంలో తరచుగా ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీలను ఉద్యోగస్తులు అడుగుతుంటారు. కొన్ని సందర్భాల్లో చాలా సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే ధోరణితో ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపే సమయంలో ప్రభుత్వాలు స్పష్టమైన హామీ ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాలపై నిరసన వ్యక్తం చేస్తుండడం సహజమే. రోజు రోజుకీ పెరుగుతున్న ధరలు ద్రవ్యోల్బణం ఆధారంగా ఉద్యోగులకు సహజంగా రావలసినటువంటి పే రివిజన్ కమీషన్ గాని, డి.ఏ అంటే డియర్‌నెస్ అలవెన్సులు సకాలంలో రాకపోవడం ఒక ఎత్తు అయితే పదవి విరమణ పొందిన తర్వాత విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన ఆర్థిక లావాదేవీలు సంపూర్ణంగా చేతికి అందకపోవడంతో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు నిరాశను కలిగిస్తున్నాయి. ఇలాంటి విషయాలపై ప్రభుత్వాలలో భాగమైన ఉద్యోగస్తులు ఉద్యమ బాట పట్టడానికి సిద్ధమవుతున్న తీరు శోచనీయమేమో. కొన్ని రాష్ట్రాల్లో ఉద్యోగుల బదిలీల విషయంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికత, స్థానికేతర ఉద్యోగుల విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉందని గతం నుండి ప్రభుత్వాలు తీసుకున్న జీవోలో ఉన్న స్పష్టత లేని అంశాలపై ఉన్న విషయాలు కాంట్రిబ్యూటెడ్ సి.పి.ఎస్ పెన్షన్ స్కీం ప్రకారం ఉద్యోగ నియామకాలు ప్రస్తుతం జరుగుతున్నా ఉద్యోగం వచ్చిన తర్వాత వారు తిరిగి తమకు పాత పెన్షన్ విధానాన్ని ఓ.పి.ఎస్ అమలు చేయాలని ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు సాధ్యాసాధ్యాలను పక్కనపెట్టి రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చే ముందు నెరవేరుస్తామని హామీలను ఇస్తున్నప్పటికీ, ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విషయంలో కొన్నిసందర్భాల్లో హామీలు నిష్ప్రయోజనంగానే గోచరిస్తున్నాయనే చర్చ ఉద్యోగ సంఘాల్లో సాగుతుంది. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న అనేక రకమైనటువంటి ఉద్యోగ సంఘాలు సంబంధిత శాఖలకు సంబంధించిన వారి సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్న వాదన




తో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వివిధ సంఘాల ఐక్య కార్యాచరణతో ఉద్యమ బాటను పడుతూ తరచుగా ప్రభుత్వాలతో చర్చలు విఫలమైన సందర్భాలలో కొన్ని సార్లు నిరసనలు వ్యక్తం చేస్తుండడం సాధారణమైపోయింది. ప్రభుత్వాలు ఉద్యోగ సంఘాల మధ్య జరుగుతున్న చర్చలుకొన్ని సార్లు కనీస స్థాయిలో నైనా సఫలం కాకపోవడం ఉద్యోగులలో ఆందోళనలు కలిగిస్తుంది. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులతో సహా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకునిర్ణీత సమయంలో రావలసినటువంటి ఆర్థికపరమైన లావాదేవీలు అంశాలు అసంపూర్ణంగా ఉంటున్నాయనే భావన పదవి విరమణ పొందిన ఉద్యోగులలో లేకపోలేదు. జీతాల పెంపు విషయమై వేతన సవరణ కమిషన్ల నివేదికలు కూడా అంది అందినట్టే ఉంటున్నాయి అనే భావన ఉద్యోగులలో లేకపోలేదు. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో కూడా ఈ అంశం చర్చనీయాంశంగా మారుతుంది. అయితే గతంనుండి కూడాఉద్యోగుల విషయంలో సరైన రీతుల్లో ప్రభుత్వాలు స్పందించకపోవడం ఒక ఎత్తు అయితే కారణాలేవైనా ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ విషయంలో కొంత జాప్యం చేస్తున్నాయి అనే వాదనలు వినిపిస్తుంటాయి. మరీ ముఖ్యంగా చాలా సంవత్సరాలు ప్రభుత్వ సర్వీస్‌లో ఉండి పదవీ విరమణ పొందిన వారి పరిస్థితి ప్రస్తుతమున్న పరిస్థితులు విశ్రాంతిగా కుటుంబ సభ్యులతో కాలం గడిపే సమయంలో తమకు రావాల్సిన ప్రభుత్వ బకాయిలు గురించి ఆలోచిస్తూ సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతు ఉన్న సందర్భాల్లో ప్రస్తుతం అందుకే విశ్రాంత ఉపాధ్యాయులు అవిశ్రాంతంగా ఉంటున్నారని అనిపిస్తుంది. కారణాలేవైనా ప్రభుత్వాలు న్యాయపరమైన ఉద్యోగుల సమస్యలను సత్వరమే త్వరితగతిన పరిష్కరించాలి. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వంసామరస్యంతో పరిష్కరించే రీతిలో కొన్ని ఉన్నప్పటికీ, మరికొన్ని అంశాలు ఆర్థిక స్థితిగతులపై ముడిపడి ఉండడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు అనుకున్న రీతిలో సమస్యల పరిష్కారం ఆశించిన స్థాయిలో లేకపోవడం జరుగుతుందనే విభిన్నమైన అభిప్రాయాలు లేకపోలేదు. అయితే ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా, ఇందుకు భిన్నంగా ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ వయస్సువరకు ఉద్యోగంలో పనిచేస్తుంటారు. ఈక్రమంలో ప్రభుత్వ విధానాలను అమలు పరుస్తుంటారు. దేశ రాష్ట్ర ఆర్థికవిధానాలు ప్రజా సంక్షేమ అభివృద్ధి వివిధ వ్యవస్థల్లో సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజల కొరకు తీసుకునే నిర్ణయాత్మక అభివృద్ధి ప్రణాళికలో కీలకపాత్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తుంటారు. ప్రభుత్వాలు స్వచ్ఛమైన పరిపాలనను అందించే రీతిలో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమైనది. ప్రస్తుత పరిస్థితుల్లో పదవీ విరమణ పొందిన తర్వాత ఉద్యోగులకు రావలసిన ఆర్థిక లావాదేవీలు సకాలంలో సంపూర్ణంగా చేతికి అందకపోవడంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నిరాశను కలిగిస్తున్నాయి. అనేక సంవత్సరాలు ప్రభుత్వ శాఖల్లో సేవలు అందించి పదవీ విరమణ తర్వాత విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో రావలసిన బకాయిల గురించి ప్రభుత్వాలతో అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న క్రమం విశేషం. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వాలు సమన్వయంతో, సామరస్యంతో సానుకూల ధోరణికలిగి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో మరింతగా కృషి చేయాలి. ●

# ప్రజావాక్కు



### వందే మాతరంపై వివాదమే!

సంగీత విద్వాంసుడు టీ ఎం.కృష్ణ గారు వందేమాతరం గీతాన్నిరెండుచరణాలుపాడాలా, ఆరుచరణాలు పాడాలా, ఆరుచరణాలు అన్య మత విశ్వాసులకు ఇబ్బంది , కనుక న్యాయం చెప్పండి అని సుప్రీంకోర్టులో కేసు వేశాడు. సుప్రీం కోర్టు ఈరోజు కోర్టు మత విశ్వాశాలకు రక్షణగా ఉంటుంది అంటూ, ఆరుచరణాల పై కేంద్రానికి నోటీసులు పంపింది. రెండు వారాలు వాయిదా వేసింది. అభినందనీయం. నిన్న కర్ణాటక అసెంబ్లీలో వందేమాతరం పాడేటప్పుడు కాంగ్రెస్ వారు రెండుచరణాలు పాడి ఆపేశారు. కానీ బీజేపీ వారు ఆరు చరణాలు పాడి అసెంబ్లీని గందరగోళం చేశారు. వందసంవత్సరాలకు పైగా మొదటి రెండు చరణాలు మాత్రమే అన్నిసందర్భాలలోనూ పాడుతున్నారు. మిగిలిన చరణాలలో దుర్గాదేవి స్తోత్రం ఉంటుంది. మనది సెక్యులర్ స్టేట్ కనుక అధికారికంగా దేవతలను దెయ్యాలను స్తోత్రం చెయ్యాల్సిన అవసరంలేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### పేరు మార్చాలి

సనత్ నగర్‌లోకొత్తగా నిర్మించిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్సు (టిమ్స్ )హాస్పిటల్‌పేరును పూర్వపు ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి పేరుపెట్టడం మిక్కిలి ముదావహం. ఇదే పేరుతో అల్వాల్ (టిమ్స్ )లో కడుతున్న ఆసుపత్రికి దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేరును పెడితే ఇంకా చాలా బాగుంటుంది. ఈ విషయంలో ఇప్పుడు ప్రాంతీయ తారతమ్యాలు చూపకూడదు. అలాగే వరంగల్‌లో నిర్మించతలపెట్టిన విమానాశ్రయానికి'కాకతీయ ఎయిర్‌పోర్ట్'నామధేయంతో అలంకరిస్తే అందంగా ఉంటుంది. ఆదరణ పొందుతుంది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతిమించి పోతూవున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలుతప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యంమత్తులో వాహనాలునడపొద్దని అధికారులుహెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటిపడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు.

-కె. సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### చైనా ఆధిపత్యాన్ని కట్టడి చేయాలి

బ్రిక్స్ సమావేశం ముగిసింది. అయితే బ్రిక్స్ కొన్ని స్పష్టమైన ఉద్దేశాలను ప్రసరింపజెస్తోంది. అమెరికా ఏకచక్రాధిపత్యం ఇంకా ఎంత మాత్రం చెల్లనేరదు. చైనా ఆధిపత్యాన్ని కట్టడి చేస్తాం అని చెప్పకనే భారత్ చెప్పేసింది. అమెరికా ఇజ్రాయిల్ కూటమిల దాష్టికాలను బ్రిక్స్ కూటమి కందిస్తోంది. బాలకోట్ దాష్టికాలను కూడా బ్రిక్స్ కూటమి కందించడం ద్వారా తీవ్ర వాదానికి వ్యతిరేకం అనే విషయాన్ని బలంగా ప్రపంచ వేదిక పైన చెప్పినట్టు అయ్యింది. ఇంకా భారత్ ఒక విషయంలో బ్రిక్స్‌కు ఎప్పటికి రుణపడిఉండాలి. భారత్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినస్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమానికి నిధులు అందించే బ్రిక్స్‌దేశాల అభివృద్ధి బ్యాంకుకు భారత్ ఎప్పటికి రుణపడి ఉండాలి. ఎందుకంటే ఇదిభారత్‌లో స్వచ్ఛతను నెలకొల్పడమే కాదు గ్రామీణ లేదా మొత్తంగా భారత పౌరుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మాత్రమే కాదు ఆర్థిక వ్యవస్థపెంపుదలలో ఈకార్యక్రమంప్రధానపాత్ర పోషిస్తున్నది.

- భారత అవినాష్, జనగామ

### కల్తీ నూనెలతో కేన్సర్

మన నగరాలు, పట్టణాలలో హోటళ్ళు అనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు, తినుబండారాల తయారీకి వాడే వంటనూనెలను ఒకసారి కంటే ఎక్కువసార్లు వాడటంతో ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురి అవుతున్నారు. వాడిన వంటనూనెను పదే పదే వాడటం నిషేధం అయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్ చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మనదేశంలో అనేక పట్టణాలు, నగరాలలో హోటళ్ళ వారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాక ప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి. శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం.

- కె. వెంకట మూర్తి, సికింద్రాబాద్

### ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఫార్మర్ ఐడీరిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. కేంద్ర ప్రభుత్వం భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ ఐడీపొంది ఉంటేనే భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ఇంకా ఎవరైనా రైతులురిజిస్ట్రేషన్ చేసుకోలేదంటే ఈరోజు మీ వ్యవసాయ విస్తరణ అధికారి గారిని కలిసి నమోదు చేసుకోగలరు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పండుగల్లో శబ్ద కాలుష్యం నివారించాలి!

## బాంబే హైకోర్టు సీరియస్

### మతపరమైన ఊరేగింపుల్లో లౌడ్‌స్పీకర్లు ఎందుకని ప్రశ్న



**ముంబయి, సెప్టెంబరు 23:** బాణసంచా, డీజేలు, లేజర్ బీమ్స్‌పై బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పండుగలను శబ్ద, వాయు కాలుష్యానికి కారణం కాకుండా జరుపుకోవచ్చని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన ఊరేగింపుల్లో లౌడ్‌స్పీకర్లు, డీజేలు, లేజర్ బీమ్స్ వినియోగాన్ని కూడా పూర్తిగా అనవసరమని వ్యాఖ్యానించింది. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఈ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ గిరీష్ కులకర్ణి, జస్టిస్ నీలా గోఖలేతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. దేవుడి ఆశీర్వాదం కోసం డీజేలు, బాణసంచా అవసరమా? లౌడ్‌స్పీకర్లు, బాణసంచా ఉపయోగించడం వల్ల దేవుడి నుంచి అదనపు ఆశీర్వాదాలు లభిస్తాయా అని హైకోర్టు ప్రశ్నించింది. బాధ్యతాయుతమైన సమాజంగా ఇలాంటి వాటికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. పండుగల సమయంలో శబ్ద, వాయు కాలుష్యం లేకుండా వేడుకలు నిర్వహించవచ్చని పేర్కొంది. ఇందుకు పండర్‌పూర్‌కు జరిగే వారీ యాత్రను ఉదాహరణగా కోర్టు ప్రస్తావించింది. ఎలాంటి లౌడ్‌స్పీకర్లు, పెద్ద శబ్దాలు లేకుండా ఈ యాత్ర ప్రశాంతంగా సాగుతుందని తెలిపింది. ఊరేగింపుల సమయంలో రోడ్లపై బాణసంచా కాల్చడం ప్రమాదకరమే కాకుండా వాయుకాలుష్యానికి కారణమవుతుందని కోర్టు పేర్కొంది. ముంబై వంటి నగరంలో ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడానికి ఎందుకు అనుమతించాలి ముంబైలో ఈ సమయంలోనే వాయు కాలుష్యం పెరిగి పొగమంచు వాతావరణం ఏర్పడుతుంది. దీన్ని ఆపాల్సిన అవసరం ఉంది. పగలైనా, రాత్రయినా ప్రజా రహదారులపై బాణసంచా కాల్చకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఊరేగింపుల సమయంలో తీవ్ర శబ్ద, వాయు కాలుష్యంపై హైకోర్టు సుమోటోగా కేసు స్వీకరించింది. విచారణ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ మిలింద్ సాఠే వాదనలు వినిపించారు. ఈనెల 9 నుంచి 26 వరకు అనుమతి లేకుండా ఐదుగురికి మించి వ్యక్తులు గుమిగూడడాన్ని ముంబై పోలీసులు నిషేధించారని ఆయన తెలిపారు. బాణసంచా, లౌడ్‌స్పీకర్లపైనా పూర్తి నిషేధం అమల్లో ఉందని చెప్పారు. ఈ నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా అని కోర్టు ప్రశ్నించింది. నిబంధనలు కాగితాలపై మాత్రమే బాగున్నాయని, వాటి ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. ప్రజా రహదారులపై బాణసంచా కాల్చడాన్ని ఇకపై నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. ఊరేగింపుల సమయంలో శబ్ద తీవ్రతను నియంత్రించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. పోలీసుల నుంచి అనుమతి పొందిన అన్ని కార్యక్రమాలు, ఊరేగింపుల నిర్వాహకులు ఆ అనుమతిని స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ నిబంధన అన్ని పండుగలకు వర్తిస్తుందని పేర్కొంది. ఊరేగింపులకు అనుమతి కోరే నిర్వాహకుల నుంచి ప్రభుత్వం భారీ మొత్తంలో సెక్యూరిటీ డిపాజిట్ తీసుకునే విషయాన్ని పరిశీలించాలని హైకోర్టు సూచించింది. గణేశ్ మండపాలకు నిధుల కొరత లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేసేలా నిబంధనలు రూపొందిస్తే అది నిరోధకంగా పనిచేస్తుందని కోర్టు పేర్కొంది. తాము ఎలాంటి పండుగ లేదా వేడుకలకు వ్యతిరేకం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే వేడుకల పేరుతో నిబంధనలను ఉల్లంఘించడం, ఇతర పౌరులకు ఇబ్బంది కలిగించడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. మతపరమైన భావాలను ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణతో సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. ఎవరి ప్రాణాలకు లేదా ఆరోగ్యానికి ముప్పు కలిగేలా వేడుకలు నిర్వహించకూడదని స్పష్టం చేసింది.

# 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే!

## స్పష్టం చేసిన ఇసి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే సర్ సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# మాకూ సమయం వస్తుంది మిమ్మల్ని వదలం

## ఎన్నికల సంఘంపై రాహుల్ ఫైర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ సమయం వస్తుంది మిమ్మల్ని వదలం అంటూ హెచ్చరించారు. ఓటు చోరీ భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

# విదేశీ ఉద్యోగాలపేరిట మోసాలపై హోంశాఖ అలర్ట్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో ("డాంకీ రూట్స్") విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రం నిర్దేశించింది. సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో వస్తున్న అనుమానాస్పద ఉద్యోగ ప్రకటనలపై సైబర్ సెల్స్ ద్వారా నిఘా ఉంచాలని సూచించింది. బాధితుల నుంచి డిజిటల్ సంభాషణలు, నగదు చెల్లింపుల రికార్డులను కీలక ఆధారాలుగా వెంటనే సేకరించాలని ఆదేశించింది.



# రాధ ఫిర్యాదుపై సోదరి అంబిక ఫైర్!

**చెన్నై, సెప్టెంబరు 23:** ఒకప్పటి ప్రముఖ నటీమణులు, అక్కచెల్లెళ్లు అయిన అంబిక, రాధల మధ్య ఆస్తి వివాదం ముదిరింది. తనపై సోదరి రాధ చేసిన ఆరోపణలను అంబిక తీవ్రంగా ఖండించారు. తనను దొంగగా చిత్రీకరించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవహారాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లడం తనను మానసిక వేదనకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. దాదాపు రూ. 46 కోట్ల విలువైన చెక్కులను తాను, తన సోదరుడు మల్లికార్జున్ కాజేయాలని చూశామంటూ రాధ చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంపై అంబిక స్పందించారు. ఈ ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, తాను ఎటువంటి తప్పు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. చిన్నతనం నుంచి కుటుంబం కోసం అహర్నిశలు శ్రమించానని, అటువంటి తనపై రాధ గదిలో నుంచి చెక్కులు దొంగిలించానని నిందలు వేయడం బాధాకరమని అన్నారు. రాధ తన వస్తువుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటుందని, నంబర్ లాక్ ఉన్న బ్యాగులనే వాడుతుందని, అటువంటప్పుడు దొంగతనం జరగడం అసాధ్యమని అంబిక వెల్లడించారు. ఈ వివాదానికి మూలకారణం ఆస్తి గొడవలేనని అంబిక తెలిపారు. ఏఆర్ఎస్ గార్డెన్‌ను తాను ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించానని, దివంగత ఎంజీఆర్ ఆశీస్సులతో ఆ పేరు పెట్టానని ఆమె గుర్తుచేశారు. అయితే, ఆ పేరును ఆర్.ఆర్. గార్డెన్‌గా మార్చి, తనకు రావాల్సిన వాటాను నిరాకరించడంతోనే న్యాయ పోరాటం చేయాల్సి వచ్చిందని ఆమె వివరించారు. ఈ సమస్యను కుటుంబ సభ్యుల మధ్యే పరిష్కరించుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, అవి ఫలించలేదని అంబిక పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున, న్యాయవ్యవస్థపై గౌరవంతో ఈ అంశంపై ఇకపై బహిరంగంగా మాట్లాడబోనని ఆమె స్పష్టం చేశారు.

# హాస్టళ్ల మెనూలో గొడ్డుమాంసం!

## విద్యార్థుల విజ్ఞప్తిని పరిశీలిస్తున్న టివికె సర్కార్



**చెన్నై, సెప్టెంబరు 23:** తమిళనాడులోని ప్రభుత్వ విద్యార్థి హాస్టళ్ల మెనూలో గొడ్డు మాంసం చేర్చే అంశం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. కొందరు విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక న్యాయ శాఖ మంత్రి వన్ని అరసు తెలపడంతో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నై సైదాపేటలోని ఎం.సి. రాజా సోషల్ జస్టిస్ హాస్టల్‌ను తనిఖీ చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు చికెన్, మటన్ అందిస్తున్నామని, సోమవారాల్లో బిర్యానీ కూడా వడ్డిస్తున్నామని తెలిపారు. అయితే, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కొందరు విద్యార్థులు మటన్ ధర చాలా ఎక్కువగా ఉందని, తమ ఇళ్లలో కూడా తినరని, కాబట్టి దాని స్థానంలో బీఫ్‌ను మెనూలో చేర్చాలని కోరినట్లు మంత్రి వివరించారు. ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, భిన్నాభిప్రాయాలు ఉన్నందున విద్యార్థులు, అధికారులతో చర్చించిన తర్వాతే ఒక నిర్ణయానికి వస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే విద్యార్థుల అభిప్రాయాల మేరకు ఉప్మా, కిచిడీ వంటి వాటిని తొలగించి, ఇడ్లీ, దోశ వంటివి మెనూలో చేర్చామని గుర్తుచేశారు. మంత్రి వన్ని అరసు ప్రకటనపై పుతియ తమిళగం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె. కృష్ణసామి తీవ్రంగా స్పందించారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో బీఫ్ సర్వసాధారణ ఆహారం కాదని, చికెన్, మటన్‌నే ఎక్కువ మంది తింటారని అన్నారు. ఇది కొందరి వ్యక్తిగత అభిరుచిని అందరి డిమాండ్‌గా చిత్రీకరించడమేనని విమర్శించారు. ఒకవేళ ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే రాజకీయ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, మంత్రి తన పదవిని కూడా కోల్పోవాల్సి రావచ్చని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, అటు విద్యార్థుల కోరిక, ఇటు రాజకీయ పార్టీల వ్యతిరేకతతో ఈ విషయం తమిళనాడులో హాట్ టాపిక్‌గా మారింది.

# ఐఎంఇఐ నంబరు మార్చాలని చూస్తే కఠిన చర్యలు

## మూడేళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా..కేంద్రం కసరత్తు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** మొబైల్ ఫోన్ల భద్రత పరంగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఫోన్‌కు సంబంధించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య అయిన ఐఎంఇఐ నంబర్‌ను ఉద్దేశపూర్వకంగా మార్చడం, తొలగించడం లేదా ట్యాంపరింగ్ చేయడం తీవ్రమైన నేరమని బుధవారం స్పష్టం చేసింది. ఈ నేరానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయని అధికారిక ప్రకటనలో హెచ్చరించింది. ఇలాంటి నేరాలను కాగ్నిజబుల్, నాన్‌బెయిలబుల్ నేరాలుగా పరిగణిస్తామని, అంటే పోలీసులు వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చని తెలిపింది. ఐఎంఇఐ ట్యాంపరింగ్‌కు సహకరించే హార్డ్‌వేర్ లేదా సాఫ్ట్‌వేర్‌ను కలిగి ఉండటం, ఉత్పత్తి చేయడం, లేదా వినియోగించడం కూడా చట్టవిరుద్ధమని ప్రభుత్వం పేర్కొంది. పౌరులు తమ మొబైల్ ఫోన్ల భద్రతను, ప్రామాణికతను నిర్ధారించుకోవడానికి సంచార్ సాథి ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించుకోవాలని సూచించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కొనుగోలు చేసిన ఫోన్ ఐఎంఇఐ వివరాలు, బ్రాండ్, మోడల్ వంటివి సరిచూసుకోవచ్చు. నకిలీ పత్రాలు సమర్పించి సిమ్ కార్డులు పొందడం, మోసం చేయడం, ఇతరుల పేరుతో సిమ్ కార్డులు వాడటం వంటివి కూడా శిక్షార్హమైన నేరాలని ప్రభుత్వం గుర్తుచేసింది. తమ పేరు మీద తీసుకున్న సిమ్‌లను ఇతరులకు బదిలీ చేయడం, అమ్మడం వంటివి చేయరాదని, వాటిని దుర్వినియోగం చేస్తే అసలు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే, మొబైల్ యాప్స్ లేదా ఇతర మార్గాల ద్వారా కాలర్ ఐడీ (సీఎల్ఐ)ని మార్చడం కూడా చట్టవిరుద్ధమని తెలిపింది. పౌరులు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి. ఆ తర్వాత టెలికాం ఆపరేటర్ నుండి పోయిన నంబర్‌పై డూప్లికేట్ సిమ్ కార్డు పొందాలి. ట్రాయ్ నిబంధనల ప్రకారం, కొత్త సిమ్ యాక్టివేట్ అయిన మొదటి 24 గంటల వరకు ఎస్ఎంఎస్ సేవలు నిలిపివేయబడతాయి. సంచార్ సాథి పోర్టల్‌లో ఫిర్యాదుకు ఓటీపీ అవసరం కాబట్టి, సిమ్ యాక్టివేట్ అయిన 24 గంటల తర్వాతే ఫోన్ బ్లాకింగ్ రిక్వెస్ట్ నమోదు చేయాలి. సంచార్ సాథి వెబ్‌సైట్ లేదా యాప్‌లో పోలీస్ రిపోర్ట్, గుర్తింపు కార్డు అప్‌లోడ్ చేసి ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చు. ఒకవేళ ఫోన్ తిరిగి దొరికితే, ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆ తర్వాత పోర్టల్‌లో రిక్వెస్ట్ ఐడీ ద్వారా ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

# సంక్షిప్త వార్తలు

## ఈస్టర్ బాంబింగ్‌కేసులో దోషులకు 260 సంవత్సరాల జైలు!

**కొలంబో, సెప్టెంబరు 23:** శ్రీలంకలో ఏడేళ్ల క్రితం పెను విషాదాన్ని మిగిల్చిన 2019 ఈస్టర్ ఆదివారం నాటి ఆత్మాహుతి బాంబు దాడుల కేసులో కొలంబో హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం, వారికి 200 నుంచి 260 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ తీర్పు వెలువడింది.

మంగళవారం ఈ తీర్పును ప్రకటించిన కోర్టు, ప్రధాన నిందితుడిగా ఉన్న నౌఫర్ మౌలవితో పాటు మిగతా వారికి శిక్షలు ఖరారు చేసింది.

## కరం వేడుకల్లో విషాదం.. నీట మునిగి ఐదుగురు మృతి

**రాంచి, సెప్టెంబరు 23:** గిరిజన పండుగ అయిన కరం వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా పూజించిన చెట్టు కొమ్మను ఈ తెల్లవారుజామున నిమజ్జనానికి తీసుకెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. నిమజ్జనం చేసే క్రమంలో నదిలోకి దిగిన ఐదుగురు వ్యక్తులు ప్రవాహంలో కొట్టుకుపోయారు. పాలము జిల్లాలోని మారుమూల



బొకాయ గ్రామంలో ఆదివాసీలు సంప్రదాయ కరం వేడుకలు నిర్వహించారు.

## మెర్సిడిస్ గ్యారేజీలో అగ్నిప్రమాదం.. ఎనిమిది కార్లు దగ్ధం



**జైపూర్, సెప్టెంబరు 23:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసు కుంది. సంగనేర్ సదర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని బాలాజీ మార్కెట్‌లో ఉన్న ఓ మెర్సిడెస్ వర్క్‌షాప్‌లో నిన్న రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో సుమారు 8 లగ్జరీ కార్లు, ఖరీదైన విడిభాగాలు, ఇతర యాక్సెసరీలు కాలి బూడిదయ్యాయి. ప్రమాద తీవ్రతకు దట్టమైన పొగలు దాదాపు 5 కిలోమీటర్ల దూరం వరకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 10 ఫైరింజన్లు రంగంలోకి దిగి, రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి.

## యెమెన్ జైలుపై హౌతీల దాడి: తొమ్మిది మంది ఖైదీల మృతి

**సనా, సెప్టెంబరు 23:** యెమెన్‌లో తమ నియంత్రణలో ఉన్న ఒక జైలుపై సౌదీ అరేబియా వైమానిక దాడులకు పాల్పడిందని, ఈ ఘటనలో తొమ్మిది మంది ఖైదీలు మరణించారని హౌతీ రెబల్స్ మంగళవారం ఆరోపించారు. ఉత్తర యెమెన్‌లోని అల్‌జౌఫ్ ప్రావిన్స్ రాజధాని అల్ హజ్మ్‌లో సోమవారం రాత్రి ఈ దాడి జరిగినట్లు వారు వెల్లడించారు. ఇటీవల జరిగిన పోరాటాల్లో పట్టుబడిన ఖైదీలను ఈ జైలులో ఉంచినట్లు హౌతీలు పేర్కొన్నారు. ఈ దాడిని హౌతీల ఖైదీల వ్యవహారాల కమిటీ అధినేత అబ్దుల్ ఖాదర్ అల్‌ముర్తాదా తీవ్రంగా ఖండించారు.

## మాజీ ప్రధాని ఇమ్రాన్ విడుదల కోసం భారీ ర్యాలీ!



**కరాచి, సెప్టెంబరు 23:** పాకిస్తాన్ మాజీ ప్రధాని, ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాకిస్థాన్ తెహ్రీక్‌ఇఇన్సాఫ్ ఈనెల 27న ఇస్లామాబాద్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. దీంతో పాకిస్తాన్ వ్యాప్తంగా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇస్లామాబాద్ వ్యాప్తంగా భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు. రాజధానిలోకి రాకుండా అడ్డుకునేందుకు రోడ్లపై కంటైనర్లను మోహరించి ఒక గోడలా మారుస్తున్నారు. వేలాది మంది పోలీసుల్ని రంగంలోకి దింపారు. ఇస్లామాబాద్ ఆస్పత్రులను హైఅలర్ట్‌లో ఉంచారు. ఇస్లామాబాద్, రావల్పిండిలో భద్రతా సిబ్బందిని మోహరించారు.

# డిసెంబరులో ప్రధాని మోడీ అమెరికా, కెనడా పర్యటన!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఏడాది డిసెంబర్‌లో అమెరికాలో పర్యటించే అవకాశం ఉంది. ఫ్లోరిడాలోని డొరల్‌లో డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే జీ20 దేశాధి నేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆతిథ్యం ఇస్తున్న ఈ సదస్సును 2009 తర్వాత అమెరికా నిర్వహించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. మోడీకి ట్రంప్ అధిక ప్రాధాన్యం ఇస్తారని, వారిద్దరి మధ్య బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని అమెరికా రాయబారి సెర్జియో గోర్ గతంలోనే వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇదే సదస్సు వేదికగా భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల కూటమి క్వాడ్ నేతల సమావేశం నిర్వహించేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. అమెరికా పర్యటన ముగిసిన అనంతరం మోడీ కెనడాలో కూడా పర్యటించే అవకాశం ఉందని సమాచారం. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్ కెనడా మధ్య సమగ్ర వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. జీ20 సదస్సు కోసం ప్రధాని డిసెంబర్‌లో అమెరికా వస్తారని యూఎస్ రాయబారి జూన్‌లోనే సంకేతాలు ఇచ్చారు. భారత ప్రభు త్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలు వడాల్సి ఉంది. సాధారణంగా పర్యటన తేదీలకు సమీపంలోనే విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేస్తుంది. ఈ పర్యటన ఖరారైతే భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలు, ఇండోపసిఫిక్ వ్యూహం కీలక అంశాల్లో పురోగతికి బాటలు వేసినట్లవుతుంది.

# ఇమ్మిగ్రేషన్ సమస్యలపై భారతీయ కుటుంబాలు ఆందోళన

## మాసాచుసెట్స్ కాంగ్రెస్ సభ్యునితో ప్రతినిధుల భేటీ

**వోర్సెస్టర్, సెప్టెంబరు 23:** అమెరికాలో ఇమ్మిగ్రేషన్ సమస్యలతో విద్యార్థులు, కుటుంబాలు, వైద్య నిపుణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై మసాచుసెట్స్‌లోని ష్రూస్‌బరీలో కాంగ్రెస్ సభ్యుడు జిమ్ మెక్‌గవర్న్‌తో సమావేశమయ్యారు. ఈనెల 19న ఇండియా వోర్సెస్టర్ సెంటర్‌లో జరిగిన ఈ భేటీలో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీకి చెందిన వైద్యులు, వ్యాపారవేత్తలు, నిపుణులు, పౌర హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు. ఇమ్మిగ్రేషన్, ఆరోగ్య సేవలు, ఆర్థిక అవకాశాలు, పౌర భాగస్వామ్యం, అమెరికాభారత్ సంబంధాలపై చర్చించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను ఎదుర్కొనే క్రమంలో విద్యార్థులు, కుటుంబాలు, వైద్య నిపుణులు సహా పలువురు వలసదారులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. అయితే నిర్దిష్ట ఇమ్మిగ్రేషన్ ప్రతిపాదనలను మాత్రం కమ్యూనిటీ నాయకులు వెల్లడించలేదు. అమెరికాలోని వివిధ మతాలు, రాజకీయ అభిప్రాయాలకు చెందిన భారతీయులు పౌర వ్యవహారాల్లో తమ వాణిని వినిపించాలని నాయకులు కోరారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులతో నిరంతరం నేరుగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా భారత్ పౌర అణు ఒప్పందానికి గతంలో ఇండియన్ అమెరికన్లు వివిధ పార్టీల మధ్య మద్దతు కూడగట్టడంలో పోషించిన పాత్రను కూడా సమావేశంలో గుర్తు చేశారు. రెండు పార్టీల సహకారంతోనే ఆ ఒప్పందం సాధ్యమైందని యూఎస్ ఇండియా సెక్యూరిటీ కౌన్సిల్ వ్యవస్థాపకుడు రమేశ్ విశ్వనాథ్ కపూర్ పేర్కొన్నారు. టెక్నాలజీ, వాణిజ్యం, ఇంధనం, ఆరోగ్యం, విద్య, రక్షణ, పరిశోధన రంగాల్లో అమెరికాభారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ కీలక పాత్ర పోషించగలదని నాయకులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ప్రజాప్రతినిధులతోచర్చలు కొనసాగించాలన్నారు.

# మేఘాలయ యుడిపిలో అంతర్గత సంక్షోభం

## ఒకేసారి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బిజెపిలో చేరిక



**షిల్లాంగ్, సెప్టెంబరు 23:** మేఘాలయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. బుధవారం న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లఖ్‌మెన్ రింబుయ్, పియస్ మార్వీన్, కిర్మెన్ షైల్లా, మైరాల్బోర్న్ సియెమ్, మ్యాథ్యూ కుర్బా ఒల్లాన్ సింగ్ సుయిన్, బాలాజిద్ కుపర్ సిన్రెమ్, సిన్షర్ లింగ్డోహ్ థబాహ్ ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు చేరడంతో 60 మంది సభ్యులున్న మేఘాలయ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య 2 నుంచి 10కి పెరిగింది. దీంతో అసెంబ్లీలో బీజేపీ రెండో అతిపెద్ద పార్టీగా మారినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. యుడిపికి మొత్తం 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఎనిమిది మంది ఒకేసారి బీజేపీలో చేరడం ఆ పార్టీ అసెంబ్లీ బలాన్ని గణనీయంగా మార్చింది. బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చర్చలు జరిపినట్లు ముందుగా వెల్లడైంది. కోల్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలు, ఖాసీ భాషకు రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో స్థానం, మేఘాలయ రెసిడెంట్స్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ యాక్ట్ అమలు, థెమ్ ఐవ్ మావ్‌లాంగ్‌లోని హరిజన్ కాలనీ తరలింపు వంటి స్థానిక అంశాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు నివేదికలు తెలిపాయి. అయితే బీజేపీలో చేరిన తర్వాత ఈ అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది భవిష్యత్తులో స్పష్టమవుతుంది.

# రేపటి ప్రజావాణి 29కి వాయిదా

**బేగంపేట, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఈనెల 25వ తేదీ (శుక్రవారం) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 29 (మంగళవారం)కు వాయిదా వేసినట్లు స్టేట్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలియజేసారు. దరఖాస్తుదారులు ఈమార్పును గమనించి సెప్టెంబరు 25వతేదీ శుక్రవారం కాకుండా సెప్టెంబరు 29న జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

# కరెంటును పరిచయం చేసిందే కాంగ్రెస్: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్



**హైదరాబాద్, సెప్టెంబరు23,ప్రభాతవార్త:** దేశంకు కరెంటును పరిచయం చేసిందే కాంగ్రెస్‌పార్టీ అనీ ఎన్నో ఇబ్బందులు ఉన్నా విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామనీ బిఆర్ఎస్ అబద్ధపు విష ప్రచారాన్ని నమ్మొద్దని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు.సిఎల్పి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంత ధర చెల్లించైనా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు ఇస్తామని తెలిపారు. విద్యుత్ శాఖను అవినీతి, అక్రమాలకు నిలయంగా మార్చారని బిఆర్ఎస్ హయాంలో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ప్రతిబంధకంగా మారాయి అని ఆవేదన చెందారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి డిస్కంలను నష్టాలపాలు చేశారని కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. ఎల్‌నినో వల్ల యావత్తు ప్రపంచం ఇబ్బంది పడుతోందనీ అన్ని చోట్ల విద్యుత్ కష్టాలున్నాయని చెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు వెళ్లి చూడండి ఎంతఘోరంగా ఉందో తెలుస్తోందని సలహాఇచ్చారు. తెలంగాణలో పవర్ ప్లాంట్లను తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చరిత్రను గుర్తుచేశారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల విషయంలో మీరు ఏం చేశారో అందరికీ తెలుసు అని ఎద్దేవా చేశారు. మధ్యలో వచ్చి నడుమంతరంగా మేమే కరెంటు ఇచ్చామనే నమ్మించలేరనీ 2014వరకు కాంగ్రెస్ ఉచిత కరెంటు రైతులకు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ వస్తే కరెంటు రాదని ఎవరు రాసి ఇస్తే మాట్లాడడం కాదు.. కళ్లు తెరిచి చూడండి అని అన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడానికి తప్ప మీరు దేనికీ పనికిరారు. పవర్ పోయి పరేషాన్‌లో బిఆర్ఎస్ పార్టీ ఉందనీ చిన్నచిన్న సమస్యలను గోరంతలు కొండంతలుగా చూపుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# విద్యుత్‌చార్జీలపై కెసిఆర్ పోరాటమంటూ కెటిఆర్ అసత్య ప్రచారం

## భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** మంత్రి పదవి ఇవ్వలేదు,డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారని కెసిఆర్ టిడిపి నుంచి బయటకు వచ్చారని కెసిఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాటం చేశారని కెటిఆర్ అబద్ధాలు చెప్తున్నారని భువనగిరి ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. 2,000 సంవత్సరంలో బషీర్‌బాగ్ కాల్పులు జరిగినప్పుడు కెసిఆర్ టిడిపిలో ఉన్నా రని కెసిఆర్ 2001లో టిడిపి నుంచి బయటకు వచ్చారని కెటిఆర్ చరిత్ర తెలుసుకో అని హితవు చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదే బిఆర్ఎస్ హయాంలో డిస్కంలలో 81 వేల కోట్ల అప్పులు చేశారని ఆయన తెలిపారు. ఛత్తీస్ ఘడ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ను బిఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిందనీ ఆయన చెప్పారు. కెటిఆర్ పిట్ట కథలు చెప్పడం బంద్ చేయాలనీ ఛత్తీస్ ఘడ్ విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయనీ ఆరోపించారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ బదులు సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడి వెయ్యి కోట్లు నష్టం కలిగించారని ఆరోపించారు. యాదాద్రి ఓపెన్ బిడ్డింగ్ పెట్టకుండా నామినేషన్ పద్దతిలో బి.హెచ్.ఈ.ఎల్‌కు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారని విమర్శించారు. విద్యుత్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడి దనీ మాజీమంత్రి జగదీష్ రెడ్డికి ఫామ్ హౌస్ లు ఎక్కడివి అని ప్రశ్నించారు. తమకు ఓట్లు వేయలేదని ప్రజలు,రైతులపై బిఆర్ఎస్ కక్ష పెట్టుకొని ఎల్ నినోతో వచ్చిన కరవును తెచ్చి,కాంగ్రెస్‌పై నెట్టాలని చూస్తోందనీ ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బిఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టి పంట వేయించి రైతులు ఆగం కావాలని భావిస్తోందనీ, రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ నేతల ఫైల్స్‌ను ఒక్కొక్కటి బయట పెడతామని హెచ్చరించారు. మిగులు రాష్ట్రాన్ని 10 యేళ్ళల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల మయం చేసి, బిఆర్ఎస్ నేతలను ఆరు బృందాలుగా పవర్ స్టేషన్ల వద్దకు పంపుతున్నారనీ అన్నారు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

# పేదల సొంతింటి కల సాకారం

## మూడో విడతలో మరిన్ని ఇళ్లు: మంత్రి పొంగులేటి

**భద్రాచలం, సెప్టెంబరు 23ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భద్రాచలం అంబ సత్రం మార్గంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మోనిక నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని బుధవారం మంత్రి ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి గృహప్రవేశ కార్యక్ర మంలో పాల్గొన్నారు. లబ్ధిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉద్దేశమన్నారు. అర్హత ఉన్న పేదలందరికీ మూడో విడతలో, అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలకు 12 మంది ఎంపిక

**నాంపల్లి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా వివిధరంగాల్లో విశేష సేవలు, కృషిచేసిన ప్రముఖులకు అందజేసే ప్రతిభా పురస్కారాలకుగాను 2026 సంవత్సరానికి 12 మందిని ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారాలకు ఎంపికైన వారిలో కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవితా విభాగంలో, ఆచార్య ఎన్.భక్తవత్సలరెడ్డి విమర్శ, కూరెళ్ల శ్రీనివాస్ చిత్రలేఖనం, ఎ.ఎస్.ప్రకాష్ శిల్పం, డా. హెచ్.అనిత నృత్యం, దుడ్డు సీతారామయ్య సంగీతం, డా. వై.నాగేశ్వరావు పత్రికారంగం, సురభి వెంగమాంబ నాటకరంగం, తూర్పాటి సాలమ్మ జానపద కళారంగం; డా. ఎం.వి.పట్వర్ధన్ అవధానం, ఆచార్య కాత్యాయని విద్మహె ఉత్తమ రచయిత్రి, కస్తూరి మురళీకృష్ణ నవల విభాగంలోఉన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో త్వరలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఆయా ప్రము ఖులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కోట్ల హనుమం తరావు తెలిపారు.పురస్కార గ్రహీతలను సత్కరించి పురస్కారంతోపాటు సన్మాన పత్రం,రూ.30,116నగదును అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ వెల్లడించారు.

# డ్రగ్‌ఫ్రీ తెలంగాణే లక్ష్యం.. ప్రజా ఉద్యమమే ఆయుధం!

## మాదకద్రవ్యాలపై సమరానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు23:** మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుంచి యువతను, విద్యార్థులను కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం భాగస్వామ్యంతో సాగాల్సిన సామాజిక ఉద్యమమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ గవర్నర్‌గా 11 మార్చి 2026న బాధ్యతలు స్వీకరించిన తర్వాత, నశా ముక్త్ భారత్ అభియాన్‌ను రాష్ట్రంలో ప్రజా ఉద్యమంగా విస్తరించేందుకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వేదికేదైన డ్రగ్‌ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రజలు,యువతను చైతన్యం చేస్తున్నారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, హన్మకొండ వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ పై ప్రజలను ముఖ్యంగా యువతను చైతన్యం చేసేందుకు నిర్వహించిన అవగాహన, చైతన్య కార్యక్ర మాలలో పాల్గొన్నారు. జిల్లా అధికారులతో ఆయా జిల్లాల్లో నిర్వహించిన సమావేశాల్లోనూ డ్రగ్ ఫ్రీ తెలంగాణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు గవర్నర్ దిశా నిర్దేశం చేశారు.బాధ్యతలు స్వీకరించిన వెంటనే మాదక ద్రవ్యాల కట్టడిపై గవర్నర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు విద్యాసంస్థల్లోనే అవగాహనను బలోపేతం చేయాలని గవర్నర్ సూచించారు. ఏప్రిల్‌లో సిఎం ఎ.రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో విద్యార్థులకు యాంటీడ్రగ్ ప్రతిజ్ఞ చేయించడం, పాఠశాలలు- కళాశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పెంచడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. విద్యార్థులు విద్యా సంస్థలలో చేరే సమయంలో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రకటన చేసే విధానాన్ని ప్రవేశ పెట్టాలని గవర్నర్ సీఎంకు సూచించారు. జూన్‌లో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో పెద్ద సంఖ్యలో హాజరైన విద్యా ర్థులతో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సీఎం, మంత్రుల సమక్షంలో యాంటీడ్రగ్ ప్రతిజ్ఞ చేయించారు. తెలం గాణను మాద కద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు, అధికారులు అన్ని వర్గాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం అవగాహన కార్యక్రమంగా కాకుండా, ఇళ్లు, గ్రామాలు, పంచాయతీల నుంచి ప్రారంభమయ్యే ప్రజా ఉద్యమంగా మారాలని ఆయన పేర్కొ న్నారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు గమనించాలని, విద్యార్థులు చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచా రాన్ని భయపడకుండా అధికారులకు తెలియజేయాలని సూచించారు. జూలై 9న హనుమకొండలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్-డ్రగ్-ఫ్రీ తెలంగాణ' కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌లో యాంటీడ్రగ్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి, అవగాహన ర్యాలీని ప్రారంభించారు. హన్మకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో ప్రచారం అమలు తీరును సమీక్షించారు. విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో ఆగస్టులో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో లోక్‌భవన్‌లో నిర్వహించిన సమీక్షలో నషా ముక్త్ యువ కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్లు, అధ్యాపకులు, ఇతర యువత మై భారత్ పోర్టల్ ద్వారా నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణకు నిర్దేశించిన ఆన్‌లైన్ ప్రతిజ్ఞల లక్ష్యంను పూర్తి చేయాలని సూచించారు. దీంతో యాంటీడ్రగ్ ప్రచారం కేవలం పోలీస్ లేదా ఎక్సైజ్ శాఖల పరిధిలో కాకుండా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, యువజన సంస్థల వరకు గవర్నర్ విస్తరించారు. ఆగస్టు 25న నిజామాబాద్‌లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో గవర్నర్ యువతకు మరింత స్పష్టమైన సందేశం ఇచ్చారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ శక్తిని విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం వైపు మళ్లించాలని సూచించారు. ఇదే సమయంలో మాదకద్రవ్యాల సమస్యను ఎదుర్కోవడానికి కఠినమైన చట్టపరమైన చర్యలతో పాటు నిరంతర అవగాహన, కౌన్సెలింగ్, పునరావాసం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. యువతను మాదకద్ర వ్యాల నుంచి రక్షించడంలో విద్యాసంస్థల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. నిజామాబాద్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈగల్ కార్యక్రమాన్ని, విద్యాసంస్థల్లో యాంటీడ్రగ్ కమిటీలు, పవార్ క్లబ్‌ల ఏర్పాటును గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. నశా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని వికసిత్ భారత్-2047 లక్ష్యంతో అనుసంధానిస్తూ, ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ కలిగిన, సామాజిక బాధ్యత ఉన్న యువతే దేశ నిర్మాణానికి కీలకమని గవర్నర్ చెబుతున్నారు. తెలంగాణను డ్రగ్‌ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలంటే చట్టం ఒక్కటే సరిపోదు. చైతన్యం, కుటుంబ పర్యవేక్షణ, విద్యాసంస్థల భాగస్వామ్యం, యువత సంకల్పం, కౌన్సెలింగ్, పునరావాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. 'ఇంటినుంచి ప్రారంభమై.. విద్యాసంస్థల్లో బలపడి.. యువత ద్వారా ప్రజా ఉద్యమంగా మారి.. డ్రగ్‌ఫ్రీ తెలంగాణగా రూపు దిద్దుకోవాలి' అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు నిస్తున్నారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు విడుదల

## తొలి విడతలో 4,300 ఎకరాలు

## దశలవారీగా 22-23 వేల ఎకరాలకు సాగునీరు

## సీతారామ ప్రాజెక్టుతో సాగునీటి విస్తరణ: మంత్రి తుమ్మల



బుధవారం మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

**అశ్వాపురం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పథకం పంపులను ప్రారంభించి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. అనంతరం మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు మంత్రులు తెలిపారు.పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణ సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు పది నియోజకవర్గాలకు సాగునీటి విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అశ్వాపురం,పినపాక ప్రాంతాల నుంచి గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకెళ్లే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువలకు అవసరమైన అదనపు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు జూలూరుపాడు టన్నెల్,లలితాపురం ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై సర్వేలు నిర్వహించి సవరించిన అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూసేకరణలో రైతులు సహకరించాలని,భూములు కోల్పోయే వారికి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నియోజకవర్గంలో సాధ్యమైన ప్రాంతాల్లో చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి గోదావరి జలాలను నిల్వచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**22-23 వేల ఎకరాలకు సాగునీరు:** మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా 22-23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతులు, పేదలు, గిరిజనులు, మహిళలు,యువత సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పులుసుబొంత ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరలో టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభంతో అశ్వాపురం,పినపాక ప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు.గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరుకోవడం రైతులకు పండుగ వాతావరణాన్ని కల్పించిందన్నారు.

# ఇంటి ముంగిటకే మీసేవ..డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



మీసేవ డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త :** ప్రజా పాలనను పౌరులకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రభుత్వ సేవలను నేరుగా ఇంటి వద్దకే అందించే మీసేవ డోర్ డెలివరీ సదుపాయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో ప్రారంభించారు. ఈ నూతన విధానం ద్వారా పౌరులు 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి గానీ, అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా గానీ తమకు అనుకూలమైన సమయానికి స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి మీసేవ ఎగ్జిక్యూటివ్లు నేరుగా దరఖాస్తుదారుల ఇంటికే చేరుకుని, సంబంధిత దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేస్తారు. ఈ డోర్ డెలివరీ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన ఈసీ (ఎనకంబరెన్స్) కాపీలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు, పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ ధ్రువీకరణ సేవలు ప్రజలకు గడప వద్దే సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు ఇప్పటికే మొదటి విడతలో 70 మందికి పైగా మీసేవ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తొలి దశలో భాగంగా హైదరాబాద్ లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని, అక్కడ వచ్చే స్పందన, అనుభవాలను పరిశీలించిన అనంతరం త్వర లోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాలకు మీసేవ డోర్ డెలివరీ సేవలను విస్తరిస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజా పాలనను పౌరులకు మరింత చేరువ చేస్తూ, ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా నాణ్యమైన పౌర సేవలను నేరుగా ఇంటి వద్దకే చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, ఐటీ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, తెలంగాణ మీసేవ ఫౌండేషన్ అధ్య క్షుడు భైరా శంకర్, ప్రధానకార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ మోహీద్, లీగల్ అడ్వైసర్ ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను రాజకీయం చేయడం కెటిఆర్‌కు తగదు: ఎంపి మల్లు రవి

**హైదరాబాద్ ,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** ప్రకృతి వైపరిత్యంను కూడా రాజకీయం చేయడం కెటిఆర్‌కు తగదని కరెంటు సమస్య జలవిద్యుత్ తగ్గడం వల్ల ఏర్పడింనది దేశంలో ఎక్కడ కూడా కొందామన్నా కరెంటు లభ్యత లేదని నాగర్ కర్నూల్‌ఎంపి మల్లు రవి అన్నారు. ఎల్ నినో వల్ల దేశ వ్యాప్తంగా తీవ్రమైన కరువు వచ్చి కరెంట్ సమస్యలు వస్తే దాన్ని కెటిఆర్ రాజకీయంగా రాద్ధాంతం చేయడం ఏమిటి? ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాలు లేక దేశవ్యాప్తంగా కరవు వచ్చి, జల విద్యుత్తు లేకపోవడం తో కరెంట్ సమస్యలు వచ్చిన విషయం తెలిసి కూడా కెటిఆర్ రాజకీయాలు చేయడం తగదు అని అన్నారు. కరెంట్ దేశ వ్యాప్తంగా కరవు ఉంటే ఎక్కడ నుంచి కొనలేని పరిస్థితి ఉందనీ ఆయన ప్రశ్నించారు. రాజకీయ దురుద్ధేశాలు కెటిఆర్ అపాదించడం సబబు కాదనీ అన్నారు.ఎల్ నినో కూడా కాంగ్రెస్ వల్లనే వచ్చినట్టు కెటిఆర్ ప్రచారం చేయడం దారుణమనీ ఆవేదన చెందారు. కరెంట్ సమస్యలపై ప్రజలకు అన్ని తెలుసు కెటిఆర్ రాజకీయాలను ప్రజలు ఎవరు నమ్మరని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

# అక్రమ భూములపై మాట్లాడే దమ్ములేక కెటిఆర్ డైవర్షన్ పాలిటిక్స్: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** మేము బయటపెట్టిన మీ అక్రమ భూములపై మాట్లాడే దమ్ము లేకే కెటిఆర్ కరెంట్ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్‌ఆరోపించారు. కరువు, కరెంట్‌పై కెటిఆర్‌వి తలతోక లేని మాటలు, అవగాహన, ఆలోచన లేని మాటలు అని కొట్టివేశారు. ఎల్‌నినో పరిస్థితులు దేశ వ్యాప్తంగా ఉన్నాయి, ఈ పరిస్థితి ప్రభుత్వాలు తెస్తే వచ్చేది కాదనీ ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఆధారాలతో సహా మీ వందల ఎకరాల భూముల అక్రమ బాగోతాన్ని ప్రజా క్షేత్రంలో బయటపెట్టారు ముందు వాటికి సమాధానం చెప్పు, నమ్మి నానబోస్తే పుచ్చిబూరేలైనట్లు పదేళ్లు మీకు అధికారం ఇస్తే రాబందుల్లా మీరు ఎలాదోచుకున్నారో ఈ వారం రోజులు తెలంగాణ సమాజం గమనించిందనీ ఆయన అన్నారు. వాటికి సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మరల్చడానికి కెటిఆర్ ఏదో మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. దమ్ముంటే మేముఆధారాలతో సహా చూపించిన మీరు అక్రమంగా దోచుకున్న భూముల ఆరోపణలకు ఆన్సర్ చేయ్ కెటిఆర్ అని ఆయన సవాల్ చేశారు.

# కరాటే ఫైటర్ సత్యతేజకు మహేష్ కుమార్ గౌడ్ సన్మానం

**హైదరాబాద్ సెప్టెంబరు 23,ప్రభాతవార్త:**అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతిని చాటిన సత్యతేజను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బుధవారం తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ఘనంగా సన్మానించి అభినందించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో నిర్వహించిన ఎకెఎఫ్24వ జూనియర్ యు21 ఛాంపియన్‌షిప్-2026లో తెలంగాణకు చెందిన కరాటే క్రీడాకారిణి బ్రహ్మదండి సత్యతేజ అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించారు.66 కెజి విభాగం వ్యక్తిగత కుమిటేలో సత్యతేజ ఈ పతకాన్ని సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. తెలంగాణలో క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో కరాటే క్రీడ వేగంగా దూసుకెళ్తుందనడానికి సత్యతేజ సాధించిన అంతర్జాతీయ పతకమే నిదర్శనం" అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సత్యతేజ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే

## బాధిత కుటుంబాలకు పరిహారం కాదు..రూ. 50 లక్షల ఫైన్ కట్టాలి..ప్రజలకు క్షమాపణ చెప్పాలి

## ముఖ్యమంత్రికి నెల టైమిస్తున్నాం. ఈలోగా జిల్లాలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి: టిఆర్ఎస్ చీఫ్ కవిత



బుధవారం ఆదిలాబాద్ రిమ్స్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న కవిత

**ఆదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్ లో అగ్ని ప్రమాదం జరిగి ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యలేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం తోనే రోజులు కూడా నిండని పసిపిల్లలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దత్తత తీసుకున్న జిల్లాలో ఇంత హృదయ విదాకరమైన సంఘటన జరిగితే వచ్చి చూసే తీరిక లేదా అని ప్రశ్నించారు. ఫుట్ బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంది గానీ మైనార్టీ, ఆదివాసీ చిన్నారులు చనిపోతే వచ్చి చూసే తీరిక లేకుండా పోయిందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్ లో అగ్ని ప్రమాదం జరిగిన ఎస్ఎన్ సీయూను బుధవారం కల్వకుంట్ల కవిత పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును హాస్పిటల్ సిబ్బందిని, చిన్నారుల తల్లి దండ్రులు, బంధువులను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా చిన్నారులను కోల్పోయిన కుటుంబాలకు రూ. 50 లక్షలు పరిహారం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. నిజానికి ప్రభుత్వం ఇచ్చేది పరిహారం కాదు ఫైన్ అని అన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకే కాకుండా ప్రమాదం నుంచి బయటపడి చికిత్స పొందుతున్న చిన్నారుల కుటుంబాలకు కూడా అంతే పరిహారం ఇవ్వాలని కోరారు. 30 నెలలుగా ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి గానీ హెల్త్ మినిస్టర్ గానీ రాకపోవడం దారుణమని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హాస్పిటల్ సందర్శనకు వచ్చిన హెల్త్ మినిస్టర్ అత్యంత నిరక్ష్యంగా వ్యవహ రించారని చెప్పారు. ఏదో ఎక్స్ కర్షన్ కు వచ్చినట్లు వచ్చి కనీసం గంటన్నర కూడా లేరన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి హాస్పిటల్‌కు వచ్చే రోడ్లు అధ్వానంగా ఉండటంతో హాస్పిటల్ కు చేరే వరకే గర్భిణులు చనిపోతున్నారని అన్నారు. హాస్పిటల్ లో సరైన వసతులు లేక చిన్నారులు చనిపోతున్నారని చెప్పారు. 350 మంది డాక్టర్లు ఉండాల్సిన 150 మందే డాక్టర్లు ఉన్నారని.. 20 శాతం శానిటేషన్ సిబ్బందితోనే పనిచేయిస్తున్నారన్నారు. 150 ఏసీలు ఉన్న చోట ఒక్క ఏసీ మెకానిక్ లేకపోవటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా 500 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. ఒక్క రిమ్స్ లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఇవే పరిస్థితులు ఉన్నాయన్నారు. వరంగల్ ఎంజీఎంలో పై కప్పు కూలిపోయిన సంఘటన, నాగర్ కర్నూల్ లో ఈసీజీ మెషీన్ ను ఎలుకలు కొరికి సంఘటనలు ఆమె గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్ లో 10 శాతం హెల్త్ కు కేటాయిస్తామన్న ముఖ్యమంత్రి 5 శాతం కూడా నిధులు కేటాయించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిల్లో కూడా సగం జీతాలకే పోతుందని ఇక ప్రజలకు మెరుగైన వైద్యం ఎలాఅందుతుందని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్ లో పరిస్థితులపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**హాస్పిటల్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి**

రిమ్స్ అగ్ని ప్రమాదానికి ప్రభుత్వ నిరక్ష్యంతో పాటు హాస్పిటల్ డైరెక్టర్ నిరక్ష్యం కూడా కారణమని అన్నారు. హాస్పిటల్ లో పరిస్థితిని ప్రభుత్వానికి వివరించడంలో ఆయన విఫలమయ్యారన్నారు. కలెక్టర్ కూడా హాస్పిటల్ పరిస్థితిపై రివ్యూ నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.హాస్పిటల్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రమాదం నుంచి బయటపడి ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన పిల్లలకు సంబంధించిన బిల్లును ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

**మృతుల కుటుంబాలకు రూ.50 వేల ఆర్థిక సాయం**

రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్ సీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత రూ. 50వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ముగ్గురు చిన్నారుల కుటుంబాలకు మంగళవారం సాయంత్రమే సాయం అందజేయగా బుధవారం మిగతా ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకుసాయం అందజేశారు. చిన్నారులను తిరిగి తెచ్చి ఇవ్వలేక పోయినా దుఃఖంలో ఉన్న కుటుంబాలకు భరోసా ఇవ్వాలన్నదే తమ సంకల్పం అన్నారు.



## వరద ఉధృతికి కుప్పకూలిన బ్రిడ్జి
### ములకలపల్లిలో బీభత్సం

**ములకలపల్లి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** ములకలపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాజుపేట గ్రామ శివారులోని పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి బుధవారం వరద ఉధృతికి ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ఉధృతిని తట్టుకోలేక బ్రిడ్జి నేలమట్టమైనట్లు స్థానికులు తెలిపారు. బ్రిడ్జి కూలిన సమయంలో వాహనాలు, ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని వాట్సాప్ ద్వారా అధికారులకు చేరవేసినప్పటికీ, వార్త రాసే సమయానికి ఒక్క అధికారి కూడా సంఘటనా స్థలానికి చేరుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కూలిపోవడంతో రహదారిపై వాహనాలు నిలిచిపోగా, స్థానిక యువకులు, గ్రామస్తులు స్పందించి వాహనాలను కంపగూడెం క్రాస్‌రోడ్డు నుంచి కంపగూడెం, గొల్లగూడెం మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. బ్రిడ్జి పునర్నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని స్థానికులు సూచించారు.

## ప్రతిష్ఠాత్మకంగా ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్
### కొత్త శిఖరాలకు తెలంగాణ భవిష్యత్తు, ఆర్థిక ప్రగతి: డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జ 2026ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, ఎ లక్ష్మణ్‌తో కలసి మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు ఈ గ్లోబల్ సదస్సును నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు ఇదన్నారు. దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని సూచించారు. వచ్చే 20 ఏళ్ల నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కలిగిఉన్నట్లు చెప్పారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించాలని మంత్రివర్గ ఉపసంఘానికి నివేదించాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల స్పందనను బట్టి అవసరమైతే ప్రస్తుతం అనుకుంటున్న 4 సభా ప్రాంగణాలను (హాల్స్) 6 లేదా 8కి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక వికాసంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడా రాజీ పడకుండా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను చారిత్రాత్మక విజయం చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఈగల్‌ఫోర్స్ సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఏఎన్‌టిఎఫ్) 3వ జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకోవడం రాష్ట్ర పోలీసుశాఖకు, రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీ సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచితంగా వ్యవహారించారనే ఆరోపణలకు సంబంధించి రేవూరి ప్రకాశ్‌రెడ్డి నేతృత్వంలోని ఎథిక్స్ కమిటీ అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో బుధవారం సమావేశం అయింది. మరిన్ని ఆధారాలు పరిశీలన జరపాల్సిన ఉన్నందున విచారణను ఈనెల 30వ తేదీకి కమిటీ వాయిదా వేసింది.

## గణేశ నిమజ్జనంలో ఎస్ఐ మృతి

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం బందోబస్తులో ఉన్న కొత్తగూడెం టూ టౌన్ ఎస్ఐ కె.వెంకన్న(55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎన్టీఆర్ మార్గ్ క్రేన్-2 వద్ద విధుల్లో ఉండగా గుర్తు తెలియని బైక్ ఆయనను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన కన్నుమూసినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు
### ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రాగల రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ లను జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల జాబితాలో పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ ఉన్నాయి. ఈ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## తెలంగాణ సంస్కృతి, ఆత్మీయతలకు ప్రతీక అలై బలై
### హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు సోదరభావానికి సజీవ ప్రతీకగా నిలిచే అలై బలై 2026 వేడుకలను ఈసారి అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు బుధవారం రాంనగర్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. అలై బలై ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా నిర్వహించే అలై బలై వేడుకలు కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి ఆత్మీయతను పంచే గొప్ప వేదిక అని కొనియాడారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి మాట్లాడుతూ రాబోయే అలై బలై 2026 కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ప్రణాళికలపై కమిటీ సభ్యులు విలువైన సూచనలు, సలహాలు అందించారని తెలిపారు. వివిధ కమిటీల ప్రతినిధులు, సభ్యులు శిల్ప రెడ్డి, వెంకట్ రమణి, ఆనంద్ గౌడ్, ఆర్. ప్రదీప్, డాక్టర్ సత్యం యాదవ్, డాక్టర్ ఆవుల రాంచందర్, గొంటి శంకర్ యాదవ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

# గణేశ నిమజ్జనోత్సవాలకు పకడ్బందీగా ట్రాఫిక్ ఏర్పాట్లు

### రేపు ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల పాటు ప్రధాన ఊరేగింపు మార్గాలలో సాధారణ వాహనాలపై నిషేధం
### ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతాలలో ఆంక్షలు



**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జంట నగరాలలో శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనోత్సవాలకు ట్రాఫిక్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిమజ్జనం రోజున నగరంలోని అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నందున ప్రజలు పోలీసులకు సహకరించా లని సిటీ కొత్వా సజ్జన్నర్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతీయేటా జరిగే విధంగా ఈసారి కూడా బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు 19 కిలోమీటర్ల దూరం ప్రధాన ఊరేగింపు వుండగా, ఈ ఊరేగింపు మార్గంలో వున్న చాంద్రాయణగుట్ట, అలియా బాద్, నాగుల్‌చింత, చార్మినార్, మదినా, అఫ్జల్‌గంజ్, మోజం జాహీ మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టి, అంబేద్కర్ విగ్రహం చౌరస్తాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు నిమజ్జనం సమయంలో అమలు చేయనున్నారు. ఇదే సమయంలో సికింద్రాబాద్ నుంచి వచ్చే మరో ఊరేగింపు కర్బలా మైదాన్, కవాడిగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ చౌరస్తా, నారాయణగూడ చౌరస్తా, హిమాయత్ నగర్ చౌరస్తా, లిబర్టి మీదుగా ట్యాంక్‌బండ్ వర కు వుండనుంది. దీంతో పాటు పూర్వపు తూర్పు మండలం నుంచి వచ్చే ఊరేగింపు రామాంతపూర్, శివం రోడ్, ఒయు మార్గం, శంకరమఠ్, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పురా, నారాయణగూడ, లిబర్టి మీదుగా ట్యాంక్‌బండ్‌కు వరకు రానుంది. సైదాబాద్, దిల్‌సుక్‌నగర్‌ల నుంచి వచ్చే మరో ఊరేగింపు నల్లగొండ చౌరస్తా, అంబర్‌పేట్, మూసారంబాగ్, అంబర్‌పేట్‌ల మీదుగా నారాయణగూడ వద్ద ప్రధాన ఊరేగింపులో కలవనుం ది. పూర్వపు పశ్చిమ మండల పరిధిలోని టోలిచౌకి నుంచి వచ్చే ఇంకో ఊరేగింపు రేతిబౌలి, మెహదీపట్నం, మాసాబ్‌ట్యాంక్, లక్డికాపూల్ మీదుగా సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరనుంది. ఎర్రగడ్డ నుంచి వచ్చే మరో ఊరేగింపు పంజాగుట్ట, ఖైరతాబాద్ , లక్డికాపూల్, సచివాలయం మీదుగా ఎన్టీఆర్ మార్గ్ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరనుంది. మంగల్‌హాట్, సీతారాంబాగ్, గోషామహల్ నుం చి వచ్చే ఇంకో ఊరేగింపు మోజంజాహీ మార్కెట్ వద్ద పధాన ఊరేగింపులో కలవనుంది. కాగా నిమజ్జనం తిలకించేందుకు వచ్చే వారు అత్యవ సర సమయాల్లో హెల్ప్‌లైన్ కోసం ఏర్పాటు చేసిన 040-27852482, 8712660600, 9010203626 నంబర్లకు ఫోన్ చేయాలని కొతా ్వల్ సజ్జన్నర్ కోరారు. నిమజ్జనం రోజున సందర్శకులు సొంత వాహనాల్లో కాకుండా మెట్రో రైలులో ప్రయాణించడం మంచిదని ఆయన సూచించారు. నిమజ్జనం కోసం పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులను నియమించగా వీరంతా 24 గంటల పాటు విధుల్లో వుండేలా ఏర్పాట్లు చేశా రు. ఇక నిమజ్జనం రోజున ఊరేగింపు జరిగే మార్గాలలో ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం పది గంటల వరకు సాధారణ వాహనాలకు అనుమతి వుండదు. ఇదే సమయంలో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి శనివారం సాయంత్రం వరకు ఆంక్షలు అమలు చేయనున్నారు. పరిస్థితులను బట్టి ఈ ఆంక్షలను ముందుగానే తొలగించడం లేదా పొడి గించడం చేస్తారు. ఇక శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేవారు, అక్కడి నుంచి వచ్చే వారు ట్యాంక్‌బండ్ పరిసరాలలోని మార్గాలకు బదులు వే రే మార్గాలను ఎంచుకోవాలని కొత్వాల్ కోరారు. దీంతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారు అక్కడి నుంచి వచ్చే వారు నిమజ్జన ఊరే గింపు మార్గాలు కాకుండా వేరే మార్గాలలో వెళ్లాలని కమిషనర్ కోరారు. కాగా ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం కోసం వచ్చే వాహనాలు నిమజ్జనం ముగిసిన తరువాత నెక్లెస్ రోడ్, ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, ఖైరతాబాద్ చౌరస్తా, తెలుగుతల్లి విగ్రహం, గోషాల, బండ మైసమ్మ, ఇందిరా పార్క్ ప్రాంతాల మీదుగా వెళ్లాల్సి వుంటుంది.

**ట్రాఫిక్ మళ్లింపు వివరాలు:** ఇక నిమజ్జనం సందర్భంగా పాతబస్తీ పరిధిలో కేశవగిరి, ఓల్డ్ కర్నూల్ రోడ్, ఇంజన్‌బౌలి, సిటీకాలేజి వరకు వాహనాలు అనుమతిస్తారు. పూర్వపు తూర్పు మండల పరిధిలో చంచల్‌గూడ చౌరస్తా, మూసారాంబాగ్ చౌరస్తా, తోప్‌ఖానా చౌరస్తా, ఏఆర్ పెట్రోల్ బంక్, ఖైరతాబాద్ జోన్ పరిధిలో చాపెల్ రోడ్, స్కైలైన్ రోడ్, కవాడిగూడ మార్గంలో గల పలు ప్రాంతాలలో ఆంక్షలు వుంటాయి. ఉత్తర మండల పరిధిలో నెక్లె స్ రోడ్‌లో వాహనాలను పూర్తిగా అనుమతించరు. అంతర్ రాష్ట్ర వాహనాలను నిమజ్జనం రోజున 30గంటల పాటు జంట నగరాలలో అనుమతించరు. ఈ వాహనాలు అ వుటర్ రింగ్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాల్సి వుంటుంది. అంత రాష్ట్ర, సిటీఆర్టీసీ బస్సులుతమకు కేటా యించిన ప్రాంతాల నుంచే రాకపోకలుసాగించాల్సి వుంటుంది. ప్రైవేటు బస్సులుకూడా ఈనిబంధనలనుపాటించాల్సి వుంటుంది.

**పార్కింగ్ కేంద్రాల వివరాలు...ఆర్టీసీ బస్సుల మార్గాలు**

కాగా నిమజ్జనం కోసం వచ్చే సందర్శకులు తమ వాహనాలను ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్, ఎంఎంటిఎస్ స్టేషన్, ఎన్టీఆర్ స్టేడియంలో యర్ ట్యాంక్‌బండ్ రోడ్, పబ్లిక్ గార్డెన్స్, రంగారెడ్డి జిల్లా జెడ్‌పి కార్యాలయం, నిజాంకాలేజి, బుద్ధ భవన్, గోసేవా సదన్ వద్ద నిలి పేందుకు అను మతిస్తారు. కాగా ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనం కోసం వచ్చే వాహనాలు తిరుగు ప్రయాణంలో డిబిఆర్ మిల్స్, కవాడిగూడ, ముషీరాబాద్, విద్యా నగర్‌ల మీదుగా వెళ్లాల్సి వుంటుంది.

**ఆయా ప్రాంతాలలో నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల వివరాలు:** సంజీవయ్య పార్క్, జలవిహార్, పివి నరసింహారావు మార్గ్, రాజన్న బావిల వద్ద బేబీ పాండ్స్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎన్టీఆర్ స్టేడి యం, ఐ మాక్స్ థియేట ర్, మారేడ్‌పల్లి, చిలకలగూడల వద్ద గలబల్దియా గ్రౌండ్స్, అంబర్‌పేట్ ప్లే గ్రౌండ్స్, ఆజాద్‌నగర్, మూసారాంబాగ్ కృష్ణ తులసినగర్ పార్క్, కుల్సుంపురా, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లలో పోర్టబుల్ రబ్బర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు సైదా బాద్‌లోని ఏకలవ్య నగర్, గౌలిపురాలోని బతుకమ్మబావి, పివి నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ హైవే కింది భాగంలో పిల్లర్ నంబర్ 54 వద్ద, చిం తల్‌బస్తీ, గుడిమల్కాపూర్ లోని అన్నపూర్ణ దేవాలయం, ధోబీఘాట్. ఎన్టీఆర్ స్టేడియం, అంబర్‌పేట్ డంపింగ్ యార్డ్, చిలకలగూడ మున్సిప ల్ స్టేడియంలలో ఎగ్జావేషన్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వీటిని కూడా ఆయా ప్రాంతాల ప్రజలు నిమజ్జనం కోసం వాడుకోవాలని పో లీసులు, బల్దియా అధికారులు కోరారు.

## కేబినెట్ పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్ట్
### ఢిల్లీలో ప్రధాని మోడీ అధ్యక్షతన ప్రారంభమైన చింతన్ శిబిర్, వికసిత్ భారత్ లక్ష్యాలపై చర్చలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిమండలి రెండు రోజుల చింతన్ శిబిర్ సమావేశం బుధవారం నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రారంభం అయింది. ఢిల్లీలోని సేవాతీర్థ్‌లో రెండురోజులు జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖలు, మంత్రిత్వ శాఖల్లో కొనసాగుతున్న పనుల పురోగతితో పాటు వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర చర్చల అజెండా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. దీనితోపాటు మంత్రివర్గ శాఖల పనితీరు, మంత్రులపనితీరుపైనా ప్రోగ్రెస్ రిపోర్టుపై సమీక్ష చేయాలని ప్రధానిమోడీ నిర్ణయించారు. దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కొనసాగుతున్న కార్యక్రమాలను సమీక్షించడం ఈ చింతన్ శిబిర్‌లో ప్రధాన అంశంగా ఉండనుంది. వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాల్లో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు తదుపరి దశలో చేపట్టాల్సిన సంస్కరణలు, ప్రాధాన్యతలు, కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. వికసిత్ భారత్ కార్యాచరణ 2021 నుంచే కొనసాగుతోంది. ఇందులో భాగంగా విజన్ 2047 డాక్యుమెంట్‌తో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు 10 సెక్టోరల్ గ్రూప్స్ ఆఫ్ సెక్రటరీస్‌ను ఏర్పాటు చేశారు. వివిధ వర్గాల భాగస్వాములతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు కూడా నిర్వహించారు. ఇప్పటివరకు వికసిత్ భారత్ 2047కు సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రిమండలి ఎనిమిది ప్రదర్శనలు, చర్చలు నిర్వహించింది.



## విశాఖపట్నంలో హిల్టన్ గార్డెన్ ఇన్ ఏర్పాటుకు ఒప్పందం
### 360 గదులతో హిల్టన్ గార్డెన్ ఇన్ విశాఖపట్నం

**హైదరాబాద్,సెప్టెంబరు23,ప్రభాతవార్త:** ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ సంస్థ హిల్టన్, కపిల్ గ్రూప్‌నకు చెందిన బివిఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంగా హిల్టన్ గార్డెన్ ఇన్ విశాఖపట్నం యెండాడ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ హోటల్ 2032లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో హిల్టన్ తొలిసారిగా విశాఖపట్నంలో అడుగుపెట్టనుంది. తూర్పు తీరపు ఆభరణంగా పేరుగాంచిన విశాఖపట్నం వ్యాపార, పర్యాటక రంగాలకు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా నిలుస్తోంది. వ్యాపార, విశ్రాంతి ప్రయాణాలు కలిసిపోతున్న ఈ మార్కెట్లో మారుతున్న ప్రయాణికుల అవసరాలకు హిల్టన్ గార్డెన్ ఇన్ సేవలు అనుకూలంగా ఉండనున్నాయి. యెండాడలో కపిల్ గ్రూప్ కంపెనీ అభివృద్ధి చేస్తున్న ప్రతిష్ఠాత్మక 10 ఎకరాల వరల్డ్ ట్రేడ్ సెంటర్ మిశ్రమ వినియోగ ప్రాజెక్టులో ఈ హోటల్ భాగంగా ఉంటుంది. వ్యాపారం, సహకారం, అనుసంధానానికి కొత్త గమ్యస్థానంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు.

హిల్టన్ గార్డెన్ ఇన్ అందించే ప్రత్యేకమైన బ్రైట్వార్మ్డ్ హాస్పిటాలిటీ, స్నేహపూర్వక సేవలు, ఆలోచనాత్మక సౌకర్యాలు, అవసరాలకు అనుగుణంగా మార్చుకోగల ప్రదేశాలు ఆంధ్రప్రదేశ్లోని ప్రముఖ వాణిజ్య కేంద్రాల్లో ఒకటైన విశాఖపట్నానికి అందుబాటులోకి రానున్నాయి. భారతదేశ అవసరాలకు అనుగుణంగా హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్లో పలు మార్పులు చేశారు. విస్తృతమైన సమావేశాలు, ఈవెంట్ల కోసం అదనపు స్థలం, మరిన్ని ఆహార, పానీయాల సదుపాయాలు, గదుల్లో రూమ్ సర్వీస్ వంటి సేవలను అందించనున్నారు. హిల్టన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఏషియా రీజినల్ హెడ్ జుబిన్ సక్సేనా మాట్లాడుతూ విశాఖపట్నంలో మా ప్రవేశం హిల్టన్ విస్తరణ ప్రయాణంలో ఒక ముఖ్యమైన అడుగు. ఆంధ్రప్రదేశ్ మా వ్యూహంలో కీలకమైన రాష్ట్రం. రాష్ట్రవ్యాప్తంగా హిల్టన్ గార్డెన్ ఇన్ హోటళ్ల ఏర్పాటుకు మా ప్రణాళికలు కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో మా తొలి హోటల్ ద్వారా రాష్ట్రంలోని ముఖ్యమైన వాణిజ్య కేంద్రాల్లో మా ఉనికి మరింత బలపడుతుంది. హాస్పిటాలిటీ గమ్యస్థానంగా విశాఖపట్నం దీర్ఘకాలిక అవకాశాలపై మాకు ఉన్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తుందని తెలిపారు.

## సిఇసి, ఎన్నికల కమిషనర్ నియామకాలపై భిన్నతీర్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మా సనానికి బదిలీ చేయాలా లేదా అనే అంశంపై ఇద్దరు సభ్యుల ధర్మాస నంలో ఏకాభిప్రాయం కుదరలేదు. 2023లో తీసుకొచ్చిన చట్టంలోని కొన్ని నిబంధనలను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ముఖ్యంగా సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడాన్ని పిటిషనర్లు ప్రశ్నించారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో సీజేఐ పాత్ర ఉండగా 2023 చట్టం ప్రకారం ఎంపిక ప్యానెల్‌లో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండే విధానం వచ్చింది. ఈ మార్పు రాజ్యాంగబద్ధతపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఈ పిటిషన్లను ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ అంశాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందా అనే విషయంలో న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించారు. మరోవైపు జస్టిస్ ఎస్‌సీ శర్మ మాత్రం ఈ అంశాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి రిఫర్ చేయాలని అభిప్రాయపడ్డారు. ఇలా ఇద్దరూ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో తీవ్ర సందిగ్ధం ఏర్పడింది. ఇద్దరు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో ఇది భిన్నస్వరాల తీర్పుగా మారింది. దీంతో పిటిషన్లపై తుది నిర్ణయం వెంటనే వెలువడదు. తదుపరి న్యాయపరమైన ప్రక్రియలో భాగంగా ఈ భిన్నాభిప్రాయాలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ కేసులో ప్రధానంగా 2023 చట్టంలోని సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామక విధానం రాజ్యాంగబద్ధమేనా ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తొలగించడం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఉందా వంటి అంశాలు పరిశీలనకు రానున్నాయి.

## భారత్ ఆర్థికవృద్ధి 7శాతానికి పైమాటే
### వృద్ధిరేటు అంచనాలను పెంచిన గ్లోబల్‌రేటింగ్ సంస్థలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23:** భారత్ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ సంస్థలు మరింత సానుకూలంగా మారుతున్నాయి. ఎస్పీ, ఫిచ్ రేటింగ్స్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ , ఆర్థిక సహకారం మరియు అభివృద్ధి సంస్థఒఇసిడిలు బుధవారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాలను సుమారు 7 శాతానికి పెంచాయి. జూన్ త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక కార్యకలాపాలు, దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నాయి.

## రెండు శతాబ్దాలుగా ఏ దేశంపైనా ఇరాన్ దాడి చేయలేదు
### ఐక్యరాజ్యసమితి ప్రసంగంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

**న్యూయార్కు, సెప్టెంబరు 23:** గడచిన రెండు శతాబ్దాలుగా ఇరాన్ ఏ దేశంపైనా, ఏ భూభాగంపైనా దాడి చేయలేదని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ అన్నారు. ఇతర దేశాలపై దురాక్రమణకు పాల్పడటం తమ విధానం కాదని, అవసరమైన సందర్భాల్లో ఆత్మరక్షణ కోసమే చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధులలో బుధవారం ప్రసంగించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే మమ్మల్ని మేము రక్షించుకునేందుకు ఎల్లప్పుడూ దృఢంగా నిలిచామని పెజెష్కియాన్ పేర్కొన్నారు

# సూపర్ ఎల్ నినో..యమడేంజర్

### వాతావరణంలో పెను మార్పులు తథ్యం
### రాబోయే ఆరు నెలల్లో 4.51లక్షల మరణాలు
### భారత్‌లో 15,800 మరణాల అంచనా
### క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తాజా అధ్యయనం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** భూమి మునుపెన్నడూ లేని విధంగా నెమ్మదిగా ఒక ప్రాణాంతక వేడి ఉచ్చులోకి జారుకుంటోంది. ఈ సంక్షోభం గురించి క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ ఒక దిగ్భ్రాంతికరమైన సమాచారాన్ని విడుదల చేసింది. ప్రస్తుత ఎల్‌నినో బలపడే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచాన్ని మరింత వేడెక్కిస్తున్న వేళ.. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఈ సూపర్ ఎల్ నినో వాతావరణ మార్పు, రాబోయే నెలల్లో ప్రపంచాన్ని మండే కొలిమిగా మార్చబోతోంది. అధిక ఉష్ణోగ్రతలు బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. బలమైన ఎల్‌నినో కారణంగా రాబోయే 6 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల అదనపు వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అధ్యయనం అంచనా వేసింది. ఇందులో భారత్‌లో సుమారు 15,800 అదనపు వేడి సంబంధిత మరణాలు ఉండొచ్చని పేర్కొంది. ఇవి ఇప్పటికే నమోదైన మరణాలు కాకుండా ఉష్ణోగ్రతల అంచనాలు, గత మరణాల గణాంకాల ఆధారంగా రూపొందించినట్లు క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ పేర్కొంది.

**1.2 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు: క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్:** అధ్యయనం ప్రకారం సెప్టెంబరు 2026 నుంచి ఫిబ్రవరి 2027 మధ్య ప్రపంచ భూభాగ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయితో పోలిస్తే సగటున 1.2 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. సాధారణ సంవత్సరంతో పోలిస్తే అత్యంత వేడి రోజులు కూడా సుమారు 44శాతం ఎక్కువగా ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు. ఈ పరిస్థితులు భవిష్యత్తులో వాతావరణ మార్పుల కారణంగా ఎదురయ్యే అధిక ఉష్ణోగ్రతలకు ఒక ముందస్తు సంకేతంలా ఉండొచ్చని అధ్యయనం పేర్కొంది.

**భారత్‌పైనా తీవ్ర ప్రభావం:** భారత్‌లో అంచనా వేసిన 15,800 అదనపు మరణాల్లో దాదాపు సగం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యే సంభవించే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది. ఆ తర్వాత భారత్‌లో వేసవి కాలం ప్రారంభమయ్యే కొద్దీ వేడి ప్రభావం కొనసాగవచ్చని పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, ఇతర బల హీన వర్గాలపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఏ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం?:** అధ్యయనం ప్రకారం, తక్కువ కార్బన్ ఉద్గారాలు కలిగిన అభివృద్ధి చెందుతున్న, వెనుక బడిన దేశాలు ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల ఎక్కువగా నష్టపోతాయి. ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతంలో సుమారు 66,800 అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉంది.

ఇందులో నైజీరియాలోనే 31,400, సూడాన్‌లో 17,500, నైజర్‌లో 10,000, చాద్‌లో 8,000గా అంచనా వేశారు. దక్షి ణ, ఆగ్నేయాసియాలోనూ గణనీయమైన ప్రభావం ఉంటుందని అంచనా. ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా లో కలిపి 19,400, ఇండోనేషియాలో 19,300, బ్రెజిల్‌లో 13,300 అదనపు వేడి సంబంధిత మరణాలు ఉండొచ్చని అధ్యయనం పేర్కొంది.

**ముందస్తు చర్యలు తీసుకోవాలి:** క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్, 1996 నుండి 2025 వరకు ఉన్న 30యేళ్ల సాధారణ సగటుతో పోల్చి ఈ హెచ్చరికను శాస్త్రీయంగా లెక్కించింది. ఈ నివేదిక ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు తక్షణ హెచ్చరిక గంటను మోగిస్తోంది. ప్రభుత్వాలు ప్రజలకు ముందుగానే వడదెబ్బ హెచ్చరికలు జారీ చేయాలి. వేడి హెచ్చరిక వ్యవస్థలు, శీతలీకరణ కేంద్రాలు, తాగునీటి సౌకర్యాలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు రక్షణ, బలహీన వర్గాలకు ఆరోగ్య అవగాహన, ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యల ద్వారా మరణాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని అధ్యయనం సూచించింది. ప్రభుత్వాలు ఇప్పుడు యుద్ధ తరహా చర్యలు తీసుకోకపోతే, ఈ భయంకరమైన వడగాలులు లక్షలాది మానవ ప్రాణాలను నిశ్శబ్దంగా బలి తీసుకుంటాయి.

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు భవిష్యత్తులో వాతావరణ మార్పుల వల్ల సాధారణమయ్యే అధిక ఉష్ణోగ్రతలకు ఒక ముందస్తు సంకేతంలా పనిచేస్తున్నాయి. అందువల్ల తక్షణ అత్యవసర చర్యలతో పాటు దీర్ఘకాలికంగా వాతావరణ అనుకూలత, ఆరోగ్య వ్యవస్థలు, వేడి నుంచి రక్షణ కోసం పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందని అధ్యయనం సూచిస్తోంది.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

## తెలంగాణను ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లు

- నీటి వినియోగం తెలియని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం - చంద్రబాబుకు గురుదక్షిణగా కృష్ణా గోదావరి జలాలు

- నీటి వినియోగంపై శ్వేత పత్రం విడుదల చేయాలి : హరీశ్‌రావు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** గోదావరి కృష్ణా నదులలో సమృద్ధిగా నీరున్న ఎత్తిపోయే లేని దౌర్భాగ్యం కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఒకపక్క రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు ఆయన సొంత నియోజకవర్గమైన కుప్పం వరకు 700 కిలోమీటర్లు కృష్ణ జలాలను పెన్నా బేసిన్ వరకు పారిస్తుంటే పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా పాలమూరుకే తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రేవంత్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణలో కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని, కృష్ణా గోదావరి నదులలో పుష్కలంగా నీరున్న ఎత్తిపోయలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన దుయ్యబట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పార్టీ నీటి వినియోగంలో పూర్తిగా విఫలమైందని, తీవ్రస్థాయిలో రేవంత్ సర్కార్ అసమర్థతను దుయ్యబట్టారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అసెంబ్లీ సాక్షి గా కృష్ణా గోదావరి నదుల ద్వారా 288 టీఎంసీలను ఎత్తిపోసినట్లు అబద్ధాలు చెప్పారని హరీష్ రావు మండిపడ్డారు. ఇంత మేరకు నీటిని ఎత్తిపోస్తే క్రాప్ హాలిడేలు ఎందుకు ఇస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు 4 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థం ఉన్న కేవలం మూడు మోటార్లను నడుపుతూ 2400 క్యూసెక్కులను మాత్రమే ఎత్తిపోస్తున్నట్లు లెక్కలు చెబుతున్నారని, ఈ లెక్కలు తప్పులతడక అని హరీష్ రావు మండిపడ్డారు. రోజు ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఒకటి లేదా రెండు మోటర్లు నడిపి కేవలం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే ప్రతిరోజు ఎత్తిపోస్తూ తప్పుడు లెక్కలు అందిస్తున్నారని ఆయన ఆరోపించారు.

కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్లను నిరంతరాయంగా నడిపితేనే తాత్కాలిక వాటా కింద 34 శాతం నీటిని వినియోగించుకునే అవకాశాలు ఉంటాయని కేవలం 800 క్యూసెక్కులను ఎత్తిపోస్తే తీవ్రంగా నష్టపోయేది తెలంగాణ రాష్ట్రం అన్నారు.

కృష్ణా జలాలను ఆంధ్ర సమృద్ధిగా వినియోగించు కుంటూ వందల కిలోమీటర్ల దూరం వరకు నీటిని తరలిస్తుంటే మరోపక్క తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని సీఎం రేవంత్ రెడ్డి క్రాప్ హాలిడేల పేరుతో తెలంగాణ రైతులను నిండుగా ముంచుతున్నారని ఆరోపించారు.

నీటి నిర్వహణ తెలవని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన విమర్శించారు. ఒకపక్క ఆంధ్ర సీఎం నీటిని సమృద్ధిగా వినియోగించుకుంటూ రిజర్వాయర్లలో నీటిని నింపుతూ ముందుచూపుతో నడుస్తుంటే చేతకాక.. చేవలేక చవట సీఎం రేవంత్ రెడ్డి పంటలను ఎండబెట్టి చోద్యం చూస్తున్నాడని విమర్శించారు.

## హియరింగ్ నోటీసుల దాఖలు వేగవంతం చేయాలి

### ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి


బిఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, జెడ్‌సి వికాస్‌మహాతో

**ఎల్.బి..నగర్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** హియరింగ్ నోటీసుల దాఖలు ప్రక్రియను వేగ వంతం చేసే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. నాగోల్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ కక్షినగర్ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) కేంద్రాలను బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. ఓటర్ల నమోదు, మార్పు లు, చేర్పుల ప్రక్రియ ఎస్‌ఐఆర్ పురో గతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికులతో కూడా ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓల పనితీరు, సేవల గురించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వేగవంతం చేసే విధంగా అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ఎన్యు మరేషన్, హియరింగ్ నోటీసుల ప్రక్రియ ఆధారాలను పెంచుతూ విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు,

కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో సంప్ర దించి ఓటర్ల వివరాల సమగ్ర పరిశీలన నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు.

నోటీసులు అందుకున్న పౌరులు వెంటనే స్పందించి సంబంధిత బిఎల్‌ఓలను సంప్రదించి తగిన ధ్రువీ కరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.

## ఫీజు బకాయిలు రూ.8,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య - విద్యానగర్ నుంచి విద్యార్థుల భారీ ప్రదర్శన

**హైదరాబాద్ సెప్టెంబర్ 23 ( ప్రభాతవార్త )** రాష్ట్రంలోని 14 లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,500 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. విద్యానగర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ళ సతీష్ నాయకత్వం వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత పద్ధతిలోనే పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కోర్సులు పూర్తయినా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, దీంతో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు పథకంపై నెలకొన్న గందరగోళం కారణంగా 30 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌కు హాజరుకాలేదని తెలిపారు. పీజీ అడ్మిషన్లలో 50 సీట్లు, డిగ్రీలో 70 వేల సీట్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో అవకతవకల నెపంతో బడ్జెట్ నిలిపివేసారని,


విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలనీ ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభసభ్యుడు ఆర్. కృష్ణయ్య

అయితే ఎలాంటి అవకతవకలు లేని ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాం కాలేజ్, కోటి మహిళా కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో పేద వర్గాలు, ముఖ్యంగా విద్యార్థినులు చదువుకు దూరమవుతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో 600 కళాశాలలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చాక బీసీలకు కొత్త పథకాలేవీ ప్రారంభించకపోగా, ఉన్న శాఖను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. సీఎం సమస్యను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోకుండా, పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రాజేందర్, నాయకులు నరేష్ గౌడ్, నిఖిల్ పటేల్, కాదరి శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## దక్షిణాఫ్రికాలో ఓ ఇంటిపై కాల్పులు.. 11 మంది మృతి

**దర్బన్, సెప్టెంబరు 23:** దక్షిణాఫ్రికాలోని క్వామఖుతా టౌన్‌షిప్‌లో అర్ధరాత్రి జరిగిన కాల్పుల ఘటనలో 11 మంది మృతి చెందారు. మృతుల్లో గర్భిణిగా భావిస్తున్న ఓ మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ఈ ఘటనలో మరో ముగ్గురు గాయపడ్డారు. దేశ తూర్పు తీరంలోని దర్బన్ నగరానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ ఇంట్లో పార్టీ కోసం పలువురు సమావేశమైన సమయంలో ముగ్గురు సాయుధ వ్యక్తులు లోపలికి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు.

కాల్పుల్లో 10 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన ముగ్గురి పరిస్థితిపై అధికారులు వెంటనే వివరాలు వెల్లడించలేదు. నిందితుల కోసం గాలింపుకాల్పులకు పాల్పడిన ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## గాంధీ వైద్యుల ప్రతిభ - ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాలింత

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** ప్రసవం జరిగిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ బాలింతకు గాంధీ ఆసుపత్రి క్రిటికల్ కేర్ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. 27 ఏళ్ల సాధుపల్లి ప్రవల్లిక అనే మహిళకు సరైన సమయంలో అత్యున్నత వైద్యం అందించి ప్రాణాపాయం నుంచి రక్షి ంచారు. గజ్వేల్‌కు చెందిన ప్రవల్లిక డెలివరీ అయిన మరుసటి రోజే తీవ్రమైన శ్వాసకోశ సమస్యకు గురయ్యారు. పెరిపార్టమ్ కార్డియోమయోపతి (పీపీసీఎం) కారణంగా ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో (పల్మనరీ ఎడెమా) గుండె పనితీరు 35 నుంచి 40 శాతానికి పడిపోయింది. శరీరంలో ఆక్సిజన్ స్థాయి ప్రమాదకరంగా 80 శాతానికి తగ్గడంతో స్థానిక వైద్యులు అత్యవసరంగా గొట్టం ద్వారా శ్వాస అందిస్తూ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 19న గాంధీ ఆసుపత్రిలోని ఎంఐసీయూలో చేరిన ప్రవల్లికకు క్రిటికల్ కేర్ విభాగ అధిపతి డాక్టర్ కిరణ్ మాధాల పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశ్రీ, డీఎం వైద్యులు షాహిన్, ప్రసన్న, రవీంద్ర, ఇతర విద్యార్థుల బృందం వెంటనే అత్యాధునిక వెంటిలేటర్ సపోర్ట్, గుండె పనితీరును మెరుగుపరిచే మందులు, ప్రత్యేక ఇంజెక్షన్లతో చికిత్స ప్రారంభించింది. వైద్యుల నిరంతర శ్రమ ఫలితంగా మరుసటి రోజే ఆమె శ్వాస మెరుగుపడటంతో వెంటిలేటర్‌ను తొలగించి సీపాప్ (సీపీఏపీ) సాయం అందించారు. క్రమంగా గుండె, మూత్రపిండాల పనితీరు కుదుటపడటంతో ఈ నెల 22 నాటికి కృత్రిమ శ్వాసను పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం ఆమె సాధారణ గాలితోనే 98 నుంచి 99 శాతం ఆక్సిజన్ స్థాయితో పూర్తి స్పృహతో కోలుకుంటున్నారు. ప్రస్తుతం ద్రవాహారం తీసుకుంటూ, పల్మనరీ రీహాబిలిటేషన్ చికిత్స పొందుతున్నారని, త్వరలోనే ఆమె తన బిడ్డను ఒడిలోకి చేర్చుకోనున్నారని వైద్యులు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ పటిష్టమైన రెఫరల్ నెట్‌వర్క్ వల్లనే ప్రాణాపాయంలో ఉన్న రోగి సకాలంలో గజ్వేల్ నుంచి సిద్దిపేట మీదుగా గాంధీ ఆసుపత్రికి చేరి బతికి బయటపడటం సాధ్యమైంది. ఈ విజయవంతమైన వైద్య ప్రక్రియలో పూర్తి సహాయ సహకారాలు అందించిన డీఎంఈ డాక్టర్ వాణి, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, సీఎస్/ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణతో పాటు గైనకాలజీ, కార్డియాలజీ, అనస్థీషియా, పల్మనరీ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి క్రిటికల్ కేర్ విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.


బాధితురాలితో వైద్యులు

## గణనాథుడిపై హెలికాప్టర్‌తో పూలవర్షం

### బేరంపేటలో వినూత్నంగా వీడ్కోలు
### కనువిందు చేసిన నిమజ్జన వేడుకలు



**దుండిగల్, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త** బౌరంపేట్‌లో గణనాథుడిపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించిన ఘట్టం నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్ర మాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిమజ్జ నోత్సవం సందర్భంగా హెలికాప్టర్ ఆకాశంలోకి ఎగిరి గణనాథుడి మండపం చుట్టూ చక్కర్లు కొడుతూ పూలవర్షం కురిపించడంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా పండుగ శోభను సంతరించుకుంది. ఆకాశం నుంచి పూలు జల్లులా గణనాథుడిపై కురుస్తున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించిన దృశ్యాలను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఉత్సాహపరిచారు. హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురుస్తున్న సమయంలో భక్తులు "గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహారాజ్‌కి జై" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## నకిలీ వైద్యుడి అరెస్ట్

### పక్కా సమాచారంతో పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 23, ప్రభాతవార్త :** గోల్కొండ, మొహల్లా గంజ్, ఎం.ఎస్.కె ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న "హిక్మా సెహత్ కేర్ సెంటర్" పై దాడి చేసి, నకిలీ డాక్టర్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హిక్మా సహెత్ కేర్ సెంటర్ ను గోల్కొండ కుమర్ వాడి ప్రాంతానికి చెందిన మహమ్మద్ అద్నాన్ (23) అనే వ్యక్తి నడిపిస్తున్నాడు. కేవలం ఇంటర్మీడియట్ సిఈసీ మాత్రమే చదివాడు. తన తల్లి సబా ఖాన్ అలియాస్ ముహమ్మదీ బేగం, సోదరుడు మహమ్మద్ ఫైజాన్ సహాయంతో ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, వైద్య అర్హత లేకుండా ఈ సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. వీరు తమను తాము అర్హత కలిగిన వైద్యులుగా నటిస్తూ, సులభంగా డబ్బు సంపాదించడం కోసం అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తూ మోసగిస్తున్నారు. ఇతడు తన వైద్య సేవలకు సంబంధించి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లతో పాటు ఖిసచ్ న్యూస్‌ఖి లో ప్రచార కథనాల ద్వారా ప్రచారం చేసుకున్నాడు. ఇతని వద్ద నుండి లేబుల్ లేని భారీ పరిమాణంలో ఔషధాలను, మందులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. సబాఖాన్ అలియాస్ ముహమ్మదీ బేగంతో పాటు మహమ్మద్ ఫైజాన్ పరారీలో ఉన్నారు. అయితే లేబుల్ లేని, మార్కర్ పెన్‌తో రాసి ఉన్న మందులను స్వాధీనం చేసుకున్నారు. తల్బీనా 20 ప్యాకెట్లు, ఎస్.ఆర్ 15 బాటిల్, ఈ.జి.పి బాటిళ్లు 13, ఎమ్.ఎఫ్ 16 బాటిల్, కె.కె 15 బాటిల్, డబ్ల్యూ.డి 12 బాటిళ్లు, బి.ఆర్ 10 బాటిల్, హెచ్.పి, సి.సి 15 బాటిల్, వి+వి 14 బాటిల్, ఎ.ఎస్.టి 14 బాటిల్, జి.ఆర్ 11 బాటిల్, పిజెడ్ 10 బాటిల్, హెచ్‌హెచ్ 17 బాటిల్ ఖిహిక్మా హెల్త్ కేర్‌ఖి పేరుతో ఉన్న ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, ఖిడాక్టర్ అద్నాన్ అఫీషియల్‌ఖి ఫేస్‌బుక్ పేజీ ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు 5 స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.మహేష్ పర్యవేక్షణలో, గోల్కొండ జోన్ టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ జి. విజయానంద్, గోల్కొండ పోలీసులు వారి సిబ్బందితో కలిసి ఈ అరెస్ట్ చేసారు.

## కొత్తగూడెం జిల్లాలో గంజాయి స్మగ్లర్ల ఆస్తులు జప్తు చేసిన ఈగల్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** డ్రగ్స్ స్మగ్లర్ల ఆస్తులను వరుసగా జప్తు చేస్తున్న ఈగల్ అధికారులు తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి స్మగ్లర్లకు చెందిన 25 లక్షల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెంలోని ఎడుల్ల బయ్యారం పోలీసు స్టేషన్‌లో 2021లో నమోదైన గంజాయి స్మగ్లింగ్ కేసులో 50 కిలోల గంజాయితో పాటు మూడు కార్లు పట్టుబడ్డాయి. ఈ కేసులో ఆరుగురు ని ందితులు పట్టుబడా కొందరు పారిపోయారు. దీనికి సంబంధించిన కేసులో కొందరికి శిక్షలు పడ్డాయి. పట్టుబడ్డ నిందితులు అనేకమార్లు డ్రగ్స్ కేసుల్లో దొరికిపోవడంతో వీరిపై పిడి నమోదు చేయడంతో పాటు వీరి ఆస్తులను జప్తు చేసేందుకు నిర్ణయించారు. దీనిపై చెన్నైలోని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులకు లేఖ రాసిన ఈగల్ పోలీసులు అక్కడి నుంచి అనుమతి రాగానే సెక్షన్ 68 (ఎఫ్) కింద మంగళవారం నాడు ని ందితుల ఆస్తులను జప్తు చేశారు. జప్తు చేసిన ఆస్తుల్లో మూడు కార్లు, ఒక ద్విచక్ర వాహనం వుంది. ఈ వాహనాలు గంజాయి అమ్మకాల ద్వా రా నే కొన్నట్లు ఈగల్ పోలీసుల విచారణలో తేలిందని డైరెక్టర్ సందీప్ శాండిల్యా తెలిపారు. గంజాయి సహా మాదకద్ర వ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా వెంటనే పోలీసులకు లేదా 1908కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## విద్యుత్ యాజమాన్యంతో సానుకూల చర్చలు

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జెఎసి ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సమస్యలపై సిఎండిలతో సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ల ,పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలు, డిమాండ్లపై యాజమాన్యంతో చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ శివాజీ, కోచైర్మన్ పి.అంజయ్య తెలిపారు. ఈమేరకు బుధవారం టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ విపాటిల్, ఎన్‌పిడిసిఎల్ సిఎండీ వరుణ్‌రెడ్డి, టిజిట్రాన్స్‌కో సిఎండీ కృష్ణభాస్కర్, జెన్‌కో సిఎండీ హరీష్‌లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా సిఎండీల ముందు ప్రస్తావించిన అంశాలు వేతన సవరణకు సంబంధించి కమిటీ ఏర్పాటు ప్రక్రియ, ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులకు లభిస్తున్న హక్కులు, ప్రయోజనాలు కల్పించే అంశం సర్వీస్ రూల్స్,ఉద్యోగులకు రిటైర్మెంట్ అనంతర మెడికల్ బెనిఫిట్ ఈపిఎఫ్ నుంచి జిపిఎఫ్ మార్పు ,జనరల్ ట్రాన్స్‌ఫర్, రెగ్యులర్ ప్రమోషన్స్, ఆర్‌పిడిసిఎల్ అంశంపై చర్చించగా ఈ వారంలోనే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని యాజమాన్యం తెలియజేసినట్లు తెలిపారు.. అలాగే అన్ని విద్యుత్ కంపెనీలలోని వివిధ క్యాడర్లలో ఖాళీలను భర్తి చేసేందుకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.కావున తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించినందుకు సిఎం రేవంత్ రెడ్డి, విద్యుత్ మంత్రి భట్టి విక్రమార్క, ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎండీలు జితేష్ పాటిల్, కృష్ణభాస్కర్,వరుణ్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నేతలు నాసర్ షరీఫ్, నవీన్‌వర్మ, అక్బర్, మాతంగి శ్రీనివాస్, రాజా రవిచంద్ర, లక్ష్మణ్, వీరాజు, చేతన్, వెంకటేశ్వర్లు, శంకర్ తదితరుల పాల్గొన్నారు.


ఎస్‌పిడిసిఎల్,ట్రాన్స్‌కో,జెన్‌కో సిఎండీలతో సమావేశమైన జేఏసీ నేతలు శివాజీ, అంజయ్య తదితరులు

## హెచ్‌సిఎ పరిధిని అన్ని జిల్లాలకు విస్తరించాలి

### తెలంగాణ క్రికెట్ జాయింట్ యాక్షన్ కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఏ)పరిధిని కేవలం నగరానికే పరిమితం చేయకుండా, తెలంగాణలోని అన్ని జిల్లాలు, నియోజక వర్గాలకు విస్తరించాలని తెలంగాణ క్రికెట్ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా డిమాండ్ చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 23 హెచ్‌సిఏ కార్యదర్శికి కమిటీ ప్రత్యేకంగా ఒక ప్రెస్ నోట్ ద్వారా విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా టీసీజేఏసీ పలు కీలక అంశాలను ప్రస్తావించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 2014 జూన్ 2 నుంచి ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగుతోందని, అలాగే 201617 నాటికి రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పాటయ్యాయని గుర్తుచేసింది. రాష్ట్రపతి 201617లో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్కు అనుగుణంగా రాష్ట్రంలోని 33 జిల్లాలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు హెచ్సీఏ అనుబంధం కల్పించాలని డిమాండ్ చేసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఆటగాళ్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్సీఏ అఫిలియేషన్ లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన క్రికెటర్లకు సరైన అవకాశాలు దక్కడం లేదని కమిటీ ఆరోపించింది. గ్రామాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే వేదికలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య తీవ్ర అసమానతలు తెలంగాణ జనాభాలో సుమారు 35 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తుండగా, వారికి ఏకంగా 209 క్రికెట్ క్లబ్‌లు అందుబాటులో ఉన్నాయని టీసీజేఏసీ వెల్లడించింది. మరోవైపు, రాష్ట్రంలో 65 శాతం ఉన్న గ్రామీణ జనాభాకు కేవలం 8 క్లబ్‌లు మాత్రమే ఉండటం దారుణమని పేర్కొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న ఈ స్పష్టమైన అసమానతలను వెంటనే తొలగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు సమాన అవకాశాలు కల్పించేలా కొత్త హెచ్‌సిఏ క్లబ్‌లను కేటాయించాలని, తెలంగాణ అంతటా క్రికెట్ క్రీడను అభివృద్ధి చేసేందుకు హెచ్సీఏ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని టీసీజేఏసీ విజ్ఞప్తి చేసింది.

## బిసిలు ఐక్యంగా పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యం

### బిసి మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు

**సైఫాబాద్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కోట్లాది మంది బిసిలు ఆత్మన్యునతా భావాన్ని వీడి, ఐక్యతతో పోరాడితే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యం అవుతుందని బిసి మేధావులు ఫోరం ఛైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలోని పది లక్షల మంది రజకులు ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారంతోపాటు చట్ట సభలలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని ఆయన చెప్పారు. అఖిల భారత రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రజకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి 8 దశాబ్దాలు గడిచినప్పటికి నాటి నుంచి నేటి వరకు రజకులు సమాజానికి విశేషమైన సేవలు అందిస్తూ వస్తున్నారని, కాని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలపై సవతి ప్రేమ చూపుతున్నాయని, బిసి వ్యక్తి ప్రధాని మంత్రిగా నరేంద్రమోదీ ఉన్నప్పటికి జనగణనలో కులగణన చేపట్టలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఫామ్ హౌస్‌ల గోల పెరిగిపోయిందని, బిసిలకు ఫామ్ హౌస్‌లు లేవని, చాకలి ఐలమ్మ సాక్షిగా బహుజన రాజ్యం సాధిద్దామని, ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, రజకులకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విమాన ఇంజిన్ సేవల విస్తరణకు జిఎంఆర్ ఏరో టెక్నిక్, స్టాండర్డ్ ఏరో భాగస్వామ్యం

**శంషాబాద్ సెప్టెంబరు23,ప్రభాతవార్త :** ఆసియా పసిఫిక్ ప్రాంతంలో విమాన ఇంజిన్ నిర్వహణ, సాంకేతిక సహాయ సేవలను విస్తరించేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్ (జీఏటీ), స్టాండర్డ్ ఏరో సంస్థలు కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఇరు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ఆసియాపసిఫిక్ ప్రాంతంలో విమానంలోనే ఇంజిన్ నిర్వహణ, సాంకేతిక సహాయ సేవలు అందించే అధీకృత సేవా కేంద్రంగా జీఎంఆర్ ఏరో టెక్నిక్‌ను అభివృద్ధి చేయనున్నారు.స్టాండర్డ్ ఏరోకు ఉన్న ఇంజిన్ అనంతర మార్కెట్ సేవల నైపుణ్యాన్ని, జీఎంఆర్ ఏరో టెక్నిక్‌కు ఉన్న మౌలిక సదుపాయాలు, నిర్వహణ-మరమ్మతు-సమగ్ర పరిశీలన (ఎంఆర్‌ఓ) సామర్థ్యాలతో అనుసంధానం చేయనున్నారు. ప్రతిపాదిత కేంద్రం ద్వారా విమానయాన సంస్థలు, ఆపరేటర్లకు ఇంజిన్ మరియు మాడ్యూళ్ల మార్పిడి, అంతర్గత భాగాల తనిఖీలు, ఫ్యాన్ బ్లేడ్, ఇంధన నాజిల్, గేర్‌బాక్స్ మార్పిడి వంటి సేవలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా ఇంజిన్ సంరక్షణ, నిల్వ, వేగవంతమైన ఇంజిన్ మార్పిడి కోసం సమీకరణ, ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, ఇంజిన్ రవాణా, సరఫరా సహాయం వంటి సేవలను కూడా అందించనున్నారు. దీంతో విమానాలు సేవలకు దూరంగా ఉండే సమయం తగ్గి, ఆపరేటర్లకు వేగవంతమైన సాంకేతిక సహాయం అందే అవకాశం ఉంటుంది. జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు, బాధ్యతాయుత నిర్వహణాధికారి అశోక్ గోపీనాథ్ మాట్లాడుతూ, స్టాండర్డ్ ఏరోతో భాగస్వామ్యం ఆసియాపసిఫిక్ ప్రాంతానికి అధునాతన ఇంజిన్ సహాయ సామర్థ్యాలను అందించే దిశగా కీలక మైలురాయిగా పేర్కొన్నారు. సంస్థ మౌలిక సదుపాయాలు, ప్రాంతీయ ఉనికితో స్టాండర్డ్ ఏరో నైపుణ్యాన్ని కలిపి వేగవంతమైన ఇంజిన్ నిర్వహణ సేవల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.స్టాండర్డ్ ఏరో ప్రపంచ విక్రయాల సీనియర్ ఉపాధ్యక్షురాలు రెబెక్కా లేన్ మాట్లాడుతూ, భారతదేశంలోని విమాన ఆపరేటర్లకు అందిస్తున్న సహాయ సేవలను ఈ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వాణిజ్య విమానయాన మార్కెట్లలో ఒకటని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంతో జీఎంఆర్ ఏరో టెక్నిక్ సంప్రదాయ ఎంఆర్‌ఓ సేవలకు మించి ఇంజిన్, విడిభాగాల సహాయ సామర్థ్యాలను విస్తరించడంతో పాటు ఆసియా పసిఫిక్ విమానయాన అనంతర మార్కెట్లో తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోనుంది.



ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

# పాత్రోచిత చిత్రణకే పేరు !



ఎన్నో కలలతో మహానగరానికి వచ్చి, నిరంతరం శ్రమించే ప్రతి కళాకారుడికి ఇది ఒక గర్వకారణం. జీవితం మన కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసిందో ఎవరూ ఊహించలేరు. మనం వంతుగా మనం చేయాల్సింది కేవలం నిజాయితీగా కష్టపడటమే. అలా అంకిత భావంతో పనిచేస్తే ఏదో ఒక రోజు ఖచ్చితంగా గమ్యాన్ని చేరుకుంటాం“ అని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఒక కళాకారుడికి లభించే అత్యున్నత గుర్తింపు అయిన జాతీయ అవార్డును అందుకోవడం తనకెంతో గర్వంగా ఉందని యామీ తెలిపారు.

ఆర్టికల్ 370 చిత్రంలోని జూని హక్సర్ పాత్రతో యామీ గౌతమ్‌కు ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. 72వ జాతీయ చలనచిత్రఅవార్డుల కార్యక్రమంలో ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్నారు. యామీ గౌతమ్ తన పానరతోచితనటన విషయమై ఎన్నో విషయాలు చెప్పారు. ఒక నటి కెరీర్‌లో ఎన్నో విజయాలు రావచ్చు. కానీ దేశవ్యాప్తంగా అత్యున్న త స్థాయిలో గుర్తింపు పొందే జాతీయ అవార్డు మాత్రం ప్రత్యేకమైన మైలురాయి. యామీకి ఇది తొలి జాతీ యఅవార్డు. ఆర్టికల్ 370లో జూని హక్సర్ చాలా ప్రత్యేకమైన పాత్ర. ఆమెను కేవలం ఒక యాక్షన్ క్యారెక్టర్‌గా చూడలేం. ఆ పాత్రలో బాధ్యత ఉంది, ఒత్తిడి ఉంది, నిర్ణయాలు తీసుకోవాల్సి నపరిస్థితులు ఉన్నాయి. ఒక ఇంటెలిజెన్స్ అధికారిణిగా ఆమె ఎదుర్కొనే పరిస్థితులను ప్రేక్షకుడికి నమ్మించేలా చూపించాలి. జూని ఒక కల్పిత పాత్ర అయినప్పటికీ, ఆ పాత్ర ద్వారా సినిమాలోని కీలక సన్నివేశాలతో పాటు ఇంటెలిజెన్స్ ఆపరేషన్లకు సంబంధించిన సన్నివేశాలను సహజంగా చేయాల్సి వచ్చింది. పాత్రకు తగిన శారీర కశిక్షణ, బాడీ లాంగ్వేజ్‌పై కూడా ఆమె పని చేశారు. జూని పాత్రలో మరో సవాలు భావోద్వేగాల నియంత్రణ. సాధారణ కమర్షియల్ పాత్రల్లో భావోద్వేగాలను ముఖ కవళికలు, డైలాగ్స్ ద్వారా స్పష్టంగా వ్యక్తపరిచే అవకాశం ఉంటుంది. కానీ ఇంటెలిజెన్స్ అధికారిగా పనిచేసే జూని విషయంలో ఆ భావాలను లోపలే ఉంచుకోవాల్సిన సందర్భాలు ఎక్కువ. భావోద్వేగాలను నియంత్రిస్తూ నటించడం కష్టం. అలాంటి సందర్భాల్లో కళ్లతో, చిన్న స్పందనతో, శరీ రభాషతో భావాన్ని చెప్పాలి. ఆ నిశ్శబ్దాన్ని ప్రేక్షకుడు అర్థం చేసుకునేలా చేయాలి. నాకు ఆ అనుభవం నటిగా చాలా ఉపయోగ పడింది. నేషనల్ అవార్డు ఒ కముగింపు కాదు” ఇది తనకు ముగింపు కాదని. ఇంకా నేర్చుకోవాల్సింది, చేయాల్సింది చాలా ఉందని ఆమె పేర్కొన్నారు. కానీ నాకు వ్యక్తిగతంగా యాక్షన్ కంటే ఆ పాత్రలోని మానసిక స్థితిని అర్థం చేసుకోవడం పెద్ద సవాలు. నాకు నేచురల్ యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. ఎక్కువగా చూపించకుండా కూడా ఒక భావాన్ని ప్రేక్షకుడికి చేరవేయగలిగితే అది మంచి నటన అని నేను భావిస్తాను. కొన్ని సందర్భాల్లో ఒక డైలాగ్ కంటే ఒక చూపు ఎక్కువ మాట్లాడుతుంది. అలాంటి సన్నివేశాలు నాకు చాలా ఇష్టం. ఒక పాత్ర స్క్రీన్ టైమ్ ఎంత ఉంది అనేది నాకు అంత ముఖ్యం కాదు. నా సినీ ప్రయాణాన్ని చాలా ఎమోషనల్‌గా అనిపిస్తుంది. ప్రతి సినిమా ఏదో ఒకటి నేర్పింది. కొన్ని సినిమాలు నాకు ఆనందాన్ని ఇచ్చాయి. కొన్ని సవాళ్లు ఇచ్చాయి. కొన్ని అనుభవాలు నన్ను నటిగా మాత్రమే కాకుండా వ్యక్తిగా కూడా మార్చాయి. సినిమా రంగంలో మన ప్రయాణం ఎప్పుడూ మన ప్లాన్ ప్రకారం ఉండదు. కానీ అదే ఈ ప్రయాణంలోని అందం. అవకాశం వచ్చినా రాకపోయినా మన ప్రయాణాన్ని ఆపకూడదు. నా సినిమాలను చూసిన ప్రతి ఒక్కరికీ ఈ అవార్డులో ఒక భాగం ఉంది. ఎందుకంటే ప్రేక్షకులు లేకుండా నటీనటుల ప్రయాణం అసంపూర్ణం. ◻

# క్రియాశీలకంగా హార్మోన్‌లు



ప్రస్తుతం చాలామంది మహిళలు ఎదుర్కొంటోన్న సమస్య ఇది. దీనివల్ల అధిక బరువు. నిద్ర పట్టకపోవడం, నెలసరి సంబంధిత సమస్యలు.. వంటివి తలెత్తుతుంటాయి. మరి, ఇలా జరగకుండా హార్మోన్లను సమతులంగా ఉంచుకోవాలంటే.. కొన్ని చిట్కాలు.

**ఫైబర్ ఎక్కువగా:** హార్మోన్లను సమతులంగా ఉంచుకోవడానికి.. మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు అవసరమైన మొత్తంలో ఉండేలా చూసుకోవాలి. ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు, కాయగూరలు, ఆకుకూరలు ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇది రక్తంలోని ఇన్సులిన్ స్థాయిని సమన్వయపరుస్తుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయి, యాపిల్, జామ పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఫలితం ఉంటుంది.

**వెజిటబుల్ ఆయిల్స్..** మన శరీరంలో కొవ్వుల పాత్ర చాలానే ఉంటుంది. హార్మోన్ల ఉత్పత్తికి, వివిధ కణాలను తిరిగి నిర్మితమవడానికి కొవ్వులు ఎంతో ఉపయోగపడతాయి. కొన్ని రకాల వెజిటబుల్ ఆయిల్స్‌లో అధిక మొత్తంలో ఉండే పాలీశ్యాచురేటెడ్ కొవ్వులు ఈ పనులను సమర్థంగా నిర్వర్తిస్తాయి. కాఫీ పూర్తిగా! అలవాటైందనో లేక ఇష్టమనో కొందరు పదే పదే కాఫీ తాగుతుంటారు. కానీ ఎక్కువగా కాఫీ తాగడం వల్ల కూడా హార్మోన్ల మిశ్రమం దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి దీన్ని ఎక్కువగా తీసుకుంటే మంచిదని అంటున్నారు. వీటితో పాటు రోజూ ఎనిమిది గంటల సుఖ నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం వల్ల హార్మోన్లను సమతులంగా ఉంచుకోవచ్చు. ◻

# వ్యథ

# రక్షణ కోరడంలో తప్పులేదు !



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న:** నాకు 45 ఏళ్లు. నా భర్త వయస్సు 46 సంవత్సరాలు. మాకు పెళ్లయి 20 ఏళ్లు అవుతోంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన బాగా చదువుకున్నారు. అయినా మొదటి నుంచి నన్ను అనుమా నించడం మానలేదు. నాకు ఇతరులతో సంబంధాలు ఉన్నాయని ఊహించుకుని తరచూ వేధిస్తుంటారు. రోజురోజుకూ ఆయన ప్రవర్తన మరింత దిగజారు తోంది. ఇటీవల పది మంది ముందు కూడా నన్ను బూతులు తిడుతున్నారు. సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినందున ఇన్నేళ్లూ సహించాను. రెండేళ్ల క్రితం ఒక సైకియాట్రిస్ట్‌ను కలిసి చికిత్స ప్రారంభిం చాము. కొంతకాలం మందులు వాడి తర్వాత ఆయన స్వయంగా మానేశారు. ఇప్పుడు మళ్లీ డాక్టర్ దగ్గరకు రమ్మం టున్నా రావడం లేదు. ఆయన తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితిలో పోలీసుల సహాయం తీసుకుంటే మంచిదేనా? నాకు సరైన సలహా ఇవ్వగలరు.

– రాణి (పేరు మార్చాం') హైదరాబాద్

**జవాబు:** మీరు 20 ఏళ్లగా అనుభవిస్తున్న పరిస్థితి సాధారణ దాంపత్య సమస్యగా తీసుకోకండి. ఆధారాలు లేకుండా పదేపదే అనుమానిం చడం, ఆరోపణలు చేయడం, బహిరంగంగా బూతులు తిట్టడం మీకు తీవ్రమైన మానసిక వేదన కలిగి స్తుంది. ఇలాంటి వాతావరణం పిల్లలపై కూడా ప్రతికూల ప్రభావం చూప వచ్చు. ఆయన గతంలో సైకియా ట్రిస్ట్‌ను కలసి చికిత్స తీసుకున్నారన్నది ముఖ్యమైన విషయం. మందులను స్వయంగా ఆపడంసరైనది కాదు. వీలైనంత త్వరగా మళ్లీ మానసిక వైద్యుడిని సంప్రదించాలి. అవసరమైతే మందులతో పాటు కౌన్సెలింగ్ కూడా ఉప యోగపడుతుంది. అయితే చికిత్సకు ఒప్పించడం మాత్రమే మీ బాధ్యత కాదు. మీ భద్రతను కూడా మీరు మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలి. కొట్టడం, బెదిరించడం, ఇంట్లో బంధించడం లేదా ప్రమాదకరంగా ప్రవర్తించడం ఉంటేఅటువంటి పరిస్థితిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకండి. ప్రమాదం ఉన్నప్పుడు పోలీసుల సహాయం తీసుకోవడంలో తప్పు లేదు. అది భర్తను శిక్షించడానికే కాదు, మీకు రక్షణ కల్పించడానికి కూడా ఉపయోగపడు తుంది. అత్యవసర పరిస్థితిలో వెంటనే స్థానిక పోలీసులను లేదా అత్యవసర సేవలను సంప్రదించండి. భర్త కోపంగా ఉన్న సమయంలో వాదనకు దిగకుండా జాగ్రత్త వహించండి. నమ్మకమైన బంధువు లేదా స్నేహితురాలికి పరిస్థితిని వివరించి సహాయం కోరండి. మీరు కూడా ఒక సైకాలజిస్ట్ లేదా కౌన్సిలర్‌ను సంప్రదించడం మంచిది. “కుటుంబం కోసం సహించాలి” అనేది ఒక పరిమితి వరకు మాత్రమే. అవమానం, భయం, హింసను జీవితాంతం భరించాల్సిన అవసరం లేదు. వైద్య సహాయం, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, అవసరమైనప్పుడు చట్టపరమైన రక్ష ఈ నాలుగు మార్గాలను పరిస్థితికి అనుగుణంగా ఉపయోగించుకోవాలి. భరించడం మాత్రమే పరిష్కారం కాదు..సమస్యను గుర్తించి, సహాయం తీసుకోవడమే పరిష్కారానికి తొలి అడుగు. ◻



# దత్తాత్రేయ వజ్రకవచం



అత్రి మహర్షి .. అనసూయ మాత కోరిక మేరకు దత్తాత్రేయుడు అవతరించాడు. దేవతలకు .. మహర్షులకు జ్ఞానాన్ని బోధించాడు. అలాంటి దత్తాత్రేయస్వామి తన భక్తులను అనేక రూపాలలో .. అనేక విధాలుగా పరీక్షిస్తుంటాడు. తన పరీక్షకి నిలబడిన భక్తులను ఆయన కంటికి రెప్పలా కాపాడుతుంటాడు. దత్తాత్రేయస్వామిని ఏడుమార్లు తలచుకుంటే .. ఏడోసారికి ఆయన భక్తుల చెంతకి చేరుకుంటాడని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి దత్తాత్రేయస్వామి చరిత్రను పారాయణం చేయడం వలన అనేక దోషాలు తొలగి పోతాయి. ఇక స్వామివారి 'వజ్ర కవచం' చదువుకోవడం వలన కూడా విశేషమైన ఫలితాలు కలుగుతాయి. దత్తాత్రేయస్వామివారి 'వజ్ర కవచం'ను మేడిచెట్టు క్రింద కూర్చుని చదువుకోవడం వలన ధనధాన్యాలు కలుగుతాయి. మారేడు చెట్టు క్రింద కూర్చుని చదవడం వలన సుఖ సంతోషాలు కలుగుతాయి .. రావిచెట్టు క్రింద కూర్చుని 'వజ్ర కవచం' చదవడం వలన ఆయురారోగ్యాలు చేకూరతాయి. తులసి మొక్క దగ్గర కూర్చుని ఈ వజ్రకవచాన్ని చదవడం వలన జ్ఞానము లభిస్తుంది.

# మమ్ టోస్ట్ మష్రూమ్స్



మష్రూమ్స్ (పుట్టగొడుగులు): ఒక కప్పు, బ్రెడ్‌స్లైసెస్: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, క్యాప్సికమ్: ఒకటి, వెన్న: అర కప్పు, క్రీమ్ చీజ్: అర కప్పు, మిరియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు.

**తయారీ:** మష్రూమ్స్‌ను ముక్కలుగా చేసుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ వెన్న వేసి వేడయ్యాక సన్నగా తరిగిన వెల్లుల్లి, మష్రూమ్ ముక్కలు, క్యాప్సికమ్, ఉల్లిగడ్డ ముక్కలు వేసి బాగా వేయించాలి. అన్నీ బాగా వేగాక మిరియాల పొడి, ఉప్పు వేసి మరో రెండు నిమిషాలు వేయించి దించేయాలి. బ్రెడ్ స్లైస్‌పై క్రీమ్ చీజ్ రాసి, మష్రూమ్ మిశ్రమం పరిచి, పైనుంచి మరో స్లైస్ ఉంచాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి, అప్పటికే తయారు చేసి పెట్టుకున్న బ్రెడ్ స్లైసెస్‌ను రెండు వైపులా వెన్న వేసి కాల్చుకుంటే మష్రూమ్ టోస్ట్ రెడీ. ◻

# తెర

# 'తెల్ల కాగితం' చిత్రం ట్రైలర్ లాంచ్



శ్రీమతి కె. శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్న చిత్రం 'తెల్లకాగితం'. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న ఈ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందిస్తున్నారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకుడు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేస్తున్నారు. ..సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ ..కృష్ణ తో నేను 'జవాన్' మూవీని చేశాను. కృష్ణ నాకు ఇష్టమైన నిర్మాత. నాకు ఫుల్ పేమెంట్ ఇచ్చిన నిర్మాత కూడా ఈయనే (నవ్వుతూ). తెల్లకాగితం అనేది మన మనసు ల్లాంటిది. తెల్లకాగితంపై ఏం రాసుకుంటే మన మనసులో అదే ఉంటుంది. ..ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. రోషన్ ఆల్రెడీ యాక్టర్‌గా నిరూపించుకున్నాడు. రోషన్‌కి 'తెల్ల కాగితం' మైల్ స్టోన్ మూవీగా నిలిచిపోవాలి. హీరోయిన్ నక్షత్ర పేరులోనే స్టార్ ఉంది. రైటర్, ప్రొడ్యూసర్ కోన వెంకట్ మాట్లాడుతూ.. .. 'నందు అద్భుతమైన రైటర్. అందరికీ పని కల్పించు, ఇలానే మంచి కథల్ని రాస్తూ ఉండు అని నందుకి చెబుతూనే ఉంటాను. హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. .తెలిసీ తెలియని ఓ వయసులో చేసే తప్పుల్ని పట్టుకుని తెల్ల కాగితం సినిమాని తీశాం. మా కంటెంట్‌ని వైరల్ చేస్తున్న మీడియాకి, మీమర్స్‌కి థాంక్స్. ఇలాంటి కథ నా దగ్గరకు రావడం నా అదృష్టం. దర్శకుడు రమేష్ బండ్రెడ్డి మాట్లాడుతూ.. . నేను కథలు పట్టుకుని చాలా ఆఫీసుల చుట్టూ తిరిగాను. మా ఆర్ట్ డైరెక్టర్ చిన్నా చివరకు కృష్ణని పరిచయం చేశారు. నటుడు శివాజీ మాట్లాడుతూ.. తెల్లకాగితంకథ నాకు తెలుసు. నేను మళ్లీ సినిమాలు చేద్దామని అనుకుంటున్న టైంలో విన్న రెండో కథ ఇది. . హీరోయిన్ నక్షత్ర మాట్లాడుతూ.. .. ఆశ అనే పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. అమాయకత్వంతో కూడిన ఇలాంటి మంచి పాత్ర అందరికీ కనెక్ట్ అవుతుంది.

# 'ఆదర్శ కుటుంబం 'అక్టోబర్ 9న రిలీజ్!



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల ఎంటర్‌టైనర్ మరో వారం ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకువిక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న భారీ వినోదాత్మక చిత్రం ˘ఆదర్శ కుటుంబం – AK47 విడుదల తేదీ మారింది. తొలుత ప్రకటించిన తేదీ కంటే వారం ఆలస్యంగా, ఈ చిత్రాన్ని అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ప్రేక్షకులకు సంపూర్ణ వినోదానుభూతిని అందించాలనే ఉద్దేశంతో చిత్ర విడుదలను వారం రోజుల పాటు వాయిదా వేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. మధ్యతరగతి కుటుంబ నేపథ్యంలో వెంకటేష్ పాత్రను పరిచయం చేస్తూ.. హాస్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలతో టీజర్ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ˘ఆదర్శ కుటుంబం – AK47 అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'ది గ్రాండెస్ట్ రోర్ ఆఫ్ హిజ్ లెగసి' పోస్టర్ లాంచ్




సినీ ఇండస్ట్రీ అంతా కదిలి వచ్చి నవంబర్ 28న నా కాన్సర్ట్‌ను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను కోటి 50: ది బిగ్గెస్ట్ లైవ్ కాన్సర్ట్ ఇన్ హైదరబాద్ 'ది గ్రాండెస్ట్ రోర్ ఆఫ్ హిజ్ లెగసి' పోస్టర్ లాంచ్ ఈవెంట్‌లో సంగీత దర్శకుడు కోటి.. ..ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 'నా చిన్నతనంలో కోటి పాటలెన్నో విన్నాను. ఈ రోజు ఇలా ఆయన్ను ఇక్కడ కలవడం ఆనందంగా ఉంది. ఈ యాభై ఏళ్లలో టెక్నాలజీ ఎంతో మారింది. ఒకప్పుడు గ్రామఫోన్‌లో ఆయన పాటలు వినేవాడ్ని. ఆయన మ్యూజిక్, పాటల వల్లే చాలా సినిమాలు విజయవంతమయ్యాయి. ..సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ.. ఈ రోజు ఇక్కడకు రావడంతోనే మా అమ్మానాన్నలు గుర్తుకు వచ్చారు. నా తండ్రి సాలూరి రాజేశ్వర్‌కి చెడ్డ పేరు తీసుకు రాకూడదు అని ప్రతీక్షణం ఆలోచిస్తూ పని చేస్తూ వచ్చాను. నేను ప్రతీ సినిమాని, ప్రతీ పాటను మొదటి అవకాశంగానే భావించి కష్టపడి పని చేశాను. ..మంజులరావు జూపల్లి మాట్లాడుతూ.. .. ఎన్ని కోట్లు సంపాదించినా కూడా మేం కొన్ని కాలాల పాటే అందరికీ గుర్తుంటాం. కానీ కోటి లాంటి వారు మాత్రం తరతరాలకు గుర్తుండిపోతారు. మనతో ఎంటర్టైన్మెంట్స్ శోభన్ మాట్లాడుతూ.. .. కోటి సంగీతంతో పాటు మనం పెరుగుతూ వచ్చాం. ఆయన బీట్.. మన హార్ట్ బీట్. ఐదు దశాబ్దాలుగా ఆయన సంగీతాన్ని ఆస్వాధిస్తూనే వస్తున్నాం.

# 'అనుమాన పక్షి' పెద్ద బ్లాక్‌బస్టర్: విమల్ కృష్ణ



అనుమాన పక్షి యూనిక్ ఫిలిం. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. తప్పకుండా చాలా పెద్ద విజయం సాధిస్తుంది: హీరో రాగ్ మయూర్ డీజే టిల్లుతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో క్విర్కీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనుమాన పక్షి '. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా.. హ్యూమర్, క్యారెక్టర్స్, కథనంలో పూర్తిగా డిఫరెంట్‌గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 25న అనుమాన పక్షి థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ.. మా నాన్నగారు ఎప్పుడూ సమయాన్ని వృథా చేయకూడదని చెప్పేవారు. నేను యాక్టర్ అవ్వాలని డిసైడ్ అయిన తర్వాత ఒక్క క్షణం కూడా వృథా చేయలేదు. నటుడిగా ప్రతిక్షణం మెరుగవడానికి ప్రయత్నించాను. యాక్టింగ్ నా ఊపిరి. డైరెక్టర్ విమల్ కృష్ణ మాట్లాడుతూ. ఈ సినిమా మీద నేను చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. 100 కొడుతున్నాం. ఇది నేను ఓవర్‌కాన్ఫిడెన్స్‌తో చెప్పట్లేదు. నా ఫిల్మ్‌ను గట్ ఫీలింగ్‌తో నమ్ముతున్నాను.

# 'ఆదివారం' చిత్రం ప్రారంభోత్సవం



జెఎస్ఆర్ క్రియేషన్స్ 999 బ్యానర్ పై సుబ్రమణ్యం చిగురుపాటి రచన దర్శకత్వంలో జెఎస్ రాజా రెడ్డి నిర్మాతగా ప్రారంభమైన చిత్రం ఆదివారం. ఈ చిత్రానికి సాకేత్ సినిమాటోగ్రఫీ బాధ్యతను చేపట్టగా ఎస్ఎస్ వెంకటేష్ సంగీతం అందిస్తున్నారు. దువ్వరపు వెంకటేష్ ఎడిటర్‌గా పని చేయనున్న ఈ చిత్రంలో రఘు తేజ, సునీల్, తార, ఝాన్సీ ప్రముఖ పాత్రలు పోషిస్తుండగా విలాస్, అశోక్, సయ్యద్ మెహబూబ్ భాషా తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా రామ సత్య నారాయణ మాట్లాడుతూ... దర్శకుడు నాకు ఎంతోకాలం నుండి పరిచయం ఉంది. గతంలో కూడా కొన్ని సినిమాలు చేశాడు. కంటెంట్ ఉంటే చిన్న సినిమాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తారు. దర్శకుడు సుబ్రమణ్యం చిగురుపాటి మాట్లాడుతూ... మా చిత్ర ప్రారంభోత్స వానికి వచ్చిన ముఖ్య అతిథులు కెఎస్ రామారావుకి, రామ సత్యనారాయణకి, మీడియా వారికి థాంక్స్. జెఎస్ రాజారెడ్డి మాట్లా డుతూ... నాకు సినిమా అంటే కొత్త కాదు. గతంలో రచనారంగంలో, ఆర్టిస్ట్‌గా సినిమాలో చేశాను. గతంలో ఎన్ని హారర్ సినిమాలు వచ్చిన ˘ప్పటికీ ఈ సినిమా పూర్తిగా కొత్తగా ఉంటుంది. నటుడు తేజ మాట్లాడుతూ... నన్ను గుర్తించి నాకు ఈ సినిమాలో నటిం చేందుకు అవకాశం ఇచ్చిన దర్శకునికి థాంక్స్. నటి తారా మాట్లా డుతూ... నాకు ఈ సినిమా లో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. నటుడు సునీల్ మాట్లాడుతూ...నాకు అవకాశం ఇచ్చినందుకు దర్శక నిర్మాతలకు థాంక్స్.

# 'కర్ణ' మహా యోధుడు కర్ణుడిగా రాఘవ లారెన్స్



పెన్ మూవీస్ అధినేత జయంతిలాల్ గడా సమర్పణలో.. ఆర్‌వీ స్టూడియోస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్ అసోసియేషన్ లో.. దర్శకుడు రమేష్ వర్మ నుంచి ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న భారీ పాన్ ఇండియా ఎపిక్˘కర్ణ. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై మహాభారతంలోని మహావీరుడు కర్ణుడి మహాగాథ మరోసారి ఆవిష్కృతం కానుంది. ఈ మహా యోధుడి పాత్రలో ప్రముఖ నటుడు రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. దర్శకుడు రమేష్ వర్మ తనదైన విజన్‌తో ఈ పురాణగాథను భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరిస్తు న్నారు. రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో రూపొందుతోంది. ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్ఠాత్మక ఎపిక్.. అత్యున్నత నిర్మాణ విలువలు, భారీ సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. నిజమైన సెట్స్ వైభవానికి అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ.. ప్రేక్షకులను కర్ణుడి ప్రపంచం లోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. భారీ స్థాయి విజువల్స్‌తో పాటు కథలోని భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

# ఇక్కడ సినిమా ఒక వేడుక : రాఘవ్ జయల్



ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. “ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను“ అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. క్రాక్‌రాక్స్ అనే స్టేజ్ పేరుతో తన స్లోమోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత డ్యాన్స్ ప్లస్ వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహారించారు.

# క్రికెట్ చరిత్రలోనే క్రేజీ మ్యాచ్‌కు ప్లాన్

### టీమిండియా వర్సెస్ రెస్టాఫ్ ఇండియా



**న్యూఢిల్లీ:** క్రికెట్ చరిత్రలోనే క్రేజీ మ్యాచ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్లాన్ చేస్తోంది. బీసీసీఐ ఏర్పడి 100 ఏళ్ల ఉత్సవాల భాగంగా, భారత 11వ జట్టు, మిగతా ప్రపంచ 11వ జట్టు (రెస్టాఫ్ ఇండియా) మధ్య ఒక ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహించాలని యోచిస్తోంది. ఈ నెల 25 జరిగే బీసీసీఐ 95వ వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం)లో ఈ చారిత్రాత్మక శతజయంతి వేడుకలపై అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే డిసెంబర్ 2027 నుంచి 2028 వరకు ఏడాది పాటు శతాబ్ది ఉత్సవాలను బీసీసీఐ నిర్వహించనుంది. ఈ వేడుకలను పర్యవేక్షిందుకు బీసీసీఐ ఒక కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రస్తుతం ఈ చర్చలు ప్రాథమిక దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐసీసీ వరల్డ్ ఎలెవన్ ఇప్పటి వరకు మొత్తం 9 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. వాటిలో జనవరి 2005లో ఆసియా ఎలెవెన్‌తో ఒక వన్డే, అక్టోబర్ 2005లో ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, ఒక టెస్ట్, సెప్టెంబర్ 2017లో పాకిస్థాన్‌తో మూడు టీ20లు, 2018 మేలో లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో ఒక టీ20 ఆడింది. భారత్ జట్టుతో మాత్రం ఐసీసీ ఎలెవన్ ఇప్పటి వరకు ఒక్క అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడలేదు. ఒకవేళ భారత్, రెస్టాఫ్ ఇండియా మ్యాచ్‌ను ప్లాన్ చేస్తే, వన్డే ఫార్మాట్‌లో నిర్వహించే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఇక బీసీసీఐ భారత స్వాతంత్ర్యానికి ముందే 1928 డిసెంబర్ 1న ఏర్పాటైంది. 2028 డిసెంబర్ 1 వరకు 100 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఐసీసీ ర్యాంకింగ్స్ ద్వారా ఐసీసీ వరల్డ్ ఎలెవన్‌ను ఎంపిక చేయనున్నారు. ఈ క్రేజీ మ్యాచ్‌ను ఎప్పుడు నిర్వహిస్తారనేదానిపై ఇంకా స్పష్టత తీసుకోలేదు. 2027 వన్డే ప్రపంచకప్ ముందే నిర్వహిస్తే భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు బరిలోకి దిగుతారు. మెగా టోర్నీ తర్వాత అయితే ఈ ఇద్దరూ దూరమయ్యే అవకాశం ఉంది. బీసీసీఐ సమావేశం తర్వాత ఈ క్రేజ్ మ్యాచ్‌పై క్లారిటీ రానుంది. ఈ సమావేశంలోనే టీమిండియా నయా ఛీఫ్ సెలెక్టర్ నియామకంపై కూడా నిర్ణయం తీసుకోనున్నారు.

## మూడు వన్డేల సిరీస్: ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్

### 3-0తో ఛాంపియన్‌గా టీమిండియా



**రాజ్‌కోట్ :** భారత అండర్19 క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. రాజ్‌కోట్‌లో బుధవారం జరిగిన మూడో, చివరి వన్డే మ్యాచ్‌లోనూ భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసి ఆస్ట్రేలియాపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఆసీస్ ఓపెనర్ జెడ్ హాలిక్ అద్భుతంగా ఆడి 87 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. అతనితో పాటు, నీల్ పటేల్ (51), బ్లేక్ కేటిల్ (38) రాణించడంతో ఆస్ట్రేలియా సవాల్ విసిరే స్కోరును సాధించగలిగింది. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వా, మనల్ చౌహాన్ అత్యద్భుతంగా బౌలింగ్ చేసి చెరో 3 వికెట్లు, కావ్య పటేల్, ఆర్యన్ సవసాని తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక ఆస్ట్రేలియా నిర్దేశించిన 255 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ తో (34) కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన లక్ష్య, ఆ తర్వాత కుషాగ్ర ఓజా (45)తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఒక దశలో భారత్ కొన్ని వికెట్లు కోల్పోయినా, కెప్టెన్ లక్ష్య మాత్రం అద్భుతమైన బ్యాటింగ్‌ను కొనసాగించి 110 పరుగులతో జట్టును గెలిపించాడు. అతనికి తోడుగా రజత్ బఫేల్ 44 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత జట్టు 41.2 ఓవర్లలోనే కేవలం 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసి సులభంగా విజయాన్ని అందుకుంది.

# ఆసియా క్రీడలు

## పురుషుల స్కీట్ టీమ్‌కు కాంస్యం

### వ్యక్తిగత ఫైనల్‌కు చేరిన అనంత్

**నగోయా:** ఆసియా గేమ్స్ 2026లో, ఒలింపియన్లు అనంతజీత్ సింగ్ నరుకా, మైరాజ్ అహ్మద్ ఖాన్‌లు భవతేగ్ సింగ్‌తో కలిసి పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య



పతకాన్ని గెలుచుకున్నారు. నగోయాలో బుధవారం జరిగిన ఈ క్రీడల్లో భారత త్రయం సంయుక్తంగా 346 స్కోరు సాధించి, భారతదేశానికి ఏడవ షూటింగ్ పతకాన్ని అందించింది. క్వాలిఫికేషన్‌లో 125కి 119 స్కోరు సాధించిన అనంత్‌జీత్, మెడల్ రౌండ్‌కు చేరిన పురుషుల జట్టులోని ఏకైక భారతీయ షూటర్‌గా నిలిచి వ్యక్తిగత ఫైనల్‌కు కూడా అర్హత సాధించాడు. మైరాజ్ 125కి 116, భావతేగ్ 125కి 111 స్కోరు సాధించడంతో ఫైనల్‌కు వీరిద్దరూ అర్హత సాధించలేకపోయారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్లలో కూడా భారత్ పతకం లేకుండానే ముగిసింది. మహిళల వ్యక్తిగత ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్ 181.1 పాయింట్లతో ఐదవ స్థానంలో నిలవగా, అంతకుముందు భారత మహిళల జట్టు రెండు ఇన్నర్ 10 సెకన్ల తేడాతో కాంస్య పతకాన్ని కోల్పోయింది.




## వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాకు తొలి రజతం

**నగోయా:** భారత వెయిట్‌లిఫ్టింగ్ స్టార్ మీరాబాయి ఐచినగోయా ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రాత్మక రజత పతకాన్ని గెలుచుకుంది. నగోయా సిటీ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సెంటర్‌లో బుధవారం నాడు జరిగిన ఈ పోటీల్లో 32 ఏళ్ల మీరా 87 కేజీల స్నాచ్ మరియు 111 కేజీల క్లీన్ అండ్ జర్క్‌లను కలిపి మొత్తం 198 కేజీల బరువును ఎత్తింది. ఈ రజత పతకంతో, 1998లో బ్యాంకాక్‌లో కర్ణం మల్లేశ్వరి రజతం గెలుచుకున్న తర్వాత ఆసియా క్రీడలలో పతకం గెలిచిన తొలి భారత వెయిట్‌లిఫ్టర్‌గా చాను నిలిచారు, తద్వారా భారతదేశం యొక్క 28 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఇక ఉత్తర కొరియాకు చెందిన, రెండుసార్లు ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్ అయిన రీ సాంగ్‌గమ్, 94 కేజీల స్నాచ్ మరియు 121 కేజీల క్లీన్ అండ్ జర్క్‌తో కలిపి మొత్తం 210 కేజీల బరువు ఎత్తి స్వర్ణం సాధించారు. ఇండోనేషియాకు చెందిన విజయన లులుక్ డియాని ట్రి 191 కేజీల (87 కేజీల స్నాచ్, 103 కేజీల క్లీన్ అండ్ జర్క్) బరువుతో కాంస్యం గెలుచుకుంది.

## భారత్ జట్టు అజేయ పరంపర

### హాకీలో 20-1 థాయ్‌లాండ్‌పై విజయం

**గిఫు:** 2026 ఆసియా క్రీడల మహిళల హాకీ పోటీలలో భారత్ అజయ పరంపరతో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. గిఫు లో బుధవారం జరిగిన పూల్ బి మ్యాచ్‌లో థాయిలాండ్‌ను 20-1 తేడాతో చిత్తుగా ఓడించి మరో భారీ డబుల్ డిజిట్ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత్ కుదురుకోవడానికి కొంత సమయం పట్టింది. కానీ వెంటవెంటనే నాలుగు పెనాల్టీ కార్నర్‌లు లభించడంతో ఎనిమిదో నిమిషంలో దీపిక గోల్ చేసి



ఆధిక్యాన్ని అందించింది. ఈ మ్యాచ్‌లో దీపికా అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శనతో 9 గోల్స్ సాధించి స్టార్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. ఫార్వర్డ్, డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ అయిన ఈ భారత్ ప్లేయర్ ఈ గోల్స్‌ను పెనాల్టీ కార్నర్ల నుంచే సాధించింది. నవనీత్ కౌర్ 4 గోల్స్ సాధించగా, రుతుజా పిసాల్ హ్యాట్రిక్ పూర్తి చేసింది. నేహా, లాల్‌రెమ్సియామి, సాక్షి రాణా, కెప్టెన్ సలీమా టెటె కూడా గోల్స్ చేయగా, మ్యాచ్ ఆద్యంతం భారత్ నిరంతర ఒత్తిడిని కొనసాగించింది. నాలుగో క్వార్టర్ చివరిలో మాత్రమే థాయిలాండ్ క్లీన్ షీట్‌ను తప్పించుకోగలిగింది. పెనాల్టీ కార్నర్ నుండి సుపన్సా సమంసో డ్రాగ్‌ఫ్లిక్ చేసిన బంతి స్వల్పంగా పక్కకు మళ్లి భారత గోల్‌లోకి దూసుకెళ్లింది, తద్వారా మ్యాచ్‌లో థాయిలాండ్‌కు ఏకైక గోల్ లభించింది. ఉజ్బెకిస్తాన్‌ను 19-0 తేడాతో చిత్తుగా ఓడించి తమ ప్రచారాన్ని ప్రారంభించిన తర్వాత, ఇండోనేషియాను 17-1 తేడాతో ఓడించిన వీరికి ఇది వరుసగా మూడవ విజయం.

## ఇరాన్‌పై భారత్ మహిళలు విజయం





**నగోయా, జపాన్:** ఆసియా క్రీడల్లో కబడ్డీలో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, బుధవారం ఇక్కడ జరిగిన గ్రూప్‌స్టేజ్ మ్యాచ్‌లలో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌పై, మహిళల జట్టు ఇరాన్‌పై ఇరాన్‌పై సమగ్ర విజయాలు నమోదు చేశాయి. మహిళల జట్టు తమ రెండవ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో 2018 స్వర్ణ పతక విజేత ఇరాన్‌ను 37-23 తేడాతో సునాయాసంగా ఓడించింది. సగం ఆట ముగిసేసరికి 19-15 ఆధిక్యంలో ఉన్న భారత మహిళలు,

## కబడ్డీలో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించింది

రెండవ సగంలో కూడా తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుని ప్రత్యర్థులను పూర్తిగా అధిగమించారు. అలాగే పురుషుల జట్టు ఇక్కడ జరిగిన తమ మూడవ గ్రూప్ ఎ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 48-25 తేడాతో ఓడించింది. పురుషుల జట్టు మొదటి అర్ధభాగంలో 29-9 ఆధిక్యాన్ని సాధించారు. రెండవ అర్ధభాగంలో బంగ్లాదేశ్ మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ, వారు మ్యాచ్‌లో ఏ దశలోనూ పోటీలో నిలవలేకపోయారు. భారత మహిళల జట్టు అంతకుముందు తమ గ్రూప్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 42-21 తేడాతో ఓడించగా, పురుషుల జట్టు జపాన్‌ను 49-24 తేడాతో మరియు దక్షిణ కొరియాను 63-31 తేడాతో ఓడించింది.

# పశ్చిమాసియా సంకేతాలు

### లాభాల్లో దూసుకువెళ్లిన నిఫ్టీ, సెన్సెక్స్



**ముంబయి, సెప్టెంబరు 23:** అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొంత తగ్గుతున్నాయన్న సంకేతాలు, ముడి చమురు ధరలు వరుసగా తగ్గుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం పుంజుకున్నాయి. మెటల్, ఎఫ్ఎంసిజి, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 299.17 పాయింట్లు లాభపడి 74,828.25 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ50 సూచీ 117.80 పాయింట్లు పెరిగి 23,446.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభాల్లో బజాజ్ ఫైనాన్స్ 3.41 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో 1.64 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.61 శాతం చొప్పున పెరిగి కీలకంగా నిలిచాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.63 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.65 శాతం చొప్పున లాభపడ్డాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు కనిపించింది. బిఎస్ఇలో 2,809 షేర్లు లాభపడగా, 1,579 షేర్లు నష్టపోయాయి. మరో 225 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్‌లో 2026 నవంబర్ సెటిల్‌మెంట్‌కు బ్రెంట్ క్రూడ్ ధర 2 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 99.23 డాలర్లకు చేరింది. అమెరికా 10 యేళ్ల బాండ్ రాబడి 0.16 శాతం పెరిగి 4.956 శాతానికి చేరింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి కూడా 0.31 శాతం పెరిగి 7.038 శాతానికి చేరింది. రూపాయి స్వల్పంగా బలహీన ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీన పడింది. పాక్షికంగా కన్వర్టిబుల్ రూపాయి 96.7325 వద్ద ట్రేడైంది. గత సెషన్‌లో ఇది 95.6250 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో 2026 అక్టోబర్ 5 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 0.40 శాతం తగ్గి రూ.1,52,110 వద్దకు చేరాయి.
360 వన్‌వామ్ షేరు 3.25 శాతం పెరిగింది. ఆదిత్య ఇన్ఫోటెక్‌షేరు 5శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. సుబెక్స్ షేరు 13.76 శాతం దూసుకెళ్లింది. అర్వింద్ స్మార్ట్‌స్పేసెస్ 7.39 శాతం లాభపడింది. ఓస్వాల్ పంప్స్ 3.54 శాతం పెరిగింది. గార్వేర్ హైటెక్ ఫిల్మ్స్ 2.09 శాతం లాభపడింది. స్కిప్పర్ షేరు 0.62 శాతం ఎగబాకింది.

## భారత్‌పై టారిఫ్‌లు విత్‌డ్రాచేసుకోండి

### అమెరికాకు జెపి మోర్గాన్ సిఇఓ సలహా



**న్యూయార్కు, సెప్టెంబరు 23:** రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని, శిక్షార్హమైన టారిఫ్‌లు విధించవద్దని అమెరికాకు ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెపి మోర్గాన్ చేజ్ సిఇఓ జేమీ డైమన్ సూచించారు. తొందరపడి ఏకపక్షంగా ముందుకెళ్తే అది కేవలం భారత్‌కే కాకుండా యావత్ ప్రపంచ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో పునరాలోచన చేయాలని సలహా ఇచ్చారు. జెపి మోర్గాన్ ఇండియా ఇన్వెస్టర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా ఓ ప్రముఖ మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న చమురుపై టారిఫ్‌లు విధించే ముందు అమెరికా ప్రభుత్వం క్షుణ్ణంగా ఆలోచించాలని అన్నారు. భారత రిఫైనరీలు రష్యా చమురును ఎలా వినియోగిస్తున్నాయో వాటి అవసరాలేమిటో వాషింగ్టన్ ముందుగా అర్థం చేసుకోవాలని హితవు పలికారు. భారత్‌పై ఆంక్షలు విధించే బదులు అమెరికా అధికారులు భారత్‌తో కూర్చుని అన్ని వాస్తవాలను చర్చించాలని సూచించారు.
రష్యాతో పోరాడేందుకు చేయాల్సినవి చేస్తూనే భారత్‌ను, ప్రపంచ చమురు మార్కెట్లను శిక్షించకుండా అమెరికా వ్యవహరిస్తుందని నేను ఆశిస్తున్నానని జేమీ డైమన్ పేర్కొన్నారు. రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. భారత రిఫైనరీలు ప్రాసెస్ చేస్తున్న రష్యా చమురుకు ప్రత్యామ్నాయాలను అంత సులభంగా కనుగొనలేకపోవచ్చని డైమన్ గుర్తుచేశారు. సరఫరాలో ఆకస్మిక మార్పులుచేస్తే అది భారత రిఫైనరీలకే కాకుండా విస్తృత ఇంధన మార్కెట్లకు కూడా నష్టం కలిగిస్తుందని వివరించారు.

# అంబానీని వెనక్కినెట్టేసిన బిలియనీర్ అదానీ

వాణిజ్యం



**ముంబయి, సెప్టెంబరు 23:** రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని వెనక్కి నెట్టి, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మళ్లీ అగ్రపీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026 రిలీజ్ చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అదానీ కుటుంబం మొదటి స్థానంలో ఉంది. గౌతమ్ అదానీ సంపద యేడాది వ్యవధిలోనే 13 శాతం మేర పెరిగి రూ. 9.23 లక్షల కోట్లకు చేరుకుంది. ముఖేష్ అంబానీ నికర విలువ 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు (90 బిలియన్ డాలర్లు) పరిమితమైంది. అంబానీ కంటే రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అదానీ మొదటి స్థానంలో నిలిచారు. భారతదేశంలో కనీసం రూ.1,000 కోట్ల సంపద కలిగిన వ్యక్తులు 1,810 మందికి చేరారు. వీరి మొత్తం సంపద విలువ 12.8 శాతం ఎగబాకి ఏకంగా రూ. 187.5 లక్షల కోట్లకు చేరింది. ఇది దాదాపు భారతదేశ జిడిపిలో సగానికి సమానం కావడం విశేషం. దేశంలో డాలర్ - బిలియనీర్ల సంఖ్య సరికొత్త గరిష్టమైన 391కి చేరుకుంది. గత యేడాది కాలంలోనే కొత్తగా 27 మంది ఈ క్లబ్‌లోకి అడుగుపెట్టారు. మెటల్, స్టీల్, ఫార్మా రంగాలు ఈసారి అద్భుత పనితీరు కనబరిచాయి. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఎల్.ఎన్.మిట్టల్ సంపద 93 శాతం వృద్ధితో రూ.3.39 లక్షల కోట్లకు చేరి, మూడో స్థానానికి ఎగబాకింది. జాబితాలో అత్యధికంగా ఒక్క యేడాదిలోనే రూ.1.64 లక్షల కోట్ల సంపదను పెంచుకున్నవ్యక్తిగా ఆయననిలిచారు. వేదాంత గ్రూప్ అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.2.08 లక్షల కోట్లతో 9వ స్థానానికి, జేబీ కెమికల్స్ విలీనంతో టోరెంట్ ఫార్మా సమీర్ మెహతా కుటుంబం రూ. 1.89 లక్షలకోట్లతో 10వ స్థానానికి దూసుకొచ్చాయి.

## బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు తగ్గించేందుకు రూ.75,026 కోట్లకు ఆర్బీఐ వేరియబుల్ రివర్స్ రెపోరేట్ వేలం




**ముంబై, సెప్టెంబరు 23:** బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్య లభ్యతను తగ్గించే చర్యల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం ఓవర్‌నైట్ వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం ద్వారా రూ.75,026 కోట్లను వేలం వేసింది. రూ.75,000 కోట్లను ఉపసంహరించుకునేందుకు ఆర్బీఐ నోటిఫికేషన్ జారీ చేయగా బ్యాంకుల నుంచి రూ.87,993 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి. వీటిలో రూ.75,026 కోట్ల బిడ్లను మాత్రమే ఆర్బీఐ ఆమోదించింది. కట్‌ఆఫ్ రేటు, వెయిటెడ్ యావరేజ్ రేటు రెండూ 5.24 శాతంగా నమోదయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు లభ్యతను తగ్గించడం, ఓవర్‌నైట్ మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడం కోసం ఆర్బీఐ గత నెల నుంచి పలు రివర్స్ రెపోరేట్ వేలాలను నిర్వహిస్తోంది. ఈనెల 22 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.4.45 లక్షల కోట్ల మేర మిగులు ద్రవ్య లభ్యత ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో ఆర్బీఐ ఈనెల 17న రూ.50,000 కోట్లు, 21న రూ.25,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారా విక్రయించింది. ఓఎంఓ విక్రయాల సమయంలో బ్యాంకులు, ఇతర పెట్టుబడిదారులు ఆర్బీఐ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోని రూపాయి లభ్యత తగ్గుతుంది. ప్రస్తుత ద్రవ్య పరిస్థితులను నియంత్రించేందుకు మొత్తం రూ.1 లక్ష కోట్ల విలువైన ఓఎంఓ విక్రయాలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు ఆర్బీఐ ఇప్పటికే ప్రకటించింది. ఇందులో చివరివిడతగా రూ.25,000 కోట్ల విలువైన సెక్యూరిటీల విక్రయం సెప్టెంబర్ 28న జరగనుంది. ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్లతో భారీగా లిక్విడిటీబ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత భారీగా పెరగడానికి ప్రధాన కారణాల్లో ఎఫ్‌సిఎన్‌ఆర్(బి) డిపాజిట్ల సమీకరణ ఒకటి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.